# అపరాధ పరిశోధన

రు 3 నవంబర్ '76



Blank Page

సంపుటి: 22
సంచిక: 4

ఫోన్ నెం.
**36959**

# అపరాధ పరిశోధన

## డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

---

నవంబర్, 1976

---

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. పీ. మోహన్రావ్

# తొలిమాట

నమస్కారము. ఈ సంచికలో మీ అభిమాన రచయిత శ్రీ శ్యాంబాబుగారి కొత్త సీరియల్ 'కైలాసనగరం' ప్రారంభమైంది. చిత్రమైన కథావస్తువుతో కొత్త తరహాలో సాగే యీ నవల మీ మన్ననలను తప్పక పొందగలదని మా నమ్మకం. వచ్చే నెల "సప్లిమెంట్"లో మరో రసవత్తరమైన పెద్ద సీరియల్‌ను అందిస్తున్నాము.

'జీవిత చందా' పాఠకులను అమితంగా ఆకర్షిస్తున్నది. సుమారు ఆరున్నర సంవత్సరాల చందా ఒకేసారి కట్టటము వల్ల మీకు జీవితాంతము పత్రిక లభిస్తున్నది. ఇప్పటికి అనేకమంది జీవిత సభ్యులుగా చేరారు. సభ్యుల పేర్లు కూడా త్వరలోనే పత్రికలో ప్రచురించ నిశ్చయించాము.

పోతే, జీవిత చందాను పాఠకుల సౌకర్యం కోసం వాయిదాల పద్ధతినకట్టే ఏర్పాటు కూడా ఈ నెలలో చేశాము. మొదటి నెలలో రు. 30/—లు, ఆ తర్వాత వరుసగా 11 నెలలు రు. 20/—లు చొప్పున పంపవచ్చును. పత్రిక మీ మొదటి వాయిదా అందిన నెలనుండే అందజేయబడుతుంది. పూర్తి వివరాలు 183 వ పేజిలో చూడండి.

గత నెల "సప్లిమెంట్"లో నిర్వహించిన బ్యాలెట్‌లో శ్రీమతి వసుంధరగారి నవల 'చావుజోస్యం' ఉత్తమ నవలగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

# ఈ నెలలో....

## కథలు (మాసపత్రిక)

4. సజీవ సమాధి—శశిభూషణ్.
30. అజ్ఞాత దీవులు—వెంకట్రామ్.
49. క్వార్టరు నెం. 11—ఏ. లక్ష్మణరావు.
55. నేరస్థుల చరిత్ర—యం. కె. వి. శాస్త్రి.
83. తడిగుడ్డతో గొంతుకోత—హుస్సేన్ బాషా.
99. గుండెలు తీసిన బంటు—శశిభూషణ్.
115. మాయమైన షికారీ బృందం—ఏ. వీ. మోహన్రావ్.
125. చస్తే ఏం?—సుజనశ్రీ.
134. చివరి నేరం—అజీజ్.
147. కైలాస నగరం (సీరియల్)—శ్యాంబాబు.

## నవలలు (సప్లిమెంట్)

3. ఈశ్వరానంద శిష్యులు—కంచర్ల రమణ.
69. ఓడలో తుఫాన్—సంపత్.
100. ముగ్గురు బాస్‌లు—ఏ. వీ. మోహన్రావ్.
131. తిరుగులేని అబద్ధాలు—వసుంధర.

.ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, చెప్పుకోండి చూద్దాం, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!!

# సజీవ సమాధి?

శశిభూషణ్

ట్యాక్సీ బాక్ డోర్ తెరుచుకొని మెరుపు తీగలాంటి ఓ యువతి క్రిందకు దిగింది. వైట్ మినీస్కర్ట్ ధరించిం దామె. ఆవిడ పేరు సబ్నమ్.

డ్రైవర్ సిగరెట్ వెలిగించుకొని స్టీరింగ్ ముందే వుండి పోయాడు. అతని పేరు కృపాల్. టాక్సీ డ్రైవరు. అంతే కాదు షబ్నమ్ భర్త కూడా అతను.

"పాల్! పది నిమిషాల్లో వచ్చేస్తాను." సమాధానం కోసం ఎదురు చూడకుండా ఎదురుగా వున్న పాడుబడ్డ భవంతివైపు చక చక అడుగులేసింది షబ్నమ్.

కృపాల్ చూపులన్నీ అటువైపే వున్నాయ్. షబ్నమ్ అతని రెండో ప్రాణం. ఆమె తెలివితేటలకు తన శక్తిని జోడించి నిశ్చింతగా బ్రతికేస్తున్నాడు.

జాగ్వార్ నైట్ క్లబ్ ప్రొప్రయిటర్ గఫార్‌ఖాన్ చూపులు ఒకరోజు అప్రయత్నంగా షబ్నమ్ మీద పడ్డాయ్.

తన చూపుల్లో చూపులు కలిపిన మగవాణ్ని త్వరగా వదిలెయ్యదు షబ్నమ్. గఫార్ ఖాన్ హృదయాన్ని దోచేసింది ఎంతో శ్రమపడి. అతని అభిమానానికి పాత్రురాలైంది. కృపాల్ విషయం చెప్పకుండా జాగ్రత్త పడింది.

గఫార్ ఖాన్ భవంతిలో సకల భోగాలూ అనుభవిస్తున్న షబ్నమ్‌ని ఆ వేళ వుదయం ఓ వృద్ధుడు కల్సుకున్నాడు. ఆ సాయిబును తిరిగి కలుసుకోవటానికే ఇపుడీ పాడుబడిన భవనానికి వచ్చింది షబ్నమ్.

వెల్ల వేసేవారు లేకపోవటంతో గోడలు పెచ్చులూడి, రాగి మొక్కలు మొలిచి, సాలెగూళ్ళతో అసహ్యంగా కన్పిస్తున్నాయ్. నేలంతా దుమ్ముకొట్టుకుపోయివుంది. పైకప్పు ఏ క్షణంలోనైనా కూలిపోవటానికి సిద్ధంగా వున్నట్టుంది.

దడదడలాడుతున్నాయ్ షబ్నమ్ గుండెలు. స్వతహాగా ఆమె ధైర్యస్తురాలు. "చూచా!" పిల్చింది నెమ్మదిగా.

"వచ్చావా తల్లీ!" ఒకవైపు చీకట్లోంచి విన్పించింది.

తృళ్ళిపడి శబ్దం విన్పించిన వైపు చూపిందామె. అదే సమయంలో చక్‌మంటూ అగ్గిపుల్ల వెలిగింది. ఆ వెలుగులో ఒకవైపు గోడవారగా గోనె సంచుల మీద కూర్చునున్న వృద్ధుణ్ని చూసింది షబ్నమ్.

గబగబ అటువైపు వెళ్ళింది.

ఓ కొవ్వొత్తి తీసి వెలిగించాడా వృద్ధుడు. "బేటీ! కూర్చో." అని చెప్పి వృద్ధుడు లేచి సింహద్వారం వైపు వెళ్ళాడు. బలమైన తలుపుల్ని దగ్గరగా వేసి, తిరిగి గోనె సంచుల పక్కమీదకు చేరుకున్నాడు.

"ఇది దెయ్యాల భవనం అని అందరూ అనుకుంటున్నారు బేటీ. ఇటువైపు వచ్చే సాహసం ఎవరూ చెయ్యరు.

అయినా ముందు జాగ్రత్తకోసం తలుపులు మూసి వచ్చాను. వెలుగు బయటకు కన్పించే ప్రమాదం వుంది" అన్నాడు.

విసుగ్గా వుంది షబ్నమ్‌కి. "అసలు విషయం ఏమిటో చెప్పు చాచా?" అడిగింది విసుగుపైకి చూపించకుండా.

"బేబీ! డోంట్ బి హేస్టీ" నవ్వాడు వృద్ధుడు. "నాకు ఇంగ్లీష్ తెల్సివుంటుందని వూహించి వుండవ్. ఆ సంగతి నీ ముఖమే చెబుతోంది. ఇహ అసలు విషయం విను!" దీర్ఘంగా గాలి పీల్చి వదిలాడతను. "నీ తల్లిదండ్రుల వివరాలు నీకు తెలుసా?"

తల అడ్డంగా వూపింది షబ్నమ్.

"పోనీ నాగా విద్రోహుల గురించి తెలుసా?"

మళ్ళీ తల అడ్డంగానే వూపిందామె.

"నాగా విద్రోహుల గురించి విన్నాను. ఏవో దుండగాలు చేస్తూ ప్రభుత్వానికి చిక్కకుండా అడవుల్లో తిరిగేవారట. అంతకుమించి తెలియదు" అంది చివరికి.

గంభీరంగా నవ్వాడు వృద్ధుడు. "నీ తండ్రి నీ ఎదుటే వున్నాడు బేటీ."

అదిరిపడింది షబ్నమ్. "చాచా! ఏమిటి నీ వంటున్నది?"

"నిజమే తల్లీ. నేను చాచాని కాదు-బాబాని. అలా నువ్వు నన్ను పిలవకపోయినా బాధలేదు తల్లీ. జాగ్రత్తగా నా మాటలు విను" తలగడ క్రిందనుంచి చుట్ట తీసి వెలిగించుకున్నాడు వృద్ధుడు.

"నాగా భూమిలో స్వాతంత్ర్యానికై సాయుధ పోరాటం ప్రారంభమైంది. మొదట కొందరు అంటే నా వంటి వారు దౌర్జన్యపూరిత హింసాకాండలు ప్రారంభించారు. అజ్ఞాత వాసం పేరుతో అడవుల్లో తిరుగుతూ దోపిడీలు సాగించారు.

"తాజ్! నీ పేరు షబ్నమ్ కాదు బేటీ. జరీనాతాజ్. నీకు జన్మ ప్రసాదించిన దురదృష్టవంతుణ్ని నేనే. ఈ దుర్మార్గుని పేరు అంజాద్ ఖాన్.

ఒకవైపు నాగాలు దౌర్జన్య కార్యక్రమాలు సాగిస్తుంటే నేను నా అనుచరులతో కల్సి దోపిడీల్లో పాల్గొంటూ వచ్చాను. అప్పుడు నీవు మీ అమ్మ జులేకా "లంగ్ లేహ్"లో వుండేవారు. నేను నాగాభూమి, మణిపూర్ ప్రాంతాల్లో తిరుగుతుండేవాడిని. అప్పట్లో నీ వయసు పదేళ్ళు. నెలకోసారి నేను లంగ్‌లేహ్ వచ్చేవాణ్ణి.

ప్రభుత్వం నాగా విద్రోహుల్ని అణచివెయ్యటానికి పూనుకుంది. అజ్ఞాతవాసంలో వుండిపోయిన నాగా సంస్థలన్నింటినీ నిషేధించింది. ఫలితంగా నాగాల పేరుమీద దోపిడీలు సాగిస్తున్న నా వంటి వారికి చేతులనిండా పని లేకుండా పోయింది.

నాకు నలుగురు అనుచరులు వుండేవారు. ఆ నలుగురూ సంపాదించినది చాలని, ఇహ దోపిడీలు మానేద్దామని మొత్తుకున్నారు. అక్కడ మొదలయ్యింది వారికి నాకు మధ్య గొడవ. చివరికది చిలికి చిలికి తుఫానుగా మారింది. ముగ్గురు నా చేతుల్లో చచ్చారు. ఒకడు పారిపోయి, లంగ్ లేహ్ చేరుకొని మీ అమ్మను ఘోరంగా హత్యచేసి, నిన్ను ఎత్తుకెళ్ళి ఎవరికో అమ్మేసాడట.

ఆ విషయం తెల్సి వాణ్ణి అక్కడకక్కడే చంపేసాను. ఆ తర్వాత తెల్సింది నేను తొందరపడ్డానని. నీ కోసం అస్సాం, మణిపూర్, నాగాభూమిలోని అన్ని ప్రాంతాలూ గాలించాను. నా శ్రమ ఫలించలేదు.

నేను ఆ తర్వాత దోపిడీలు సాగించలేకపోయాను.

చనిపోయిన మీ అమ్మ సంగతి క్రమంగా మర్చిపోగలిగినా, బ్రతుకున్న నిన్ను మరువలేకపోయాను. నిన్ను ఎత్తుకెళ్ళి అమ్మేసిన వెధవ భార్య మరొకణ్ణి వివాహమాడి శ్రీనగర్‌లో వుందని తెల్సి, శ్రీనగర్ వెళ్ళాను. ఆమెద్వారా నీ వివరాలు ఏవైనా తెలుస్తాయోనని ఆశపడ్డాను. అక్కడ కొత్త సమాచారం మాత్రమే తెల్సింది.

మొట్టమొదటిసారిగా నువ్వు షిల్లాంగ్‌లోని ఓ వేశ్య గృహంలో విక్రయించబడ్డావ్. నేను శ్రీనగర్‌నుండి వచ్చి షిల్లాంగ్‌లోని ఆ గృహం యజమానిని కల్సుకొనేసరికి నువ్వు మరొక చోట మారావు. మొత్తం పాతికసార్లు భారతదేశం నలుమూలలా అమ్మబడ్డావ్ నువ్వు. ప్రతిసారీ అదృష్టం పెత్తెడు దూరంలోంచి నన్ను చూసి నవ్వేది. ఆఖరుసారిగా నువ్వు అమ్మబడిన ఊరు లంగ్‌లేహ్. భూమి గుండ్రంగా వుందనే నిజాన్ని ఋజువు చేస్తూ పుట్టిన చోటుకే తిరిగి చేరుకున్నావ్.

చివరిదఫా కూడా నన్ను ఓటమే వరించింది. నేను లంగ్‌లేహ్ వచ్చేసరికి నువ్వు ఆ ఇంట్లోంచి పారిపోయావని తెల్సింది. నిన్ను గుర్తించటానికి నాకున్న ఆధారం ఒక్కటే. నీ ఎడమకాలికి ఆరు వ్రేళ్ళు వున్న సంగతి నేనెప్పుడూ మరువలేదు."

మాటలు ఆపేసి ఆరిపోయిన చుట్టను అవతల పారేశాడు అంజాద్‌ఖాన్.

తన ఎడమ పాదాన్ని చూసుకోలేదు షబ్నమ్. ఆ కాలికి ఆరు వేళ్ళు వున్న సంగతి ఆమెకు తెలుసు. ఆసక్తిగా చూస్తోంది తండ్రినే.

తిరిగి ప్రారంభించాడు అంజాద్‌ఖాన్. "అంతేకాదు

బేటీ! నీ కుడి మోకాలిమీద పైసా పరిమాణంలో నల్లటి పుట్టుమచ్చ వుండివుండాలి. అది వుంటే నువ్వు తాజ్ అని నమ్ముతాను."

ఎగశ్వాస పీల్చి వదిలింది షబ్నమ్. ఫ్రాక్ అంచులు తప్పించి, అంజాద్ ఖాన్‌కి పుట్టుమచ్చ చూపించింది. "నువ్వు చెప్పిన రెండు గుర్తులూ నాకు సరిపోయాయ్ బాబా! జరీనా తాజ్‌ని నేనే నంటావా?" నవ్వుతూ అడిగింది.

ఆమె తల నిమిరాడు అంజాద్ ఖాన్. "బేటీ! నువ్వు నా కూతురు కాదని ఇహ భగవంతుడే దిగివచ్చి చెప్పినా నమ్మను. నిన్ను వెతికి కనుక్కోవటానికి నేనెన్ని బాధలు పడ్డానో చెప్పి నీ మనసు బాధపెట్టలేను. నువ్వు పడ్డ కష్టాల గురించి కూడా వినే ఓపిక, గుండెధైర్యం నాకు లేవు. నిన్ను వెదుకడంలోనే నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. ఇహ నీ జీవితమంతా ఆనందంగా గడిచిపోవాలి! నీవు, నీ పిల్లలు సర్వసౌఖ్యాలు అనుభవించాలి. అదే నా కోరిక!"

"బాబా!" హృదయపూర్వకంగా పిల్చింది తాజ్.

"చాలు బేటీ! ఈ పిలుపుకోసమే నేను ఇంతవరకు జీవించివున్నాను...." అని తలగడ చింపి, అందులోంచి ఓ కాగితాన్ని తీసి కూతురు చేతికిచ్చాడు అంజాద్ ఖాన్.

"ఆ కాగితం ఖరీదు కోటి రూపాయలు. జాగ్రత్తగా దాచుకో తల్లీ! దోపిడీల్లో నేను, నా అనుచరులు సంపాదించిన సంపదనంతా లంగ్‌లేహ్‌కి ఈశాన్యంగా పాతిక మైళ్ళలోనున్న బిస్రూబా పర్వత చరియలకు చేర్చాము. ఓ గుహలో ఆ సంపదనంతా భద్రపరిచాము. బేటీ! నేను అంతదూరం ప్రయాణం చెయ్యలేను. నీకు నమ్మకమైన వ్యక్తుల్ని తోడుతీసుకెళ్ళి ఆ సంపదను తెచ్చుకో!"

ఆశ్చర్యంగా వుంది తాజ్‌కి. ఆనందంగా వుంది. మరొక వైపు తండ్రి అనారోగ్య విషయం తల్చుకుంటుంటే బాధగా వుంది.

చేతిలోని కాగితాన్ని మడతలు విప్పి చూసింది తాజ్. కాగితం మధ్య ఓ స్త్రీ బొమ్మ గీయబడింది. రంగురంగుల బొమ్మ. కళ్ళు నల్లగా పెయింట్ చెయ్యబడ్డాయ్. నల్లటి చెప్పులు ధరించింది. నల్లటి కుక్కపిల్లతో షికారు వెళ్తున్నట్టుందామె.

తాజ్‌కి ఏమీ అర్థంకాలేదు. అర్థంకాని విషయాన్ని బాబాని అడిగింది.

నవ్వాడు ఖాన్. "బేటీ! ఆ నలుపులోనే వుంది అసలు రహస్యం అంతా...." అంటూ వివరంగా చెప్పాడు.

"బాబా! ఇప్పుడే వచ్చేస్తాను వుండు." అంటూ తలుపులు తెరుచుకుని బయటికి పరుగెత్తిందామె.

తృప్తిగా నిట్టూర్చి, గోనెసంచుల పక్కమీద వెనక్కి వాలి పడుకున్నాడు అంజాద్‌ఖాన్.

కృపాల్‌ని వెంటబెట్టుకుని తిరిగొచ్చిన తాజ్‌కి తండ్రి కన్పించలేదు. తండ్రి శవం దర్శనమిచ్చింది.

పవర్‌ఫుల్ షార్ట్ ఫోకస్ మైక్రోస్కోప్‌లో జరీనా తాజ్ యిచ్చిన కాగితంలోని స్త్రీ బొమ్మను పరీక్షిస్తున్నాడు గఫార్ ఖాన్.

ఆ బొమ్మలో మైక్రోడాట్స్ వుండటానికి వీలయ్యే ప్రదేశాల్ని వెదుకుతున్నాడు. నల్లగా పెయింట్ చెయ్యబడున్న బొమ్మ కళ్ళలో, చెప్పుల్లో, కుక్క ఒంటిమీద మొత్తం ఎనిమిది మైక్రోడాట్లు కన్పించాయ్. వాటిల్లో ఏవో అక్షరాలు, గుర్తులు కన్పించాయ్.

అదే గదిలో అటు ఇటు పచార్లు చేస్తోంది జరీనా తాజ్. గుమ్మం దగ్గరగా రాతివిగ్రహంలా నిలబడున్నాడొక నీగ్రో. అతని పేరు ముముంబా. గఫార్‌ఖాన్ బాడీగార్డ్. చిఱుతపులిని ఒట్టి చేతుల్తో ఎదుర్కొగల శక్తిసామర్థ్యాలు అతనికున్నాయ్. రకరకాల ఫైట్స్ తెల్సిన వ్యక్తి. జెయింట్ బాక్స్. కరాటేల్లో ప్రత్యేక అనుభవం సంపాదించివున్న బాక్సర్.

"షబ్నమ్! కమ్ హియర్!" అరిచాడు ఖాన్.

ప్రియుని ప్రక్కకొచ్చిందామె. "వాట్స్ ది మేటర్?"

"ఓ కాగితంమీద నేను చెప్పే వివరాలన్నీ వ్రాసుకో!" అంటూ మైక్రోడాట్స్‌లో మెరుస్తూ కన్పిస్తున్న వాక్యాల్ని చకచక చెప్పుకుపోయాడు గఫార్‌ఖాన్.

"మొత్తం నాలుగు గుర్తులు. మొదటిది లంగ్‌లేహ్‌కి ఎనిమిది మైళ్ళ దూరంలో వుంది. అది ఓ వాగు. దాని కిరువైపులా ఒడ్డున గచ్చపొదలు, గురువింద పొదలు అధికంగా వున్నాయ్. రెండవ గుర్తు పాడుబడిన వేణు గోపాలస్వామి ఆలయం. మరొక రెండు మైళ్ళు వెళితే మూడవ గుర్తు వస్తుంది. అది ఒక చిన్న పల్లెటూరు. పేరు లాల్‌లేహ్. కొండజాతివాళ్ళు నివసిస్తున్నారక్కడ. దాన్ని దాటి వెళితే నాల్గవ గుర్తు నీరులేని ఓ బ్రహ్మాండమైన నుయ్యి. అక్కడకు బిస్రూబా పర్వతశ్రేణులు కన్పిస్తుం టాయ్."

ప్రియుని మాటల్ని కాగితంలోకి చకచక ఎక్కిస్తోంది తాజ్.

పావుగంట తర్వాత ఖాన్ మైక్రోస్కోప్ ముందునుంచి లేచాడు. తన బాడీగార్డ్‌కి గబగబ ఏవో ఆదేశాలు యిచ్చి పంపేశాడు.

తను కాగితంలో వ్రాసిన విషయాల్ని చదివి విన్పించింది తాజ్. ఆమె నడుము చుట్టూ చేతులు పోనిచ్చి దగ్గరిగా లాక్కున్నాడు ఖాన్.

"షబ్నమ్! ఈ షిల్లాంగ్‌లోని వ్రేళ్ళమీద లెక్కింపదగిన ధనవంతుల్లోకి మనం కూడా చేరబోతున్నాం."

కిసుక్కున నవ్వింది తాజ్. "ముఝే మాఫ్ కర్నా మహారాజ్. నా పేరు తాజ్ ...జరీనా తాజ్...." అంటూ తన తండ్రి చెప్పిన విషయాలన్నీ ప్రియునికి తెలియజేసింది.

"వెరీ గుడ్! అవసరమైతే నేను కూడా పేరు మార్చేసుకుంటాను. మన పథకం సవ్యంగా పూర్తయితే ఈ దేశాన్నే వదిలేద్దాం! వాడ్డు యు సే డార్లింగ్?" అడిగాడు.

"వై నాట్? విత్ ప్లెజర్" అతన్ని అడవితీగలా అల్లుకుపోయింది జరీనా తాజ్.

## 3

సాయంత్రం ఆరు గంటలు!

చీకటి తెరలు ఒక్కసారిగా నలువైపులనుంచీ ముసురుకోవటం ప్రారంభిస్తున్నాయ్. వాతావరణం ప్రశాంతంగా వుంది. ఆకాశంలో ఎక్కడా మబ్బుతునకలు కన్పించటం లేదు. గాలితెరల ధ్వని అధికంగా లేదు.

తారురోడ్డుమీద వేగంగా ముందుకు దూసుకొస్తోంది బ్రిటీష్ మేడ్ ఫోర్ వీల్ లాండ్ రోవర్ జీపు. స్టీరింగ్ ముందున్న వ్యక్తి కృపాల్. అతని ప్రక్కన గఫార్‌ఖాన్ వున్నాడు. ఇటు చివరగా తాజ్ కూర్చుంది. వెనుక నీగ్రో ముముంబా వున్నాడు. అతని పాదాల ముందు నాలుగు రైఫిళ్ళు పడున్నాయ్.

గఫార్‌ఖాన్‌వద్ద రెండు రివాల్వార్లు, తాజ్ అధీనంలో

మరొక ఆటోమేటిక్ వున్నాయ్. సర్వహంగుల్తో బయలు దేరారు. ఇంచుమించు నలుగురికీ ఇరవై రోజులకు సరిపడే ఆహారపదార్థాలు వెంట తెచ్చుకుంటున్నారు.

హాట్ డ్రింక్స్ సంగతి సరేసరి!

కృపాల్‌ని తమ వెంట తీసుకెళ్ళటానికి మొదట గఫార్ ఖాన్ నిరాకరించాడు. అతనికి సర్ది చెప్పటానికి తాజ్ కాస్త శ్రమ పడిందనే చెప్పొచ్చు! ఎక్స్‌పర్ట్ డ్రైవర్ అని, అలాంటి వ్యక్తి తమ వెంట వుండటం ఎంతైనా మంచిదని నొక్కి చెప్పింది. ఆఖరుకు అంగీకరించక తప్పలేదు ఖాన్‌కి.

లాండ్ రోవర్ లంగ్‌లేహ్ చేరుకుంది- అర్ధరాత్రికి.

అస్సాంలో వర్షపాతం అధికంగా వుంటుంది. అది సెప్టంబర్ మాసం కావటంతో రోజులో నాలుగుసార్లు వర్షం రావటం, వెలియటం జరుగుతోంది. పొగమంచు రాత్రిపూట మరీ అధికంగా కురుస్తుంటుంది.

పొగమంచులో ప్రయాణం కష్టమని, ఆ రాత్రికి లంగ్ లేహ్‌లోనే గడిపి, మరుసటి రోజు ఉదయమే ప్రయాణం ప్రారంభించింది గఫార్‌ఖాన్ బృందం.

ఉదయం పదిగంటలు కావస్తున్నా పొగమంచు యింకా విడిపోలేదు. చలిచలిగా వుంది వాతావరం.

ముముంబా సామానులన్నీ సర్ది జీప్‌లో పడేసాడు. కృపాల్ జీప్ కానుకుని నిలబడి సిగరెట్ కాల్చుకుంటు న్నాడు. ఖాన్‌ని చూడగానే సిగరెట్ పారేసాడు. అతను చూడకుండా తాజ్ ముఖంలోకి చూస్తూ చిలిపిగా కన్ను గీటాడు.

తిరిగి ప్రయాణం ప్రారంభమైంది. పొగమంచు విడిపోక

మునుపే—ప్రయాణం సుఖంగా రెండు మైళ్ళైనా సాగక మునుపే వర్షం మొదలైంది.

వైపర్స్ ఆన్‌చేసాడు కృపాల్. దారి సరిగా కన్పించటం లేదు. హెడ్‌లైట్స్ ఆన్‌చేసి, జీప్ వేగం తగ్గించాడు. కంకరరోడ్డు కావటంతో అక్కడక్కడ చిన్నచిన్న గోతులు దర్శనమిస్తున్నాయ్.

రోడ్డు కిరుప్రక్కలా తేయాకు తోటలు కన్పిస్తున్నాయ్. తేయాకు మొక్కల నీడకోసం పెంచిన చెట్లు పిచ్చిగా వూగుతూ విచిత్రమైన శబ్దాల్ని వెలువరిస్తున్నాయ్.

మెరుపులు, ఉరుములమధ్య వర్షం క్షణక్షణానికీ విజృంభిస్తోంది. రోడ్డు మెలికలు తిరుగుతూ కొండలమధ్య నుంచి వెళ్తోంది.

"జీప్ వీల్స్ ఒక్కోచోట బురదలో కూరుకుపోతున్నాయ్. అవి స్లిప్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాడు కృపాల్. పోను పోను రోడ్ మరీ అధ్వాన్నంగా వుంది.

సాయంత్రానికి వర్షం క్రమంగా తగ్గు ముఖం పట్టింది. జీప్ మరో ఐదుమైళ్ళు ప్రయాణించేసరికి ఆకాశంలో సూర్యుడు కన్పించకపోయినా వర్షం మాత్రం పూర్తిగా వెలిసింది.

ఏదో చిన్న పల్లెటూరులా వుంది. ఊరు మధ్యకు వచ్చి ఆగింది లాండ్ రోవర్.

అందరినీ జీప్‌లోనే వుండమని హెచ్చరించి, జీప్‌నుండి క్రిందకు దిగాడు ఖాన్. పాతిక గజాలు నడిచి, ఎడమచేతి వైపునున్న ఓ యింట్లోకి వెళ్ళాడు.

పదినిమిషాల తర్వాత ధోవతి, నాసిరకం లాల్చీ ధరించిన

ఓ వ్యక్తి జీప్ వద్దకు వచ్చాడు. తలమీద పెద్ద తలపాగా వుంది. మెలితిరిగిన మీసాలు అతని ముఖానికి నిండుగా కన్పిస్తున్నాయ్. ఆ పల్లెటూర్లో అతనొక వైద్యుడు.

లంగ్‌లేహ్ పరిసరప్రాంతాల్లో గఫార్‌ఖాన్‌కి తెలియని వాళ్ళు లేరు. ఒకప్పుడు అతను జంగిల్ గైడ్‌గా అక్కడ వుండివుండటమే అందుకు కారణం.

వైద్యుడిని తనవాళ్ళకు పరిచయం చేసాడు ఖాన్.

"మనం వేట ముగించుకొని తిరిగొచ్చేవరకు జీప్‌ని ఇతను భద్రంగా కాపాడుతాడు. పాల్! జీప్‌ని ఇతని ఇంటి ముందు పార్క్ చెయ్."

వైద్యుడి ఇంటి ముందుకెళ్ళి ఆగింది జీప్.

## 4

వించెస్టర్ రైఫిల్ ఎడమభుజానికి తగిలించుకొని చకచక అడుగులేస్తున్నాడు గఫార్‌ఖాన్. అతని కుడిభుజానికి చిన్న ఎయిర్‌బేగ్ వ్రేలాడుతోంది.

అతని వెనుకే హుషారుగా అడుగులేస్తోంది జరీనాతాజ్. సన్నటి ఆమె నడుముచుట్టూ నల్లటి బెల్టు బిగింపబడింది. దానికి ఎటాచ్ చెయ్యబడిన కేస్‌లో బరువుగా వూగుతోంది రివాల్వర్. దాని బట్ బయటకు కన్పిస్తుంది.

వారికి వెనుగ్గా మెల్లగా నడుస్తున్నారు కృపాల్, ముముంబా. సామానులు మొత్తం వారిద్దరే మోస్తున్నారు.

ఆకాశంలో చెదిరిపోతున్న మబ్బుల చాటునుంచి సూర్యుడు తొంగిచూస్తున్నాడు. దారికిరువైపులా కన్పిస్తున్న చెట్లలోంచి నీటి బిందువులు అందంగా రాలి పడుతున్నాయ్. నేలంతా బురదగా వుండటంతో ప్రయాణం చురుగ్గా సాగటంలేదు.

ఐదునిమిషాల తర్వాత వాగును సమీపించారు నలుగురూ. ఉరుకులు, పరుగులతో ప్రవహిస్తున్నాయ్ వాగులో నీళ్ళు. ప్రవాహవేగం అధికంగా వుంది.

దారికి కాస్త ఎగువగా కర్ర వంతెన వుంది. అది ఎవరు నిర్మించారోగాని, చూస్తుంటే ఈ యుగంలో నిర్మించ బడింది కాదేమోనన్పిస్తోంది.

వంతెనవైపు నడిచారు నలుగురూ. ఖాన్, తాజ్ చేయి పట్టుకొని వంతెన దాటుతున్నాడు నెమ్మదిగా. వంతెన మొత్తం ఉయ్యాలలా అటు ఇటు వూగిపోవటం ప్రారంభించింది.

ఖాన్, తాజ్ ఇటువైపుకు చేరిన తర్వాత కృపాల్, ముముంబా వంతెన దాటి వీరిని కల్సుకున్నారు.

మళ్ళీ ప్రయాణం మొదలైంది.

తూర్పు దిక్కున సూర్యుడు గబగబ పైకెగబ్రాకుతూ వాతావరణాన్ని క్రమంగా వేడెక్కించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఏవో పక్షులు చేస్తున్న చప్పుళ్ళు చిత్రవిచిత్రంగా విన్పిస్తున్నాయ్. కాలిబాట కిరువైపులా ఎక్కువగా గురవింద పొదలు దర్శనమిస్తున్నాయ్.

ఆకాశాన్ని అంటుకోవాలని ప్రయత్నిస్తున్న టేకు చెట్లు, చిరుశబ్దాలతో ఊగుతున్న వెదురు పొదలు, ఎర్రటి పూలతో నిండిన మోదుగచెట్లు అక్కడక్కడ కన్పిస్తున్నాయ్.

దారి ప్రక్కనేవున్న ఓ చెట్టుక్రిందకు నడిచాడు ఖాన్. టార్పాలిన్ పరుచబడింది. నలుగురూ కూర్చున్నారు. విస్కీ బాటిల్స్ మిగిలిన ముగ్గురికీ పంచింది తాజ్. బిస్కెట్ పాకెట్లు అందించింది.

ఓ మగ్గునిండా బీర్ వంపుకొని నెమ్మదిగా సిప్‌చేస్తోంది తాజ్. బిస్కట్లు ముట్టుకోలేదామె.

ఖాన్ చూపులు అప్రయత్నంగా ఆమె ముఖంమీద పడ్డాయ్. ఎలాంటి భావాలూ వ్యక్తంకాని ఆమె ముఖం గంభీరంగా వుంది. స్వచ్ఛమైన నీటితో నిండివున్న కొలనులా వుంది. అగ్నిగోళంలోని తేజస్సు, వెన్నెలలోని చల్లదనం, నెత్తురులోని ఎరుపుదనం కన్పిస్తున్నాయ్ ఆ ముఖంలో.

ఎగశ్వాస పీల్చి వదిలాడు ఖాన్. తాజ్‌మీద ఈగవాలినా అతను భరించలేడు. ఆమెలోని ప్రతి అణువూ తన ఆనందంవరకే పరిమితం కావాలి!

పావుగంట విశ్రాంతి తీసుకున్నాడు నలుగురూ. ఖాన్ హెచ్చరించిన వెంటనే మళ్ళీ ప్రయాణం ప్రారంభమైంది.

నేలంతా తడితడిగా వున్నా, ముళ్ళు, రాళ్ళు అధికంగా వున్నా జంగిల్ బూట్లు ధరించి వుండటంతో వాటి బాధ తెలియటంలేదు ఎవ్వరికీ.

నాలుగుమైళ్ళు నడిచారు. పాడుబడిన దేవాలయం కన్పించింది.

## 5

భీకరంగా అరిచాడు ముముంబా.

అదిరిపడింది తాజ్.

అదే సమయంలో ఖాన్, కృపాల్ వెనుదిరిగి చూశారు. యిరువురి గుండెలూ దడదడలాడాయ్. ఖాన్ వెనక్కి వచ్చి నిల్చుంది తాజ్. అప్పటికే ఆమె ముఖంమీద స్వేదం స్థాన మేర్పరచుకుంది.

ముముంబా మోస్తున్న సామానులు నేలమీద చెల్లా

చెదురుగా పడివున్నాయ్. భయంకరంగా కన్పిస్తున్న కొండ చిలువ ఒకటి ముముంబా శరీరానికి అల్లుకు పోతోంది. అప్పటికే నాలుగు చుట్లు బిగించి వుంది.

దాని కంఠాన్ని పిసుకుతున్న ముముంబా ముఖం మరింతగా నల్లబడివుంది. మనిషి గజగజ వణికిపోతున్నాడు. మొండిధైర్యంతో నిలబడున్నాడు యింకా.

అతని ప్రక్కనే బ్రహ్మాండమైన ఒక మర్రిచెట్టు వుంది. దాని కొమ్మలు కాలిబాటమీదకు విస్తరించి వున్నాయ్. బహుశా కొండచిలువ ఆ చెట్టుకొమ్మల్లో వుండివుంటుంది. తాము తప్పించుకొచ్చేసారు. ఆఖరున వస్తున్న ముముంబా దాని దృష్టిలో పడివుంటాడు. అంతే! అతనిమీదకు దూకేసి వుంటుంది.

ఏం చేయాలో ఎవరికీ తోచటం లేదు. గన్ ప్రేల్చితే బుల్లెట్ పొరబాటున ముముంబాకి తగిలితే ప్రమాదమని ముగ్గురికీ తెలుసు.

సామాన్లు దించి, రైఫిల్ అందుకున్నాడు. కృపాల్.

కొండచిలువ తోకతో బలంగా ముముంబా మోకాళ్ళ వెనుక బాదింది. బాధగా అరిచి వెనక్కు విరుచుకుపడ్డాడతను.

ముముంబాని రక్షించటం అసాధ్యమని అన్పించింది కృపాల్ కి.

కొండచిలువ తన తలను అటు యిటు కదిలిస్తోంది. దాని తల విసురు చాలా ప్రమాదమైనది! తలతో ముముంబాని బాదాలని చూస్తోంది. నోరు పూర్తిగా తెరుస్తూ అడుగు పొడవున్న ఎర్రటి నాలుకను బయటపెడుతోంది.

తాజ్ గజగజ వణకసాగింది. ఖాన్ అచేతనంగా నిలబడి పోయాడు.

పాము కంఠం వదల్లేదు ముముంబా. మిలమిల మెరుస్తున్న దాని శరీరంపై నున్న చారలు చూస్తుంటే అతని గుండెలు దడదడలాడుతున్నాయ్.

ఒంట్లోని ఎముకలు ఒక్కొక్కటే విరిగిపోతున్నట్టుగా ముఖం చిట్లిస్తున్నాడు అతడు. పళ్ళ బిగువున బాధ భరిస్తున్నాడు. నల్లటి అతని ముఖంలో తెల్లటి పళ్ళు విచిత్రంగా మెరిసి మాయమవుతున్నాయ్.

దాదాపు ఇరవై అడుగుల పొడవుతో అతి భయంకరంగా కన్పిస్తోందా కొండచిలువ. తల అటుయిటు ఆడించటం ఆపుజేసింది కొన్ని క్షణాలు.

అంతే! ఆ క్షణాల్ని సద్వినియోగపర్చుకున్నాడు కృపాల్. చటుక్కున రైఫిల్ ఎత్తి, టెలిస్కోపిక్ సైట్ లోంచి గురిచూస్తూ ట్రిగ్గర్ నొక్కాడు.

"ధన్ ..." మంటూ చప్పుడైంది. కొండచిలువ తల గుండా దూసుకుపోయింది బుల్లెట్.

జేబులోంచి బటన్‌నైఫ్ తీసుకొని ముందుకు పరుగెత్తాడు ఖాన్, బటన్ ప్రెస్‌చేసి.

క్షణాలమీద కొండచిలువ శరీరం మూడు ముక్కలుగా మారిపోయింది. ముముంబాకి స్పృహ తప్పకపోయినా మనిషి బాగా భయపడిపోయాడు. అతను మామూలు మనిషి కావటానికి పావుగంట పట్టింది.

## 6

ఎప్పుడు ఎవరు తవ్వించారోగాని, దారి ప్రక్కనే కన్పిస్తున్న ఆ నుయ్యి చుట్టుకొలత దాదాపు ఎనభై అడుగులు వుంటుంది. లోతు ఎక్కువలేదు ప్రస్తుతం. అడుగుభాగం పదిహేను అడుగుల లోతులో వుంది. రాళ్ళు, ఎండుటాకులు

కన్పిస్తున్నాయ్. ఏవో పిచ్చిమొక్కలు మొలిచివున్నాయ్.

సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. ఎండ చిటపట మంటోంది.

నూతివద్ద నుంచి ఖాన్ చూపించినవైపు దృష్టి మరల్చింది తాజ్. బ్రసూబా పర్వతశ్రేణులు నున్నగా మెరుస్తూ అందంగా కన్పిస్తున్నాయ్ అక్కడకు.

"తాజ్!" ఖాన్ పెదవులు కదిలాయ్. "గమ్యంతోబాటు ప్రమాదాలకు కూడా మనం చేరువ అవుతున్నాం. ఇటుపై అడవి మరీ దట్టంగా వుంటుంది. మృత్యువు ఏ క్షణంలో ఏ రూపంలో విరుచుకు పడుతుందో వూహించటం కష్టం! సో....అందరూ జాగ్రత్తగా వుండండి."

ఏదో యోచిస్తున్నాడు కృపాల్. అతని భుజం తట్టాడు ఖాన్. "భయపడక! భయపడేవాడు జీవితంలో ఏమీ సాధించలేడు. ఏదో సాధించాలంటే తెగింపు కావాలి. అంతులేని సంపద మన స్వాధీనం కాబోతోంది. మన శ్రమకు తగిన ఫలితం లభించబోతోంది!"

దీర్ఘంగా గాలి పీల్చి వదిలాడు కృపాల్, తన సమాధానం అదేనన్నట్లు. ఖాన్‌ని ఎప్పుడు తుదముట్టించాలి? ఎలా తుదముట్టించాలి? అని యోచిస్తున్నాడతను.

ఖాన్ అర్భకుడు కాదు. అయివుంటే ఒకప్పుడు జంగిల్ గైడ్‌గా జీవించిన వ్యక్తి దాదాపు పది లక్షల రూపాయలు ఖరీదుచేసే నైట్‌క్లబ్‌కి సొంతదారుడు అయి వుండేవాడు కాదు.

కృపాల్, ముముంబా యధాప్రకారం బరువులు ఎత్తుకున్నారు.

మిగిలిన యిద్దరూ అప్పటికే పాతిక గజాలు వెళ్ళిపోయారు నాల్గవ గుత్తు దాటి.

ఎడతెగని ఆలోచనలతో అందరికంటే వెనుక నడుస్తు న్నాడు కృపాల్. దట్టంగా అడవి మొదలైంది.

ఒక్క క్షణం ఎక్కడైనా ఆగి సిగరెట్ వెల్గించుకోవా లనుకున్నాడు కృపాల్. అతను ఆగకమునుపే దారిప్రక్కనే వున్న పొదలోంచి ఏదో జంతువు అతనిమీదకు దూకింది. నిర్దయగా అతని ఎడమపిక్కను గాయపర్చింది.

"ఉఁయ్...." అంటూ మూలిగి సామాన్లు వదిలేస్తూ నేల మీద కొరిగాడు కృపాల్. అప్పుడు చూశాడు ఎలుగుబంటిని. వెంటనే "హెల్ప్.... హెల్ప్...." అంటూ కేకలుపెట్టాడు, తన భుజానికి రైఫిల్ వ్రేలాడుతున్న విషయంకూడా ఆ క్షణాల్లో గుర్తులేదతనికి.

మిగిలిన ముగ్గురూ వెనక్కు చూశారు. అప్పటికే పరిస్థితి విషమించిపోయింది.

కృపాల్ అరుపులతో ఎలుగు రెచ్చిపోయింది. బలంగా కర్చింది. కెవ్వున అరిచాడతను. ఒక కన్ను పోయింది పాపం! ఎలుగు దయ చూపలేదు. కృపాల్ ఎడమపాదాన్ని నోట కరచుకొని కసకస నమిలేసింది.

ఆపకుండా కేకలు పెడుతూనే వున్నాడు కృపాల్.

"ధన్...." మంటూ రెండు రైఫిళ్ళు ఏకకాలంలో గర్జించాయ్. బుల్లెట్లు రెండూ ఎలుగు డొక్కలో జొరబడి రెండోవైపునుంచి వెలుపలికొచ్చాయ్. ప్రక్కకు విరుచుకు పడిందా క్రూరమృగం భీకరంగా పురుముతూ. మరొకసారి "ధన్...." మంది వించెస్టర్. ఈసారి బుల్లెట్ ఎలుగు ముఖంలో దూరింది.

గిలగిల తన్నుకుంటూ కాసేపటికి ప్రాణాలు వదిలింది ఎలుగు.

కృపాల్ పరిస్థితి చూస్తుంటే మిగిలిన ముగ్గురికీ బాధ

గానే వుంది. పాదం బాగా గాయపడింది. అతను ఇప్పట్లో నడవలేడు. కన్ను పోయిన బాధ మరోవైపు!

"ఇతనికి ఫస్ట్ ఎయిడ్‌చేసి మనవెంట తీసుకెళ్ళటం అవివేకమేమో!" అన్నాడు ఖాన్, తాజ్ ముఖంలోకి చూస్తూ.

అదిరిపడ్డాడు కృపాల్. క్షణాల మీద అతని శరీరం చలి చెమటల్ని కక్కింది. దీనంగా భార్య ముఖంలోకి చూసాడు. ఆమె మీద అతనికి విశ్వాసం వుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ అవిడ తనకు ద్రోహం చెయ్యదని అతని నమ్మకం.

నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

"ఖాన్!" తాజ్ పెదవులు కదిలాయ్. "నువ్వు యింకా ఆలోచిస్తూనే వున్నావ్. నేను ఎప్పుడో ఓ నిశ్చయానికి వచ్చేసాను."

ఆమె చేతిలోకి ఆటోమేటిక్ వచ్చింది. క్షణంలో అది బుల్లెట్‌ని కక్కింది.

ఏదో చెప్పటానికి నోరు తెరిచిన కృపాల్, నోట్లో జార బడింది బుల్లెట్. అలాగే వెనక్కు విరుచుకు పడ్డాడా దుర దృష్టవంతుడు. క్షణాల మీద అతని జీవాత్మ భౌతికదేహం నుండి వేరైంది.

## 7

"డార్లింగ్! సర్వ సుఖాలతోబాటు అధిక జీవన వ్యయం కలిగినదేశం ఏది ప్రపంచంలో?" ప్రియుని చేయి పట్టుకొని నడుస్తున్న తాజ్ ఉన్నట్టుండి ప్రశ్నించింది.

"స్వీడెన్."

"అచ్ఛా! మనం స్వీడన్ వెళ్ళిపోదాం."

"నో అబ్జక్షన్. సంపద కళ్ళబడే వరకు కాస్త గాలి మేడలు కట్టడం మానెయ్యి!"

ఆ తర్వాత నోరు తెరవలేదు తాజ్. ఈగల్లా ముసురు కుంటున్న ఆలోచనల్ని దూరంగా తరిమేస్తూ హుషారుగా అడుగులెయ్యసాగింది.

ఖాన్ నడుస్తూనే సిగార్ వెలిగించుకున్నాడు. ఊపిరి తిత్తులనిండా పొగ పీల్చుకొని, సిగార్ నుసి విదిల్చాడు.

ఎదురుగా కోరికలు జయించిన మానవాతీత శక్తిలా వుత్తరం వైపు నుంచి ప్రారంభమైన బిస్రూబా పర్వత శ్రేణులు దక్షిణంగా విస్తరించి వున్నాయ్. కొన్ని చోట్ల కొండ నిట్ట నిలువుగా పైకి పెరిగివుంది.

విచిత్రమైన చప్పుడు హఠాత్తుగా ప్రారంభమైంది చుట్టు ప్రక్కలున్న పొదల్లోంచి.

ముగ్గురూ అదిరిపడ్డారు.

ముముంబా సామానులు క్రిందకు దించి, రైఫిల్ చేతుల్లోకి తీసుకున్నాడు. తాజ్ కంగారుగా అటు యిటు చూస్తోంది. శబ్దం క్షణ క్షణానికీ వీరికి చేరువ అవుతోంది.

"డార్లింగ్! ఏమిటా చప్పుడు?" లోగొంతుకతో అడిగింది తాజ్.

"అడవిపందుల మంద ఏదో ఇటువైపే వస్తున్నట్టుంది."

ఖాన్ మాటలు పూర్తి అవుతుండగా పాతిక అడవి పందులు వీరిని చుట్టుముట్టేసాయ్. వించస్టర్ ప్రేలింది మొదట. వెంటనే తనూ ఫైర్ ఓపెన్ చేసాడు ముముంబా. ప్రియుని వెనుక నిల్చుని రివాల్వర్ వుపయోగించటం ప్రారంభించింది తాజ్.

రెండు నిమిషాల్లో పది పందులు నేలకొరిగాయ్. పరిస్థితి

అర్థం చేసుకున్నాయోమో....మిగిలినవి పారిపోయాయ్.

వించస్టర్‌ని తిరిగి లోడ్ చేసాడు ఖాన్. "మామూలు పందుల్లా ప్రవర్తించవు ఇవి. మనిషి ఒంటరిగా కన్పిస్తే చీల్చి చెండాడే వరకు ఊరుకోవు. డర్టీ వైల్డ్ ఎనిమల్స్."

# 8

పర్వతాన్ని సమీపించారు.

తాజ్ వద్దనున్న కాగితం తీసుకున్నాడు ఖాన్. ఓసారి ఆ కాగితంలోని మేటర్‌ని చదువుకొని, గబగబ కొండ ఎక్కసాగాడు. అతని వెనుకే వెళ్తున్నారు మిగిలిన ఇద్దరూ.

ఏటవాలుగా నున్న కొండను కొంత దూరం ఎక్కి, ఒక మలుపు వద్ద చటుక్కున ఆగిపోయాడు ఖాన్. పళ్ళునూరాడు. అతని ముఖంలోని కండరాలు పొంగాయ్.

"డార్లింగ్! ఏం జరిగింది?" ప్రశ్నించింది తాజ్.

"మీ బాబా గుర్తుల ప్రకారం ఇక్కడ వుండాలి పగులు" అంటూ ఎదురుగా నున్న కొండరాళ్ళను కాలితో తన్నాడు. "దాదాపు పద్దెనిమిది సంవత్సరాలు అయిపోయింది. నిధిని ఇక్కడ భద్రం చేసాక మీ బాబా ఇటువైపు వచ్చినట్టు లేదు. లోనికి వెళ్ళే చీలిక ప్రకృతి సిద్ధంగా మూసుకుపోయినట్టుంది."

ఖాన్ కాలితో తన్నిన చోట కొండరాళ్ళను పరిశీలనగా చూసింది తాజ్.

"డార్లింగ్! జాగ్రత్తగా చూడు. ఆ రాళ్ళు ఒక మనిషి కదిలించటానికి వీలుగా వున్నట్టున్నాయ్. బాబానే వాటిని ఆ ఆ విధంగా పేర్చి వుంచాడామో!"

చేతిలోని కాగితాన్ని తాజ్ చేతికిచ్చాడు ఖాన్. ముముంబా సామాన్లు దించి ఖాన్‌కి సాయం చేసాడు. ఇద్దరూ కల్సి ఒక

రాయిని అవతకు నెట్టేసారు. మరో నాలుగురాళ్ళు ఇటు వైపులాగి, క్రిందకు దొర్లించేసారు. ఇరువురు ఒకేసారి ప్రక్క ప్రక్కనే నడిచి వెళ్ళటానికి వీలయ్యే దారి ఏర్పడింది.

ముగ్గురూ లోనికెళ్ళారు.

లోపల విశాలంగా వుంది గుహ. వెలుగు సరిగా లేక పోవటంతో ద్వారం దగ్గరే ఆగిపోయారు ముగ్గురూ కాసేపు.

వారి కళ్ళు ఆ చీకటికి అలవాటు పడటానికి కొన్ని క్షణాలు పట్టింది. నెమ్మదిగా ముందుకు కదిలారు. పోను పోను గుహ సన్నగా మారిపోయింది.

మరో నాలుగు మలుపులు తిరిగి, రెండవ గుహలో కొచ్చారు. ఈ గుహ ద్వారం మరీ యిరుకుగా వుంది. బాగా తలవంచి లోనికెళుతున్న సమయంలో ముగ్గురూ ఎంతో శ్రమపడ్డారు. ద్వారం వెడల్పు కూడా అంతంత మాత్రమే!

అంతా చీకటిగా వుండటం వలన మొదట ఏమీ కన్పించ లేదు ఎవ్వరికీ. టార్చ్‌లు వెలిగించారు.

## 9

ముగ్గురి కళ్ళూ చెదిరాయ్.

పదడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు కలిగిన చిన్న గదిలా వుందా గుహ. ఒక మూలగా తుప్పు పట్టి పోయిన తుపాకులు, ఈతచాపలు, ఏవో మట్టి పాత్రలు కన్పించాయ్. ఎదురుగా నున్న గోడవారగా మూడు చెక్క పెట్టెలున్నాయ్!

గుహ మధ్యలో సంపదవుంది. బంగారు నగలు, వెండి రూపాయలు, వెండినగలు, వజ్రాలు కుప్పగా పోయబడి వున్నాయ్. ఒకరు మొయ్యలేనంత సంపద!

ముందుకు పరుగెత్తాడు ఖాన్. నిధిని కాళ్ళతో చెల్లా చెదురు చేసాడు. ఒంగి చేతుల్తో కెలికాడు. "నోడవుట్! ఈ సంపద కోటి రూపాలేకాదు, అంతకంటే ఎక్కువ విలువే చేస్తుంది" పిచ్చిగా అరిచాడు.

చెల్లా చెదురైన నిధి మీద వెల్లకిలా పడుకుంది తాజ్. ప్రియుని ముఖంలోకి చిలిపిగా చూస్తూ అందంగా నవ్వింది. "ఎలాగైతేనేం, సాధించాం. బాబాని మనం ఎప్పటికీ మరువ కూడదు."

"ష్యూర్....ష్యూర్! ఆయన పేరు మీద నాలుగు అనాధ శరణాలయాలు నిర్మిద్దాం!" నవ్వాడు ఖాన్.

"నాకు మాటలు రావటం లేదు" అంటూ నగల్ని, వజ్రాల్ని దోపిటి నిండా తీసుకొని ముఖం మీద పోసుకుంది తాజ్, సంతోషంతో వుక్కిరి బిక్కిరి అవుతూ.

ఖాన్ పరిస్థితి కూడా యించుమించు అలాగే వుంది.

అప్పటి వరకు రాతి విగ్రహంలా నిలబడున్న ముముంబా ముందుకు కదిలాడు. చెక్క పెట్టెల్ని పరిశీలించాడు. అవి ఖాళీ సారా సీసాలతో నిండివుండటం చూసి, వెనుదిరిగాడు.

తాజ్, ప్రియుని వించెస్టర్ నెమ్మదిగా స్వాధీనం చేసుకొంది. అది గమనించలేదు ఖాన్. గమనించే స్థితిలో లేడు. అతని నడుము కిరువైలా కేసుల్లో వ్రేలాడుతున్న రివాల్వర్లు కూడా సంగ్రహించిందామె. చటుక్కున లేచి నిల్చుంది.

"ఖాన్! మై స్వీట్! అయాం వెరీసారీ. యు ఆర్ గోయింగ్ టుడై" అంది బిగ్గరగా నవ్వుతూ.

అదిరిపడ్డాడు ఖాన్. స్ప్రింగ్‌లా లేచి నిలబడ్డాడు. "తాజ్....నీకేమైనా పిచ్చెక్కిందా....?"

"షటప్!" రెండడుగులు వెనక్కు నడిచింది తాజ్,

"నువ్వు ఒక యంత్రానివి. ఆడదాన్ని బంగారు పంజరంలో వుంచి, అపురూపంగా చూసుకోగలవేగాని, ఆడదాన్ని ఎలా తృప్తిపరచాలో నీకు తెలియదు. మై డియర్ ఖాన్! సొసైటీలో నీ పరపతి పెరగటానికి నన్ను నీ ప్రియురాలిగా వాడుకున్నావే తప్ప నాపై ప్రేమ వుండికాదు."

కోపంతో ఊగిపోతున్నాడు ఖాన్.

జేబులు తడుముకున్నాడు. బటన్‌నైఫ్ మాత్రమే తగిలింది చేతికి.

"ఖాన్! కత్తి తీయటానికి చేయి జేబులోకి వెళ్ళిందంటే మెదడు బయటకు చిందుతుంది" హెచ్చరించింది తాజ్. "అల్లామీద నమ్మకం వుంటే అంతిమ ప్రార్థన చేసుకో!"

"ముముంబా! ఆ రాక్షసిని రెండుగా విరిచెయ్!" పిచ్చిగా అరిచాడు ఖాన్. ముముంబా వున్నచోటునుంచి కదల్లేదు.

తాజ్ వెనుదిరిగి చూళ్లేదు. అందంగా నవ్వింది. "ఖాన్! ముముంబా నీ బాడీగార్డ్ కాదు. నా బాడీ డ్రైవర్. నా శరీరంలో ఎన్ని బ్రేకులు వున్నాయో, మరెన్ని గేర్లు వున్నాయో ఇంకెన్ని క్లచ్‌లు వున్నాయో అతనికి బాగా తెలుసు. అందమైన ఫియట్ కారు వంటి నన్ను ఎలా స్టార్ట్ చెయ్యాలో ఎలా నడిపించాలో అతనికి తెలుసు. మన పరిచయం జరిగిన రోజునుంచీ ముముంబాకి నా. శరీరంమీద సర్వాధికారాలూ యిచ్చేసాను. ఇంకా పచ్చిగా చెప్పమంటావా?"

ఒక్కొక్క సంగతి వింటుంటే ఖాన్ బుర్ర పగిలిపోయేలా వుంది. "యూ డర్టీ బిచ్....కుత్తేకే బచ్చే...." అరుస్తూ మొండిధైర్యంతో ఎగిరి తాజ్‌మీదకు దూకాడు.

లేడిపిల్లలా ప్రక్కకు గెంతింది తాజ్. ఆమె రెండు భుజాలకు రైఫిళ్ళు వ్రేలాడుతున్నాయ్. చేతుల్లో రివాల్వర్లు

న్నాయ్.

"ఫెడీ...." మంటూ ఖాన్ ముఖంమీద తన్నాడు ముముంబా. బంతిలా ఎగిరి ద్వారం దగ్గరగా పడ్డాడు ఖాన్. పళ్ళు నాలుగు రాలి ఎక్కడో పడిపోయాయ్. బాధగా మూలుగుతూ లేచి నిలబడ్డాడు.

"ధన్...." మంటూ రివాల్వర్ ప్రేలింది. బుల్లెట్ ఖాన్ ఎడమజబ్బలో దూరింది.

ఆ గుహగోడలు దద్దరిల్లేలా అరిచాడు ఖాన్. గాయం లోంచి పొర్లుతున్న నెత్తురును చేత్తో ఆపాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. గాయం మండుతోంది. నిప్పుకణికతో ఎవరో కాలుస్తున్నట్టుగా వుంది. నేలమీద టపటప రాలిపడు తున్నాయ్ నెత్తురు బొట్లు. పళ్ళదిగువున బాధ భరిస్తున్నా డతను.

"ముముంబా! మై డార్లింగ్! ఖాన్ని చరిత్రాత్మకంగా చంపెయ్!" ఆజ్ఞాపించింది తాజ్.

పాంటు జేబులోంచి హేండ్గ్రెనేడ్ తీసాడు ముముంబా.

"నో! నో!" పిచ్చివాడికిమల్లే అరిచాడు ఖాన్. ప్రాణ భయం!

"మిస్టర్ ఖాన్!" ముముంబా పెదవులు కదిలాయ్. "అయాం వెరీ సారీ! జకీనా తాజ్ కోరికల్ని కాదనే శక్తి మానసికంగా నాకు లేదు. ఆమె తృప్తికోసం ప్రకృతి శక్తుల్ని తలక్రిందులు చేయవల్సినా వెనుదీయను. నేను ఫార్మాలిటీస్ తెల్సిన కిల్లర్ని కాదు!"

నిర్దయగా గ్రెనేడ్ని ఖాన్మీదకు విసిరాడు, సేఫ్టీపిన్ లాగేసి.

అప్పటికే నేలమీద పడుకొనివుంది తాజ్. గ్రెనేడ్ విసిరిన వెంటనే ముముంబా కూడా నేలమీదకు జారిపోయాడు.

గాయం పెడుతున్న బాధ గురించి పట్టించుకోకుండా చటుక్కున ప్రక్కకు పడిపోయాడు ఖాన్. అతని చేతిని తాకవల్సిన గ్రెనేడ్ ద్వారం పైనున్న గుహ గోడను తాకి, వెంటనే బ్రద్దలైంది.

"ధన్...." మంటూ పెద్ద విస్ఫోటంతో అటువైపు గోడ భాగం కుప్పలా కూలిపోయింది. పెద్ద పెద్ద రాళ్ళతో ద్వారం శాశ్వతంగా మూసుకుపోయింది. గ్రెనేడ్ తాకిడికి గురైన గోడలోంచి యింకా రాతి పలకలు, దుమ్ము రాలుతూ ఆ గుహ క్రమంగా నిండిపోయింది.

తమ కలలన్నీ కరిగిపోగా ఆ శిధిలాలక్రింద ముగ్గురూ సజీవసమాధి అయ్యారు. ***

తను కొత్తగా రాసిన నవలతాలూకు స్క్రిప్టు భర్తకు యిచ్చి చదవమంది విశాలాక్షి.

నవల శాంతంగా చదివిన విశాలాక్షి భర్త అన్నాడు: "ఈ నవల పేరూ, ప్రఖ్యాతలున్న పాత పబ్లికేషన్‌కు పంపుతావా? లేక కొత్తగా వెలసిన ఏదైన పబ్లికేషన్‌కు పంపుతావా?"

"ఏం? అలా అడుగుతున్నారు?" ప్రశ్నించింది విశాలాక్షి.

"ఏం లేదు. పాత పబ్లికేషన్ వాడైతే వచ్చిన నష్టాన్ని భరించగలడు. అదే కొత్త పబ్లికేషన్ వాడైతే, పాపం దివాలా తీస్తాడు" అని జవాబిచ్చాడు భర్త.

—ఎమ్. డి. బాబ్జీ, రాజమండ్రి.

# అజ్ఞాత దీవులు

వెంకట్రామ్

[రెండవ భాగము]

'అండ్లాదీవి'లో మా విజయాన్ని ట్రాన్స్‌మీటరు ద్వారా తెలుసుకున్న దేశాయ్‌గారు మమ్మల్ని అభినందించారు. మేము విజయవంతంగా తిరిగి వచ్చినందుకు ఓడలోని సిబ్బంది అంతా సంతోషముతో ఆ రాత్రి మాకు పార్టీ చేశారు.

ముఖ్యంగా మేనేజరు ముఖర్జీగారి ఆనందము పట్టనలవి గాకుండా ఉంది. ఆయన మమ్మల్ని అభినందిస్తూ, "ఫ్రెండ్స్ మన ఆపరేషన్‌లోని మొదటి ప్రయత్నం సఫల మవడము మన అదృష్టం. కాని, దీనిలో అదృష్టముకంటే దాని వెనుక దాగివున్న మీ యిద్దరి ప్రతిభ మెచ్చుకోదగినది. మిమ్మల్ని. మీరు చూపిన ధైర్య సాహసాలను అభినందించడానికి నాకు మాటలు చాలడము లేదు." అన్నాడు సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ.

మర్నాడు మా ప్రయాణం రెండవ దీవికి కొనసాగింది ఆ దీవి పేరు 'సిమలూర్'.

సిమలూర్ దీవిలో ఏముందో ఇంతవరకు ప్రపంచానికి ఎట్టి సమాచారము తెలియదు. ఈ చుట్టు ప్రక్కల సముద్రములో దీవులు కూడా ఏమీ లేవు. అందుకనే ఈ ప్రదేశమంతా నిర్మానుష్యంగా ఉంటుంది. సిమలూరు దీవిపై నరసంచారమున్నట్టు కూడా ఎటువంటి ఆచూకి లేదు.

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో నేను, రాజు సిమలూర్ దీవిపై అడుగుపెట్టాము.

మమ్మల్ని దించిన పడవ వెళ్ళిపోయింది. పడవ పై నుంచి దృష్టి మరల్చి, బ్యాగ్‌లు భుజాలకు తగిలించుకొని దీవి వైపు నడిచాము, నేను, రాజు.

దీవిలోనికి పరీక్షగా చూశాను. దీవి అంతా పచ్చని చెట్లతో నిండి వుంది. చెట్లను కొట్టివేసే వారు లేనందున ఏపుగా పెరిగాయి. చెట్లు దట్టంగా లేకపోయినప్పటికి ఎక్కువగానే ఉన్నాయి. పక్షుల కిలకిలారావము తప్ప దీవి అంతా నిశ్శబ్దంగా వుంది. కనుచూపు మేరలో నర సంచారము కాని, జంతుసంచారము కాని కనిపించలేదు.

నేను, రాజూ దీవిలోనికి బయలుదేరాము.

ఇద్దరమూ నడుస్తూనే చుట్టూ పరికిస్తున్నాము. ఏమైనా వింతలు, విశేషాలు కాని రాబోయే ప్రమాదాలుగాని తెలుసుకోడానికి మేము చుట్టూ చూస్తున్నాము.

"ఈ దీవిపై మనుష్యులున్నారంటావా?" అడిగాడు రాజు.

"ఏమో!" అన్నాను పరధ్యానంగా.

"ఉంటే మైలు దూరములో ఒక్కరయినా కనిపించరా!

కనీసము ఉన్నట్టు ఒక్క ఆనవాలయినా కనిపించటము లేదు," అన్నాడు రాజు.

"ఇంకా లోపలికి వెళ్ళి చూద్దాము. మనుష్యులు గాని, జంతువులుగాని ఏవున్నా తెలిసిపోతుంది" నా ఆలోచన చెప్పాను.

మరి కొంతదూరము నడిచి ఇద్దరము ఒక దగ్గిర ఆగి పోయాము. మేము నిల్చున్నచోట ఒక సరోవరముంది. నేనూ రాజూ దానినే పరీక్షగా చూస్తూ నిల్చుండిపోయాము.

సరోవరములో అక్కడక్కడా నీటిమొక్కలు తేలి సరోవరానికి అందాన్ని చేకూరుస్తున్నాయి. వాతావరణము ప్రశాంతంగా, చల్లగా ఉంది.

"విజయ్! ఆ చేపలు చూడు!"

రాజు నీళ్ళలోకి చూపించాడు. ఆశ్చర్యపోయాను నేను.

అందులో పెద్ద పెద్ద చేపలు తిరుగాడుతున్నాయి. అవి దాదాపు పది అడుగుల పొడవుంటాయి. ఆ చేపలు మామూలుగా లేవు. కళ్ళు మిరుమిట్లు గొలిపేలా రంగు రంగుల కాంతులను వెదజల్లుతూ చలిస్తున్నాయి. ప్రపంచములో ఇటువంటి చేపలున్నట్టుగా ఎవరికి తెలీదు. ఆ చేపల శరీరాల్లో వజ్రవైడూర్యాలేమైనా పొదగబడి ఉన్నాయేమో అనిపించింది నాకు.

స్పెషల్ బ్రాంచివారికని స్పెషలుగా తయారుచేసిన మినీ కెమెరాలు మా షర్టులలో అమర్చబడి వున్నాయి.

నేను వెంటనే రెండు మూడు ఏంగిల్సులలో చేపలను సరోవరాన్ని ఫోటోలు తీశాను. రాజు కూడా రెండు మూడు ఫోటోలు తీశాడు.

"ఇక వెళ్దామా?" లేచాను.

రాజు నన్ననుసరించాడు.

ఇద్దరమూ మళ్ళీ నడువసాగాము.

ఉన్నట్టుండి ఆకాశములో మేఘాలు కమ్ముకోసాగాయి. వర్షము పడేట్టు ఉంది అనుకున్నాను.

"వర్షం వచ్చేట్టుంది ఎక్కడైనా నిలబడదాము పద రాజూ!" అన్నాను.

ఇద్దరమూ ఒక పెద్ద చెట్టు క్రిందికి వచ్చి నిలబడ్డాము.

చిన్నచిన్న చినుకులతో వర్షము ప్రారంభమయింది. రాను రాను వర్షము ఉధృతము కాసాగింది. కొన్ని క్షణాల లోనే వాతావరణము భీకరమయ్యింది. ఉరుముల శబ్దముతో భూమి దద్దరిల్లసాగింది. పెళపెళారావములతో అక్కడక్కడా చెట్లు కూలిపోతున్నాయి.

వర్షము ఎక్కువ అవడముతో చెట్టు ఆకుల సందుల నుంచి వర్షపునీరు మాపైన పడసాగింది. కొంచెము సేపట్లోనే మేము ముద్దగా తడిసిపోయాము.

క్రమంగా చీకటి పడసాగింది. రాత్రి అవుతుందని గ్రహించాను.

ఉరుములు, మెరుపులు, వర్షము ఇంకా తగ్గలేదు.

రాత్రి చాలా సేపయ్యింది. ఇక ఆ రాత్రికి ఎక్కడో తలదాచుకోవటం మంచిదనిపించింది.

పడక ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలో నా కర్థము కాలేదు. చెట్టుక్రింద వర్షము పడుతుంది. పడుకోడానికి వీల్లేదు. వేరే దగ్గిరికి వెళ్ళాలంటే ఈ ప్రళయంలో, ఈ చీకటి రాత్రి వెళ్ళడము అసంభవము.

"ఎక్కడ పడుకుందాము రాజూ?" అడిగాను.

"ఇప్పు డెక్కడికీ వెళ్ళలేము గదా! ఈ చెట్టు బోదెకు

అనుకొని ఇలాగే పడుకుందాము" అన్నాడు రాజు.

రాజు చెప్పిన ఉపాయము తప్ప నాకు వేరే మార్గము తోచలేదు, గత్యంతరములేక చెట్టుబోదెకు ఆనుకొని నిద్ర కుపక్రమించాను.

బట్టలన్నీ తడవడమువల్ల బయట చలిగాలికి శరీరము ఇంకా చల్లబడి ఎముకలు కొరికేంత చలివేస్తుంది. ఒకవైపు చలి, యింకొక వైపు వర్షము నన్ను నిద్రకు దూరము చేశాయి.

రాజువైపు చూశాను, దాదాపు రాజుకూడా నా పరిస్థితినే అనుభవిస్తున్నట్టుగా చీకటిలో అస్పష్టంగా గ్రహించ గలిగాను. చాలాసేపు నరకయాతన అనుభవించి చివరకు మగత నిద్రకు లోనయ్యాను.

## 2

మెలకువ వచ్చింది.

తెల తెలవారుతుంది. పక్షుల కిలకిలారావములతో గూళ్ళ నుండి ఆహారాన్ని వెదుకుకుంటూ వెళుతున్నాయి. లేచి కూర్చుని రాజువైపు చూశాను. రాజు ఇంకా నిద్రలోనే వున్నాడు. తట్టి లేపాను.

మెల్లగా కనులు నులుముకుంటూ లేచాడు.

బ్యాగ్‌లవైపు చూశాను. ప్లాస్టిక్ బ్యాగ్‌లు కావడము మూలాన ఏమాత్రము తడువలేదు.

"ముఖము కడుగుకుందాము పద," లేచాను.

బ్యాగ్‌లోవున్న వాటర్ ఫ్లాస్క్‌లోనుంచి కొంత నీరు తీసుకొని ముఖము కడుక్కున్నాము. చెట్టుక్రింద కూర్చుని బ్యాగ్‌లో వున్న ఆహారాన్ని క్రింద పేపరు పరిచి పేపరులో వుంచాము.

ఇంతలో ప్రక్క పొదమాటునుంచి ఏదో సవ్వడి విని పించింది.

నేనూ రాజు ఇద్దరము ఒకేసారి తలెత్తి చూశాము.

ఎవరో ఇద్దరు వ్యక్తులు చేతుల్లో గన్స్‌తో క్రూరంగా మా వైపు చూస్తున్నారు.

నాగరిక ప్రపంచానికి తెలియని ఈ నిర్జనమైన దీవిలో నాగరికత తెలిసిన మనుషులా? అంటే మాకంటే మొదలే ఈ దీవిపైకి ఇంకొకరు వచ్చారన్నమాట!

అచేతనంగా వాళ్ళనే చూస్తుండిపోయాను.

"ఎవరు మీరు?" ముందుకు వచ్చి ఒకడు ఇంగ్లీషులో అడిగాడు,

నేను ఆశ్చర్యములోనుండి తేరుకోలేదు.

"మీరెవరు?" ఎదురుప్రశ్న వేశాడు రాజు.

"నీకనవసరము?" రెండోవాడు క్రూరంగా అన్నాడు.

"మా విషయం కూడా నీ కనవసరం!" రాజు మొండిగా అన్నాడు.

"మాటల్తో చెప్పరన్నమాట!" గట్టిగా అరిచాడు.

"చేతలుకూడా వస్తాయా?"

ఇద్దరము లేచి నిలబడ్డాము.

గన్ ముందు భాగముతో రాజు డొక్కలో పొడిచాడొకడు. రాజు పొట్ట చేత్తో పట్టుకుని అరుస్తూ క్రింద పడి పోయాడు.

రాజుకు స్పృహ పోయిందనుకున్నాను.

"చెప్తావా, వాడికి పట్టిన గతి నీకు పట్టాలా?" అరిచాడొకడు.

"ఏం, చెప్పాలి?" గట్టిగా అడిగాను.

"మీరెవరు? ఇక్కడికెందుకు వచ్చారు? మీది ఏ దేశము?"

చటుక్కున నా చేతి ప్రక్కనున్న బ్యాగ్ జ్ఞాపక మొచ్చింది. ఆలస్యము చేయకుండా బ్యాగు అందుకొని నాతో మాట్లాడుతున్న వాడి ముఖముపైకి బలంగా విసిరాను. అది స్పెషల్ బ్రాంచివారికోసము ప్రత్యేకంగా చేయబడిన బ్యాగు, మామూలు ప్లాస్టిక్‌లా కాకుండా చాలా గట్టిగా వుంటుంది.

అనుకోని దాటికి తట్టుకోలేక వెనక్కి విరుచుకుపడిపోయాడు వాడు,

వెంటనే రెండవవాని పైకి లంఘించాను. వాడితోపాటు నేనూ క్రిందపడిపోయాను. కుడిచేయి బిగించి బలంగా వాడి తలపై గుద్దాను. వెంటనే తల వాల్చేశాడు అతడు.

మొదట క్రిందపడినవాడు లేచాడు. గన్ పట్టుకొని నా వైపుకు వస్తున్నాడు. నేను క్రిందపడి వున్నాను. నా ముందు వచ్చి నిల్చాడు.

గభాల్న క్రింద పడివున్న రెండవవాడి గన్ అందుకొని నా ముందు నిలబడివున్న వాని కాళ్ళపై బలంగా కొట్టాను. వాడు అరుస్తూ నేలపై పడిపోయాడు. చేతులు బిగించి వాడి మెడపై బలంగా మోదాను. స్పృహ తప్పివున్న రాజు ముఖముపై వాటరు ప్లాస్కులోని కొన్ని నీళ్ళు తీసి చల్లాను.

మెల్లగా కదిలి లేచి కూర్చున్నాడు,

"వీళ్ళను ఏం చేద్దాము రాజూ?" అడిగాను.

ఆలోచించసాగాడు.

"ప్లాస్టిక్ వైరు ఇలా ఇవ్వు" అన్నాను.

"ఎందుకు?" అడిగాడు.

"వీళ్ళను బంధించి, స్పృహ తెప్పించి వీళ్ళెవరో తెలుసుకుందాము."

రాజు బ్యాగ్‌లో వున్న ప్లాస్టిక్ వైరు అందించాడు.

వైరుతో స్పృహతప్పిన ఇద్దరి చేతులు కాళ్ళు గట్టిగా బంధించాను. రాజు కొంత నీరు వాళ్ళ ముఖముపైన చల్లాడు.

మెల్లగా కదిలి ఇద్దరూ స్పృహలోకి వచ్చారు.

"మీరెవరు?" అడిగాను.

చప్పుడు చేయలేదు.

"చెప్తారా, హింసించి చెప్పమంటారా?" కోపంతో గట్టిగా అరిచాను.

మౌనంగా వున్నారు,

జేబులోనుండి చిన్నసైజు చాకు తీశాను.

చాకు తెరచి ఒకని మొఖముపై పొడిచాను. రక్తము కొద్దిగా చిమ్మింది. బాధతో గిలగిల్లాడిపోయాడు. అయినా నోరు మాత్రము మెదపలేదు.

రెండవవాడి దగ్గరకు వచ్చి ముఖముపైన, భుజముపైన, రెండుసార్లు గుచ్చాను. వాడు కూడా నోరు మెదపలేదు.

అరగంటసేపు ఎంత హింసించినా వాళ్ళు ఏమీ చెప్ప లేదు. ఇక వారిచే చెప్పించడము అసంభవము అని పించింది.

"ఏం చేద్దాము రాజు?"

"వీళ్ళిద్దర్ని ఎక్కడైనా పడవేసి, వాళ్ళ వేషాలలో మనము వెళ్దాము" అన్నాడు రాజు.

"ఎక్కడికి?"

"వాళ్ళ నివాసానికి. అక్కడికి వెళ్తే వాళ్ళిక్కడ ఎందు కొచ్చారు, ఏం చేస్తున్నారు అసలు వాళ్ళెవరు? అనేవి తెలుస్తాయి" వివరించాడు రాజు.

"నీ ప్లాను బాగానే వుందికాని వాళ్ళ నివాసము తెలుసు కోవడము ఎలా?" అన్నాను.

"చాలా తేలిక. రాత్రి వర్షము వెలసిన తరవాత వీళ్ళు వచ్చారు. ఎక్కడినుంచి వచ్చినా బురదలో అడుగుజాడలు మనకు స్పష్టంగా తెల్సిపోతాయి."

రాజు ప్లాను బ్రహ్మాండంగా వుంది. నేను ఆనందంగా ఒప్పుకున్నాను. బట్టలు మార్చుకున్నాము వెంటనే.

ఆగంతకుల్లో చెరొకరిని ఎత్తుకొని, కొంచెము దూరము వచ్చి ఇద్దరినీ ఒక గోతిలో పడవేశాము.

## 3

విసుగు విరామము లేకుండా అడుగుజాడల వెంట రెండుమైళ్ళ దూరము నడిచాము. ఈ రెండుమైళ్ళ దూరములో మా కెక్కడా ఆధునిక మానవులుగాని, ఆధునిక వస్తువులుగాని, వాటి ఆనవాళ్ళుగాని కనిపించలేదు. దారి అంతా బురదమయంగా వుంది.

మా ఇద్దరి చేతుల్లో ఇప్పుడు రెండు గన్స్ వున్నాయి. మేమిద్దరము ఇప్పుడు ఆగంతకుల వేషాల్లో ఉన్నాము. మేము ముందు జాగ్రత్తలో బ్యాగ్‌లో పెట్టుకున్న మేకప్ బాక్స్ మాకు సహాయపడింది.

"రాజూ, ఒక్క నిమిషము ఆగు" ముందు నడుస్తున్న రాజు భుజము తట్టి ఆపాను.

రాజు ఆగాడు.

"మన బ్యాగులను చుట్టుప్రక్కల ఎక్కడయినా దాచి

పెట్టి వెళ్దాము" అంటూ ప్రక్కనేవున్న పెద్ద పొదవైపు నడిచాను.

బ్యాగుతెరిచి అందులో అవసరమయిన వస్తువుల్ని కొన్ని తీసుకొని జేబుల్లో మరికొన్ని రహస్య ప్రదేశాలలో ఉంచుకున్నాము. బ్యాగుల్ని జాగ్రత్తగా పొదలో పెట్టి వాటిపై చెత్తా చెదారాలతో ఆనవాలు లేకుండా కప్పేశాము.

అడుగుజాడల వద్దకు వచ్చి మళ్ళీ నడువసాగాము.

పదినిముషాల తర్వాత రాజు ఒకదగ్గర ఆగిపోయాడు.

అడుగుజాడలు అక్కడ అదృశ్యమయ్యాయి.

చుట్టూ చూశాను. రాజు ప్రక్కనే ఒక పెద్ద ఎండిపోయిన చెట్టుంది. చెట్టుపైన ఎండిపోయిన కొమ్మలు తప్ప మరేమీ లేవు. చుట్టూ ఎక్కడా అడుగుజాడలు లేవు. చెట్లు కూడా లేవు. మరి వాళ్ళెలా వచ్చారు. ఆలోచించసాగాను.

రాజు మాట్లాడబోయాడు.

మాట్లాడవద్దని వారించాను.

ఎందుకంటే అడుగుజాడ లిక్కడే అదృశ్యమయ్యా యంటే ఇక్కడ సొరంగముగాని మరేదైనాగాని ఉండాలి. నా అనుమానాన్ని బలపరిచింది ఎండిపోయిన చెట్టు. ఈ దీవిపై మరెక్కడా ఎండిపోయిన చెట్లు లేవు. ఒకవేళ సొరంగము ఉండి మమ్మల్ని ఎవరైనా గమనిస్తే కష్టము.

ఉన్నట్టుండి ఎండిపోయిన చెట్టు రెండుగా చీలిపోయి దూరము జరిగిపోయింది. నా అనుమానము నిజమయింది.

లోపలికి చూశాను. భూమి అడుగుకి మెట్లు కనిపించాయి. మనస్సులో ఒక్కసారి దేవునికి నమస్కరించి లోపలికి అడుగుపెట్టాను. నాకు అంతా ఆశ్చర్యంగా, అయోమయంగా వుంది.

ఇద్దరమూ మెట్లు ఐదు నిమిషాలు దిగిన తర్వాత ఒకపెద్ద హాల్లోకి వచ్చాము. ఆ హాల్లో ఎవరూ లేరు.

మా కెదురుగా ఉన్న గోడపైన రెండు బల్బులు ఉన్నాయి. ఎర్రబల్బు వెలుగుతుంది. పచ్చ బల్బు వెలగడము లేదు. కరెంటు ఈ దీవిలోకి రాదు కాబట్టి ఇది జనరేటరు నుంచి వచ్చే విద్యుత్తన్న మాట.

ఎర్ర బల్బు ఆరిపోయి, పచ్చ బల్బు వెలిగింది. వెంటనే మా కెదురుగా వున్న గోడ తొలగిపోయి లోపలికి దారి ఏర్పడింది. ఇద్దరమూ లోపలికి నడిచాం. వెంటనే దారి మూసుకుపోయింది.

మేము నిలబడ్డ గది ఎక్కడో ప్రక్కలకు ప్రయాణము చేయసాగింది. అది లిఫ్ట్ అని గ్రహించాను. లిఫ్ట్ ఆగి, తలుపు తెరుచుకుంది.

నేను, రాజూ బయటికి వచ్చాం.

అక్కడొక హాలు వుంది. హాలంతా గందరగోళంగా వుంది. ఎవరి పనిలోవారు ఎక్కడెక్కడో తిరుగుతున్నారు. మమ్మల్నెవరూ పట్టించుకోలేదు. మా ప్రక్కనే వున్న రూమ్‌పై పచ్చ బల్బు వెలిగి రూమ్ తలుపు తెరుచుకుంది.

మేము ఆశ్చర్యములోంచి తేరుకుంటూ అందులోకి నడిచాము.

మేము గదిలోకి ప్రవేశించిన వెంటనే మా వెనుక తలుపు మూసుకుపోయింది.

మాముందు ఒక టేబులుంది. ఆ టేబుల్‌పైన ఒక టెలివిజన్. ఆ టేబుల్ వెనక ఒకమనిషి కూర్చుని వున్నాడు. ఆ మనిషి ముఖముపై గాట్లు లెక్కపెట్టలేనన్ని ఉన్నాయి. కళ్ళకు గాగుల్స్ పెట్టుకొని హుక్కా త్రాగుతూ

దర్పంగా వున్నాడా వ్యక్తి.

"వాళ్ళిద్దరు ఎవరు?" ఇంగ్లీషులో అడిగాడు.

నా కర్థమయింది. వాళ్ళిద్దరు అంటే అతను అడిగేది మమ్మల్నిద్దరిని గురించి అని.

"ఏమీ చెప్పలేదు" ఆగంతకుల గొంతును అనుకరించి అన్నాను.

"చెప్పించ లేకపోయారా?" అతను గట్టిగా అరిచాడు.

"లేదు సార్, మమల్ని చూడగానే భయపడి పరుగెత్తి అడవిలో మాయమయ్యారు" చెప్పాడు రాజు.

"నో, నేను నమ్మను" అతని గొంతుకకు రూమ్ దద్దరిల్లిపోయింది.

"నిజమే సార్" భయపడినట్టు నటిస్తూ మెల్లగా అన్నాను.

"వారివెంట మీరు పరుగెత్తలేదా?" గొంతుకస్థాయి ఏ మాత్రము తగ్గలేదు.

"పరుగెత్తాము సార్! కాని క్షణంలో మా కన్నుగప్పి మాయమయ్యారు!" తలవంచుకొని అన్నాను.

"ఇడియట్స్, వాళ్ళు మన అదృష్టము కొద్ది సరోవరము వద్దకు వచ్చి మన కంటబడ్డారు. వారిని కూడా పట్టుకోలేక పోతే మీరుండి దండగ! వెళ్ళండి! ఈసారి ఇలాంటి పొరపాటు జరిగితే మీ తలలు మీవి కావు, జాగ్రత్త!" హుంకరించాడు.

తలలు వంచుకుని ఇద్దరము వెనక్కి మరలాము.

నాకు కొంచెము కొంచెము అర్థము కాసాగింది. వీళ్ళిక్కడ ఏదో వ్యవహారము ప్రపంచానికి తెలియకుండా నడుపుతున్నాడు. మేము సరోవరమువద్దకు రాగానే వీళ్ళకు

టెలివిజన్ ద్వారా తెలిసిపోయింది. మమ్మల్ని గురించి తెలుసుకొని హతమార్చడానికి మనుషులను పంపారు. నాలో ఉత్సాహము పెరుగసాగింది. ఇదేదో తెలుసుకో వల్సిన విషయమే.

గదిలోనుండి బయటికి వచ్చిన మాకు ఎటు వెళ్ళాలో తెలియలేదు.

"ఎటు వెళ్దాము?" మెల్లగా చెవిలో అన్నాడు రాజు.

"ఇక్కడ మనల్నెవరూ పట్టించుకోడము లేదు. అంతటా తిరిగి అసలు సంగతేమిటో తెల్సుకుందాము" నేను మెల్లగా రాజు చెవిలో అన్నాను.

రాజు సమాధానంగా తల వూపాడు.

ఇద్దరమూ ఒక హాలు దగ్గరికి వచ్చాము.

లోపలికి తొంగిచూశాను. నా కళ్ళు తిరిగినట్టయ్యాయి. లోపలన్నీ పెద్దపెద్ద టేబుల్స్. వాటికెదురుగా దాదాపు యాభై మంది నిలబడివున్నారు. అందరూ ఏవేవో కెమికల్స్‌తో పనిచేస్తున్నారు. మరికొందరు కలుపుతున్నారు. అదేమిటో దూరమునుంచి చూసిన నాకు తెలియలేదు. వాళ్ళెందుకిన్ని ప్రయోగాలు చేస్తున్నారు. అసలు వీళ్ళీ దీవిలో వుండడానికి కారణము నాకంతుపట్టటంలేదు.

"రాజూ, చీకటి పడేవరకు ఎక్కడైనా దాక్కునివుండి, అందరూ పడుకున్నాక అసలు విషయాన్ని పరిశోధిద్దాము" అన్నాను మెల్లగా.

రాజు సరేనన్నాడు.

ఇద్దరమూ అనువైన ప్రదేశంకోసం వెదకసాగాము.

## 4

అంతా గాఢాంధకారము. ఉదయమంతా పనిచేసి అలసిపోయినవాళ్ళు ఎవరి స్థానాల్లో వారు నిద్రిస్తున్నారు. నేను,

రాజు మెల్లగా కదిలాము.

మేమిద్దరము చదీచప్పుడు కాకుండా ఉదయము మేము చూసిన బాస్ గదివైపుకు కదిలాము. నేను మెల్లగా నా కాలర్‌కు ఫిక్స్‌చేసివున్న మినీ టార్చ్ తీశాను. టార్చ్ వెలిగించి తలుపుపైకి ప్రసరింపచేశాను. టార్చ్ వెలుతురు రెండు ఇంచ్‌ల వెడల్పు మాత్రమే పడుతుంది.

తలుపు తెరవడానికి ఏమైనా మీటలున్నాయేమో వెదక సాగాను.

పదిహేను నిమిషాలు తలుపు చుట్టూ వెదికినా ఎటువంటి స్విచ్‌లు కనపడలేదు. ఇక లాభములేదని మెల్లగా లాబ్ వైపు కదిలాము.

లాబ్ తలుపులు ఉదయంలాగే తెరిచివున్నాయి. ఇద్దరమూ లాబ్‌లోనికి ప్రవేశించాము, టార్చి వెలిగించి చూశాను. కెమికల్స్ ఉదయములాగే ఎక్కడివక్కడే వున్నాయి. టార్చివేసి వాటిని పరీక్షగా చూశాను. అవేమిటో నాకు తెలియలేదు.

ఇంకా ఏమైనా కన్పిస్తాయేమోనని అన్నిచోట్ల టార్చి వేసి చూస్తున్నాను.

ఒక మూల నాకొక స్విచ్ కనిపించింది. అది రాజుకు చూపించాను. అదేమిటో మాకర్థము కాలేదు. అదేమిటో తెలుసుకోలంటే దానిని నొక్కాలి.

ఉన్నట్టుండి మా కాళ్ళక్రిందున్న భూమి జర్రున భూమి లోనికి జరిగిపోయింది.

ఇద్దరము దఢాలున అడుగున పడిపోయాము.

ఇంతలో లైటు వెలిగి అక్కడంతా వెలుతురుతో నిండిపోయింది. కళ్ళు కాంతికి అలవడ్డాక చూశాను. మే

మిప్పుడొక చిన్న గదిలో బంధించబడివున్నాము.

"డియర్ బాయ్స్!"

మాటలు వినవచ్చినవైపుకు చూశాను. మాటలు స్పీకరులో గది మూలనుంచి వినిపిస్తున్నాయి.

"నేనెవరో మీరు గ్రహించారనుకుంటాను. మీరు నా మనుషులు కారని నేనుదయమే తెల్సుకున్నాను. నేను మిమ్మల్ని ఉదయమే బంధించేవాణ్ణి. కాని, నా స్థావరములోకి వచ్చాక మీరెక్కడా వెళ్ళలేరని నాకు తెలుసు. అందుకే విడిచివుంచాను.

ఇప్పుడు చెప్పండి. మీరెవరు? ఈ దీవికి ఎందుకొచ్చారు?" ఆ స్పీకరులోనే వినిపించింది.

అతని నవ్వు వికటంగా వినిపించింది స్పీకర్లో.

"మీరు తెలుసుకున్నదేమిటో, తెలుసుకోనిదేమిటో నేనే చెబుతాను వినండి. నేను చైనా దేశస్థుణ్ని. మా దేశము ఇక్కడొక స్థావరాన్ని స్థాపించింది. దానికి అధ్యక్షుణ్ణి నేను. ఈ స్థావరము ఇక్కడెందుకు స్థాపించారో తెలుసా? మా సిద్ధాంతాలను ప్రపంచములో వ్యాపింపచేయడానికి.

అలా చెయ్యాలంటే ముందుగా అన్ని రాజ్యాలని మా అదుపులోకి తెచ్చుకోవాలి. దానికి ఒకే మార్గముంది. మొట్టమొదలు బలంగా వున్న ఇండియావంటి దేశాలను పూర్తిగా నాశనము చేయాలి. అప్పుడుగాని మిగతా దేశాలు మా ఆధీనములోనికి రావు.

అందుకే ఈ దీవిలో బాంబింగ్ స్టేషన్ నెలకొల్పింది మా దేశము. బాంబులు కూడా తయారయ్యాయి. ఇంక కొద్దిరోజుల్లో వాటిని ఇక్కడ్నుంచే ప్రయోగిస్తాము. ఇక్కడ్నుంచి ప్రయోగించడానికి కావల్సిన ఏర్పాట్లు కూడా

జరిగిపోయాయి.

ఇదంతా మీకు ఎందుకు చెప్పానో తెలుసా? ఈ ఆఖరి క్షణాల్లోనైనా ఒక్క నిజము తెలిస్తే చనిపోయాక మీ ఆత్మకు శాంతి లభిస్తుందని. మీరు ఇండియన్స్ కదూ! మీ ఆచారము ప్రకారము వచ్చే జన్మంటూ వుంటే మళ్ళీ కలుద్దాము."

"అంటే?" అనుమానంగా అన్నాను.

"ఇంకా వివరించాలా మిస్టర్. మీరిప్పుడు ఐస్ప్లాంట్ లో వున్నారు. దాన్ని నేనిప్పుడే ఆన్ చేస్తున్నాను. మీరు చల్లగా మరో అరగంటలో చచ్చిపోతారు. గుడ్ బై"

స్పీకర్ లో నుంచి వస్తున్న మాటలు ఆగిపోయాయి.

## 5

క్రమంగా గది చల్లబడసాగింది.

నాకేం చెయ్యాలో తోచలేదు. చుట్టు చూశాను. రూమ్‌కు ప్రక్కనుంచి ఒక డోర్ వుంది. డోర్ దగ్గరకు వెళ్ళి లాగాను రాలేదు.

డోర్ ఉక్కుది. విరగ్గొట్టడానికి వీలులేదు.

మళ్ళీ మధ్యకు వచ్చి చుట్టూ చూశాను. ఒక్క వెలుగు తున్న బల్బ తప్ప మరేవస్తువు లేదు ఆ గదిలో.

ఆలోచించసాగాను.

రాను రాను శరీరము చలికి తట్టుకోలేక వణక సాగింది. గది ఇంకా చల్లబడసాగింది. మా శరీరాల్లో కూడా రక్త ప్రసరణము తగ్గి శరీరములోని రక్తము గడ్డ కట్టసాగింది. ఇంకో అయిదు నిమిషాల్లో శరీరములోని రక్తము పూర్తిగా గడ్డకట్టి మేము చనిపోతాము.

నా మెదడులో చటుక్కున ఒక ఆలోచన మెరిపింది

గదిలో వున్న బల్బ్ వైపు చూశాను. అది నాకు అందదు.

"రాజు ఇటురా!" మెల్లగా రాజు చెవులో అన్నాను.

గట్టిగా మాట్లాడితే బయటికి వినిపించే ప్రమాదముంది. రాజును సూటిగా బల్బ్ క్రింద కూర్చో బెట్టాను.

"రాజూ, నేను నీ భుజాలపై నిల్చుంటాను. నీవు మెల్లగా గోడను ఆధారముగా చేసుకొని లేచి నిలబడు." చెవిలో మెల్లగా చెప్పాను.

నేను రాజు భుజాలపైన నిలబడ్డాను. రాజు మెల్లగా గోడను ఆసరా చేసుకొని పైకి లేవసాగాడు.

ఇద్దరమూ చలికి తట్టుకోలేక పోతున్నాము.

రాజు పూర్తిగా లేచి నిలబడ్డాడు. నేను జేబులో నుంచి కర్చీఫ్‌ను రెండు మూడు మడతలు వేసి దానితో బల్బును తీసి జేబులో వేసుకున్నాను.

బల్బు వేడి సన్నగా తగలగానే హాయిగా అనిపించింది. బల్బును తీయగానే గది అంతా చీకటి అయిపోయింది.

నోరు తెరిచి పండ్ల లోపలి భాగాన ఉన్న ఒకరాగి తీగను తీశాను. రాగి తీగను కొండిలా వంచి కర్చీఫ్‌తో పట్టుకున్నాను. అంధకారములోనే బల్బ్ హోల్డార్‌లోని ఎలక్ట్రిక్ రాడ్స్‌కు ఆనించాను. వెంటనే 'చక్'మనే శబ్దముతో మెయిన్ ఫ్యూజ్ ఎగిరిపోయింది.

అంతే!

చల్లగాలి ఆగిపోయింది. అంటే ఫ్యూజ్ కాలిపోవడముతో కూలింగ్ మిషన్స్ ఆగిపోయాయన్న మాట!

ఆనందంగా రాజు పైనుంచి క్రిందికి దూకాను.

"రాజూ ఫ్యూజ్ ఎందుకు పోయిందో చూడడానికి వాళ్ళిందులోకి వస్తారు. వారిని దెబ్బతీసి మనము బయట

పడాలి."

ఇద్దరమూ తలుపు దగ్గరకు వచ్చి చెరొక వైపుకు నిలబడ్డాము. మా యిద్దరి చేతుల్లో రివాల్వర్‌లు రెడీగా వున్నాయి.

ఐదు నిమిషాలు గడిచాయి.

ఎవ్వరో తలుపు తీస్తున్నట్టుగా శబ్దమయ్యింది. నేను ఎదురు చూడసాగాను. తలుపు పూర్తిగా తెరుచుకుంది. ఇద్దరు వ్యక్తులు లోపలికి వచ్చారు. ఒకని చేతిలో గన్ ఉంది. మరొకని చేతిలో దీపముంది.

మేమిద్దరము వెనుకనుంచి వాళ్ళ మెడపైన రివాల్వర్‌లు ఆనించాము.

"గన్ విడిచెయ్యి" హుంకరించాడు రాజు.

చప్పుడు చేయకుండా గన్ విడిచిపెట్టాడు.

"వెనక్కి తిరగండి."

ఇద్దరు వెనక్కి తిరిగారు.

"పదండి బయటికి వెళ్ళడానికి దారి చూపించాలి" అన్నాను.

"కరెంటు లేకపోతే బయటికి వెళ్ళరాదు" భయంతో అన్నాడొకడు.

"సరె, ఫ్యూజ్ ఎక్కడుందో చూపించు. నేను బాగు చేస్తాను" అన్నాను.

వాళ్ళు మెల్లగా ముందుకు కదిలారు. మేము వాళ్ళననుసరించాము.

కొంత దూరము వచ్చాక ఒక దగ్గిర ఆగారు.

ముందుకు చూపించారు. అక్కడే మెయిన్ ఫ్యూజ్ వుంది.

"రాజూ, నువ్వు వీళ్ళిద్దరిని జాగ్రత్తగా కవర్ చెయ్యి.

నేను ఫ్యూజ్ వేస్తాను" అని చెప్పి ఫ్యూజ్ వద్దకునడిచాను.

ఇంతకు ముందు కర్చీఫ్‌లో వుంచిన రాగి తీగను తీసి ఫ్యూజ్ వేసి ఆన్ చేశాను.

అంతటా లైట్లు వెలిగాయి.

"ఊఁ. పదండి" ముందుకు నడిచాము.

వాళ్ళు మీటలు నొక్కుతున్నారు. గోడలు కదిలిపోతు న్నాయి. చివరకు మేము మొదలు దిగిన మెట్లువరకు వచ్చాము. వాళ్ళు చివరి మీటను నొక్కారు. బయట ఎండి పోయిన చెట్టు విడిపోయి దారి నిచ్చింది.

"ఊఁ రెడీ రాజూ" అరిచాను.

మా ముందు నడుస్తున్న యిద్దరు అరుస్తూ కూలి పోయారు. మా రివాల్వర్‌లకు సైలెన్సర్‌లు అమర్చడము వలన ఏ మాత్రము శబ్దము కాలేదు.

వెంటనే నేను నా కుడికాలు నెత్తి బూటు అడుగున వున్న సోల్ ప్రక్కకు జరిపాను. అందులో వున్న చిన్న వస్తువును బయటికి తీశాను. అది టైంబాంబు!

ఈ బాంబు చాలా శక్తివంతమయ్యింది. ఇటువంటి ఒక్క బాంబుతో ఈ దీవిలో ఉన్న జీవరాశినంతా నాశనము చేయవచ్చు.

టైంబాబును పైకి తీసి ఇంకో మూడు గంటలకు టైము ఫిక్స్ చేసి, ఎవరు చూడకుండా ఒక మూలన దాచేశాను.

ఇద్దరము పైకి వచ్చాము.

పొదలో వున్న మా బ్యాగులు తీసుకొని చీకట్లో సముద్రము వైపు పరుగు దీశాము.

—(సశేషం)

# క్వార్టరు నెం. 11

ఏ. లక్ష్మణరావు

ఆ ఊళ్ళో కొత్తగా వెలిసింది బ్లాక్ ఆఫీసు. కొత్తగా....

అంటే సుమారు రెండేళ్ళ క్రితం, జాయినింగ్ రిపోర్ట్‌తో పాటు క్వార్టర్స్‌కోసం అప్లికేషన్‌కూడా బి. డి. ఓ. గారి టేబుల్ మీదుంచాను.

"సారీ మిస్టర్ మూర్తీ! కొన్నాళ్లు ఆగితే తప్ప క్వార్టర్స్ దొరికే అవకాశం లేదు. ప్రస్తుతం ఖాళీలేవు...." బి.డి.ఓ. గారు ఇంకేదో అనబోతుంటే మధ్యలోనే అందుకున్నాను.

"మీరు ఎలాగైనా దయతలచాలి సార్! ఈ ఊళ్ళో నాకు తెలిసినవాళ్లు.... కనీసం ముఖపరిచయం ఉన్నవాళ్లు కూడ లేరు. నా ఫేమిలీని వీలయినంత త్వరలో తీసుకురాక తప్పదు, సార్! మీరేం అనుకోకపోతే క్వార్టర్ నెం-11 ఖాళీగా ఉందని విన్నాను. దయచేసి...."

"ఓ....? ఆ సుందరంగారి పక్క క్వార్టరా? అఫ్‌కోర్స్. అది ఖాళీగానే వుంది.... కాని...."

"ఆ క్వార్టర్ గురించి విన్నాను సార్. నా కలాంటి భయాలేం లేవు. అది కాస్త యిప్పిస్తే నా తిప్పలేవో నేను పడతాను" వినయంగా అన్నాను.

మరో అభ్యంతరం కనిపించలేదు బి.డి.ఓ. గార్కి. ఒక్కక్షణం తర్వాత.... "ఆల్‌రైట్! మీ పని చూసుకోండి. హెడ్‌క్లార్క్‌తో చెప్పి ఆర్డర్ టైప్ చేయించండి. వెళ్ళే టప్పుడు తాళంచెవి తీసుకెళ్ళండి."

"థాంక్యూ సర్!" అన్నాను ఆనందంగా.

క్వార్టర్ నెం-11 లో దిగుతున్నానన్న మాట వినగానే ఆఫీసు స్టాఫ్ అంతా ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టారు.

నిజానికి జరిగిందేమిటంటే ఆరుమాసాల క్రితం ఓ ఇల్లాలు భర్తపెట్టే బాధలు భరించలేక ఆ ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. ఆవిడ దయ్యమై తిరుగుతోందని ప్రతీతి. తరువాత ఆ క్వార్టరులో దిగిన ఒకరిద్దరికి స్పష్టంగా కనిపించిందట కూడ. దాంతో ఎవరూ అందులో దిగడానికి సాహసించలేదు.

నేను మరీ అంత ధైర్యవంతుణ్ణని చెప్పడం కాదుగాని నిజానికి దెయ్యాలంటే నాకేమాత్రం నమ్మకంలేదు. అంతగా కనిపిస్తే చూద్దామన్న కుతూహలం కూడ లేకపోలేదు.

ఆ సాయంత్రమే పెట్టె, బెడ్డింగ్ తీసుకుని గృహ ప్రవేశం చేశాను. గత నాలుగు మాసాలుగా ఖాళీగా ఉన్న యిల్లు. నిజానికి దుమ్ముధూళితో నిండి ఉండాల్సిన మాట. కాని ఆరోజే క్లీన్ చేసినట్టు పరిశుభ్రంగా వుంది.

నేను ఆశ్చర్యపోయే లోగానే నా ఆలోచన కనిపెట్టినట్టు పక్కింటి కోవర్కరు సుందరం కలుగజేసుకున్నాడు.

"ఇల్లు ఇంత శుభ్రంగా ఉందేమిటా? అని ఆశ్చర్య

పోతున్నారు కదూ? మీరు వస్తున్నారని తెలిసి ఈ మధ్యాహ్నమే తాళంచెవి తీసుకుని మా సర్వెంట్ చేత శుభ్రం చేయించాను. ఇరుగుపొరుగు వాళ్ళం. ఆమాత్రం సాయం చేసుకోపోతే ఎలా?" అన్నాడు పళ్ళికిలిస్తూ.

"థేంక్స్. మెనీ థేంక్స్" అన్నాను ఆశ్చర్యపోతూ.

ఈలోగా సుందరం మిసెస్ కాబోలు చొరవగా ఇంట్లోకి ప్రవేశించింది "నమస్కారం అన్నయ్యగారూ!" అంటూ.

"న....మ....స్కా....రం...." అన్నాను రెట్టింపు ఆశ్చర్యంతో.

అంత చొరవగల మనిషిని ఇంతవరకు చూడ్లేదు. అందంగా నాజూగ్గా ఉంది. కాకి ముక్కుకి దొండపండులా వుంది సుందరం ప్రక్కన. కాసేపు పిచ్చాపాటీ సాగింది.

రెండు రోజులసాటు ఎలాంటి సంఘటనా జరగలేదు. మూడవ రోజనుకుంటాను. అర్ధరాత్రి.... ఏదో చప్పుడుకి హఠాత్తుగా మెలకువ వచ్చింది.

చీకటి.... గాఢాంధకారం. చేత్తో తడిమి స్విచ్ వేశాను. లైట్ వెలగలేదు.

బహుశః కరెంట్ ఫెయిలయిందేమో. తడుముకుంటూ గడియతీసి వరండాలో కొచ్చాను.

శబ్దం ఎటువేపునుండి వచ్చిందీ అర్థంకాలేదు. సుందరం ఇంటి తలుపులు కూడ మూసి ఉన్నాయి.

అయిదునిముషాలు చూసి తిరిగిపోదామనుకునేంతలో మళ్ళీ చప్పుడయింది, భయంకరమైన గుడ్లగూబ అరుపు లాంటిది.

కళ్ళు చిట్లించి చూశాను. మసక వెన్నెల్లో.... మామిడి చెట్టుక్రింద.... మల్లెపువ్వులాంటి.... తెల్లటి ఆకారం.

ఒక్క-క్షణం ఒళ్ళు గగుర్పొడిచింది.

అయినా ధైర్యం తెచ్చుకున్నాను.

"ఎ....వ....రు?" అన్నాను వీలయినంత గట్టిగా.

నా గొంతు నాకే వింతగా విన్పించింది. సమాధానం లేదు. సమయానికి టార్చ్‌కూడ లేదు. రెండు నిమిషాలాగి ఏమయితే అయిందని ఒక అడుగు ముందుకు వేశాను.

మళ్ళీ.... అదే.... చప్పుడు.

ఈసారి మరింత హెచ్చు స్థాయిలో.

గుండె లవిసిపోయాయి. ధైర్యం సన్నగిల్లింది. కాళ్లల్లో వణుకు ప్రారంభమయింది. నిలదొక్కు-కుని ఒక్క- ఉదటున గదిలోకొచ్చి పడ్డాను.

అదృష్టవశాత్తు పదినిముషాల తర్వాత లైట్లు వెలిగాయి. ఆలోచిస్తూనే తెల్లవార్లూ గడిపాను!

అయితే ఇంతపెద్ద చప్పుడైనా సుందరంగాని, అతని భార్యగాని నిద్ర లేవకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. బహుశః విపరీతంగా భయపడి బయటికి రాలేదేమో?

మర్నాడు సుందరం దంపతుల దగ్గర విషయం కదిపాను. అప్పుడప్పుడు అలా జరగడం మామూలేనని.... ఈమధ్య మరీ తరచుగా జరుగుతోందని.... అదో మామూలు విషయమైనట్టు పొడిగా చెప్పేరు.

ఆరోజు రాత్రి చాలవరకు మేలుకునే ఉన్నాను. ఎలాంటి సంఘటనా జరగలేదు. ఇంత జరిగినా దెయ్యాలున్నాయంటే నమ్మకం కలగడంలేదు నా మనసుకి.

మర్నాడు రాత్రి యధాప్రకారం మళ్ళీ అదే చప్పుడు. అంతేకాదు. ఎవరో పరుగెడుతున్నట్టు అడుగుల చప్పుడు, మళ్ళీ కరెంట్ ఫెయిల్,

ఈసారి ముందే జాగ్రత్తపడ్డాను. ప్రక్కనేవున్న టార్చి వెలిగించి గడియతీసి వసారాలో వున్న మెయిన్‌స్విచ్ చెక్ చేశాను. నా ఊహ కరెక్టే.

ఎవరో కావాలని మెయిన్‌స్విచ్ ఆఫ్‌చేశారు. అంటే చీకట్లో ఎవరో నన్ను ఝడిపించాలని ప్రయత్నిస్తున్నారు. ఎవరు?

నన్ను భయపెట్టినందువల్ల వాళ్ళకొచ్చే లాభమేమిటి?

ఆలోచిస్తూనే టార్చ్ నాలుగువైపులా వేశాను. మొన్నటి ఆకారం కనపడ్లేదు. తిరిగివచ్చి పక్కమీద మేను వాల్చాను.

మళ్ళీ ఆలోచనలకి జీవం పోశాను. హఠాత్తుగా ఓ ఐడియా తట్టింది. మర్నాడు ఆ ప్లాన్ అమలుపర్చదలచు కున్నాను.

హాయిగా నిద్రపోయాను.

* * *

"ఒంట్లో బాగుండటంలేదు సార్! జ్వరం తగిలినట్టుంది. రెండు రోజులు కాజువల్ లీవు కావాలి. టౌనుకెళ్ళి పెద్ద డాక్టరుగారిచేత చెక్ చేయించుకు వస్తాను." అన్నాను ఆప్లికేషను బి.డి.ఓ. గారి టేబిల్‌మీద పెడుతూ.

"చూశావా.... మొదటే నేను చెబితే విన్నావు కాదు. ఆ ఇల్లు అంత మంచిదికాదు. సరే.... వెళ్ళు" అన్నారు సెలవు మంజూరు చేస్తూ.

వెళ్తూ సుందరానికి ఇంటి తాళంచెవి యిచ్చి- "శ్రమ అనుకోకపోతే ఇంటిని కాస్త శుభ్రం చేయిస్తుండండి. రెండ్రోజుల్లో వచ్చేస్తాను." అన్నాను.

"ఓ యస్! అలాగే" అన్నాడు సుందరం తాళంచెవి తీసుకుంటూ.

సాయంత్రం బస్సెక్కి నిజంగానే పదిమైళ్ళ దూరంలో వున్న పట్నం వెళ్లాను సుందరం చూస్తూండగా. అయితే సినిమా వదిలేక రాత్రి పదిగంటల బస్సులో తిరిగి చేరుకున్న విషయం ఎవరికీ తెలియదు.

నా ఊహ కరెక్టయితే ఈ రాత్రే ఈ మిష్టరీ తేలిపోవాలి. ఎవరూ చూడకుండా నా క్వార్టర్ చేరుకుని, చప్పుడు చెయ్యకుండా జామచెట్టెక్కి గుబురుగావున్న కొమ్మలమధ్య కూర్చున్నాను.

అరగంట గడిచింది. ఓ ఆకారం సుందరం ఇంటివేపు నడిచి మెల్లగా తలుపు తట్టింది. రెండు క్షణాల తర్వాత తలుపు తెరుచుకుని ఇంకో ఆకారం బయటికి వచ్చింది.

వెనువెంటనే నేనుండే ఇంటి తాళం తెరిచి లోపల ప్రవేశించి, గడియ వేసుకున్నాయి రెండు ఆకారాలు.

నిజానికి మిష్టరీ విడిపోయినట్టే. అయినా ఆ కాస్త సందేహ నివృత్తికోసం పదినిముషాల తర్వాత ఇంటిని సమీపించి చప్పుడు చెయ్యకుండా తెరిచివున్న కిటికీగుండా లోపలికి చూశాను.

అంతే! కళ్ళు జిగేల్‌మన్నాయి.

సుందరం భార్య పూర్తి నగ్నంగా బెడ్‌మీద వెల్లకిలా పడివుంది. ఆమెమీద మా బి.డి.ఓ. గారు.

చూడ్డానికి మనస్కరించలేదు. వెనుతిరిగి చీకట్లో కలిసిపోయాను ఆ రాత్రి సుందరాన్ని బాధపెట్టడం ఇష్టంలేక. మరునాడే నా క్వార్టరు మారానని వేరే చెప్పనక్కరలేదనుకుంటాను.

***

# నేరస్థుల చరిత్ర

యం. కె. వి. శాస్త్రి

"నేను చెప్పినట్టు వింటే నీకూ్కడా ఈ జైల్లోంచి తప్పించుకుని పారిపోయే ఉపాయం చెప్తాను. ఇంత కాలం మనం కలిసి ఒకే గదిలో ఉండడం, నీ మంచితనం నేను గుర్తించడంవల్ల నీకూ ఒక అవకాశం ఇస్తున్నాను. ఏమంటావ్?" అన్నాడు జాన్.

"అనడానికి ఏముంది; ఎప్పుడు నీ మాట కాదన్నాను?" అన్నాను.

"గుడ్. అయితే ఇలా ఇంకా దగ్గరగా రా" చెప్పుకు పోతున్నాడు జాన్ నా చెవిలో.

"మనకి సహాయం ఎవరివల్ల, ఎప్పుడు, ఎలా జరుగుతుందని నువ్వు ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు! రేపు రాత్రికే మన ప్రయాణం. బైటకి వెళ్ళిపోగానే నీ దారి నీది, నా దారి నాది. ఒకవేళ నువ్వు నీ అజాగ్రత్తవల్ల పోలీసులకి దొరికిపోతే నా గురించి ఏదన్నా వాగేవో నీ ప్రాణం మరు

క్షణంలో పోతుంది. మంచికి పోతే నేను ప్రాణం ఇస్తాను. నాతో తేడా వచ్చిందో ప్రాణాలు తియ్యడానికి కూడా జంకను. జాగ్రత్త!"

ఆ గొంతుకలో జాలి లేదు.

"అలాగే జాన్. నాకు ఉపకారం చేసిన నీకు ఎందుకు అపకారం తలపెడతాను?" అన్నాను.

"నిజమే! కాని పోలీసు వ్యవహారం నీకు తెలియనిది ఏముంది? నిజం చెప్పేవరకు చిత్రహింసలు పెడతారు. బీ కేర్‌ఫుల్ అండ్ గో టు యువర్ బెడ్!" అన్నాడు.

"అలాగే" అన్నాను.

జాన్ పక్కమీదకి ఒరిగి కళ్ళుమూసుకున్నాడు. కాస్త సేపట్లో హాయిగా గురకపెడుతో నిద్రలోకి జారిపోయాడు.

జైలు గంట రెండు కొట్టింది.

వర్షాకాలంవల్ల వర్షం జోరుగా పడుతోంది. వాతావరణం చాలా చల్లగా వుంది. మనస్సు చాలా సంతోషంగా, ఆనందంగా వుంది. ఈ జైలు జీవితానికి స్వస్తిచెప్పి ఎంత త్వరగా బైటకి పోగలిగితే అంత మంచిది.

నా చెల్లెలు జీవితాన్ని సర్వనాశనం చేసిన ఆ కిరాతకుడు 'భుజంగరావుని' హతమార్చాలి. అప్పటికిగాని నాలోని పగ చల్లారదు. అంతవరకు నా చెల్లెలు 'శాంత' ఆత్మకి శాంతి కలగదు.

ఆలోచనలతో నా శరీరం వేడెక్కింది. నా రక్తం మరిగిపోతోంది.

పాపం, జాన్ దయవల్ల రేపటితో నాకు విముక్తి కలగబోతోంది. ఆ క్షణంలో నాకు దేవుడిలా కనిపించాడు. జాన్ నిజానికి ఎంత కిరాతకుడైనా నా పాలిటి దైవంలా కనిపిస్తున్నాడు.

జాన్ ఒక అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాలోవాడు. పెద్ద పెద్ద బ్యాంకుల దోపిడీలు, పట్టపగలే పెద్ద నగరాలలోని షాపుల్లో దొంగతనాలు, నడివీధులలోనే హత్యలు, దోపిడీలు ఎన్నో అవలీలగా జరిపిన ఘనుడు.

విజయవాడలో జాన్ ముఠావాళ్ళు ఒక బ్యాంకు పట్ట పగలు దోపిడీచేసి, బ్యాంకు తాలూకు వాచ్‌మెన్‌ని, ఇంకో ఇద్దరు ఖాతాదార్లని కాల్చిపారేశారు అడ్డుతగిలారని.

చచ్చిపోతో వాచ్‌మెన్ పేల్చిన తుపాకిగుండు జాన్ తొడలో దిగబడింది. విపరీతమైన రక్తస్రావంవల్ల ఎటూ కదలలేని పరిస్థితిలో జాన్ పోలీసులకి దొరికిపోయాడు.

బ్యాంకు దోపిడి పది లక్షల రూపాయలకు పైగా వుంటుంది. జాన్ ముఠావాళ్ళంతా డబ్బుతో పరారై పోయారు.

దొరికిపోయిన జాన్‌ని పోలీసులు ఎన్ని రకాలుగా హింసించినా, ముఠా తాలూకు వివరాలుగాని, రహస్యాలు గాని రాబట్టలేకపోయారు.

జాన్‌మీద నేరం ఋజువైంది. యావజ్జీవకారాగార శిక్ష విధింపబడ్డది.

ఒక సంవత్సరంపాటు పోలీస్ డిపార్ట్‌మెంటు దేశం నలుమూలలా జాన్ ముఠాకోసం వలపన్ని వెదికి విసిగి, వేసారిపోయింది.

పోలీసు డిపార్ట్‌మెంటు మళ్ళీ మామూలుగా నిద్రావస్థ లోకి రాగానే, జాన్ ముఠా తిరిగి తలెత్తింది.

ముఠాకంతటికి అతి ముఖ్యమైన వ్యక్తి జాన్. అందుకే ముందు జాన్‌ని విడుదల చేయించే కార్యక్రమం చేపట్టింది.

అప్రయత్నంగా నిద్రపోతున్న జాన్‌కేసి చూశాను.

ఆరడుగుల రెండంగుళాల పొడుగు, కండలు తిరిగిన శరీరం, తీక్షణంగా చూసే కళ్ళు, భయంకరంగా, ఒళ్ళు గగుర్పాటు కలిగించే కంఠస్వరం.

హాయిగా ఊపిరితీసుకుని, వదుల్తూ మైమరచిపోతున్న జాన్‌ని చూడగానే నా నుదుటికి పట్టిన చెమటని అప్రయత్నంగా తుడుచుకున్నా.

## 2

ఈ రెండేళ్ళ జైలు జీవితం నాకు నిజానికి చాలా దుర్భరమనిపించింది.

అంటే ఈ జైలు సర్వీసు నాకు మరేం కొత్తకాదు. రెండు నెలలకన్నా ఎక్కువకాలం ఎప్పుడూ జైల్లో కూర్చోలేదు.

చిన్నసైజు చిల్లరదొంగతనాలు చెయ్యడం, దొరకనంత కాలం చిన్నసైజు దొరజీవితం గడుపుతూ, దొరికిపోతే చచ్చేలాగ చావదెబ్బలు తిని జైలుపక్షిలాగ జైల్లో వాలడం, ఇలా సాగింది నా చిన్ననాటి జీవితం.

చిల్లర దొంగతనాలు నాకు అట్టే గిట్టుబాటుగా వుండేవి కావు. ఏదో ఒక ప్లానువేసి ఓ పెద్దసైజు దొంగతనం చేసి, కనీసం ఒక యాభై వేల రూపాయలదాకా సంపాదించుకుని ఎవరికి తెలియని ఊరికి మకాం ఎత్తేసి, అక్కడ ఏదో వ్యాపారం ప్రారంభించి, సంఘంలో గౌరవంగా, పెద్దమనిషిలా బతకాలని నాకో ఆలోచన వచ్చింది ఒకసారి.

దానికి కారణం నా చెల్లెలు శాంత.

అమ్మా, నాన్నా చనిపోగానే నేను, శాంత ఈ లోకంలో ఇంక నా అన్నవాళ్ళు లేకుండా మిగిలాం. అప్పటికి నా వయస్సు పదహారు సంవత్సరాలు. శాంతకి పది సంవత్సరాలు.

ఇలా పది సంవత్సరాలు దొంగగా జీవితం గడిపేను.

అయితే శాంతకి ఒక మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలని, నేను కూడా పెళ్ళిచేసుకుని రాజాలాంటి జీవితం గడపాలని ఆలోచన రాగానే చిల్లర దొంగతనాలు మానేసి 'కొడితే పులినే కొట్టాలని' బాగా ఆలోచించి ఊళ్ళో బాగా లక్షాధికారిగా చెలామణి ఔతున్న కోటేశ్వర రావుగారింటిమీదకి పోయింది నా దృష్టి.

మేడల్లోను, మిద్దెల్లోను దొంగతనాలు అలవాటులేని నాకు కోటేశ్వరరావుగారింట్లో దొంగతనానికి వెళ్ళినప్పుడు పద్మవ్యూహంలోకి చిక్కుకుపోయినట్టయింది నా పని.

మేడమీది గదిలోకి నీళ్ళగొట్టాలు పట్టుకుని పాక్కుంటూ పైకి పోగలిగేను కాని, దిగేటప్పుడుమటుకు వీలుకాలేదు.

అంతలో కోటేశ్వరరావుగారి నౌకరు ఒకడు నన్ను చూచి అరవబోయాడు. చటుక్కున వాడి నోరు మూసి కత్తి గుండెల్లో దింపాను.

అంతా రక్తమయం. ఎర్రటి రక్తం చూడగానే నా కళ్లు బైర్లు కమ్మాయి.

నౌకరుని క్రిందకు నేలమీద జార్చేసి కేష్‌బేగ్‌తో బైటకి పరుగెత్తి రోడ్డుమీద కలిసిపోయా.

ఇంకా అంత బాగా వెలుతురు రాకపోడంవల్ల నేను ఎవరికంటా పడకుండా ఇల్లు చేరేను.

శాంత నన్ను, నా చేతిలోని కేష్‌బేగ్‌ని, రక్తంతో తడిసిన బట్టల్ని చూడగానే, ఎవర్నో హత్యచేశానని గ్రహించి బిత్తరపోయింది.

గబగబ బట్టలు మార్చేసి, బేగ్‌లోని డబ్బు లెక్కపెట్టేను. సరిగ్గా ఎనభై వేల రూపాయలు వున్నాయి.

నా ధ్యేయానికి మించిన సొమ్ము.

ఎందుకేనా మంచిది! ఈ సొమ్ము ఎక్కడేనా ఎవరికి తెలియనిచోట దాయడం మంచిదనిపించింది. వెంటనే డబ్బుతో బైటకి చీకటిలోకి నడిచాను.

రహస్యంగా, గుర్తుగా సొమ్ము దాచేసి ఇంటికి వచ్చేసరికి పూర్తిగా తెల్లారి వెలుగు వచ్చేసింది.

"ఇంక నన్ను ఎవరూ ఏం చెయ్యలేరు!" అని చాలా హాయిగా, ఆనందంగా పక్కమీదకు చేరుకున్నాను.

ఎవరో తలుపులు బాదుతున్న చప్పుడుకి నాకు మెలుకువ వచ్చింది. శాంత తలుపులు తియ్యగానే పోలీసులు, ఇనస్పెక్టర్లు, హడావిడిగా లోపలకు వచ్చి నా చేతులకు సంకెళ్ళు తగిలించి జీపులో స్టేషనుకి తీసుకుపోయారు.

కోటేశ్వరరావు గారింటిలో ప్రతీ వస్తువు మీద, బీరువా మీద నా వేలి ముద్రలు దొరికిపోయాయి. నేను పాత నేరస్తుడిని కనుక నా వేలి ముద్రలు పోలీసులకి నన్ను పట్టివ్వడానికి తోడ్పడ్డాయి.

కోర్టులో నేను చేసిన నేరం ఋజువు అయింది. ఫలితంగా పది సంవత్సరాలు జైలు శిక్ష పడింది, దొంగతనం, నౌకరుని హత్య చేసిన నేరాలకు.

నన్ను సెంట్రల్ జైలుకు తీసుకుపోతుంటే "అన్నయ్యా! నన్ను దిక్కులేనిదాన్ని చేసి వెళ్ళిపోతున్నావా? నువ్వులేని నా జీవితం ఎలా గడుస్తుంది?" అని ఏడుస్తూ అన్న శాంత మాటలు ఇంకా నా చెవిలో మారు మ్రోగుతున్నాయి.

చెమర్చిన కళ్ళను అప్రయత్నంగా తుడుచుకున్నాను.

జైలు గంట మూడు కొట్టింది.

వర్షం ఇంకా జోరుగా పడుతోంది. విపరీతమైన చలిగా

ఉంది. దుప్పటి పూర్తిగా కప్పుకున్నా.

నిద్రలోంచి మేలుకున్న జాన్ ఒక్కసారి కళ్ళు తెరిచి నాకేసి చూసి "నిద్ర రావడంలేదా?" అన్నాడు.

"లేదు!" అన్నాను.

"ఔనులే! ఇది ఆఖరి రోజు కదా! వెళ్ళిపోతున్నామని బెంగగా ఉందా?" అన్నాడు నవ్వుతో.

"బైట వర్షం బాగా పడుతోంది కదూ? ఇలా రేపు రాత్రి కూడా దంచితే మనపని హాయిగా ఉంటుంది." అన్నాడు జాన్ మళ్ళీ నిద్రలోకి జారుకుంటూ.

ఒకసారి శాంత 'విజిటర్స్‌డే'ని వచ్చి చెప్పింది. "భుజంగరావు గారింటిలో వంటమనిషిగా కుదిరేనని."

"ఎవరా భుజంగరావు?" అని అడిగాను.

"ఊళ్ళో బాగా పలుకుబడి ఉన్నాయన. చాలా ఉదారులు. నన్ను చాలా ప్రేమగా, ఆత్మీయతగా చూసుకుంటున్నారు. నా గురించి నువ్వు బెంగపెట్టుకోవద్దు అన్నయ్యా!'' అంది శాంత.

ఎందుకో శాంత పరుల పంచనచేరి బతకడం నాకు ఎంతో చిత్తక్షోభ కలిగించింది. శాంతకు పెద్ద సంబంధం చేసి, ఒక గృహిణిగా తీర్చి దిద్దాలని, శాంత జీవితం సంతోషమయం చెయ్యాలని ఊహించిన నాకు శాంత గాధ చాలా విచారాన్ని కలిగించింది.

జైలు జీవితం గడుపుతున్న నేను శాంతకి ఏం చెయ్యగలను. ఎక్కడో అక్కడ శాంత గౌరవంగా, హాయిగా జీవించడం ఒకలాగ మంచిదే అని మనస్సుని సముదాయించుకున్నాను.

ఈ రెండు సంవత్సరాల కాలంలో శాంత జైలుకువచ్చి

ఎన్నో కబుర్లు చెప్తూ వుండేది. అలాగైనా శాంతని చూసుకో గలుగుతున్నందుకు ఆనందపడేవాణ్ణి.

జాన్ కూడా శాంతను ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు.

శాంతచేత 'అన్నయ్యా' అని పిలిపించుకుని ఎంతో ఆనందపడేవాడు.

జాన్‌కి తోబుట్టువులు ఎవరూ లేరు. నన్ను, శాంతని చాలా ప్రేమగా చూసుకునేవాడనే చెప్పాలి.

ఒకరోజు శాంత వచ్చింది నన్ను చూడాలని. ఆ రోజు ఎందుకో చాలా విచారంగా, నీరసంగా కనిపించింది. ప్రతి సారి వచ్చినపుడు ఉండే ఆనందం, సంతోషం కనిపించ లేదు శాంత ముఖంలో.

"శాంతా! ఎందుకమ్మా అలా ఉన్నావు. ఏం జరిగింది. నాకు చెప్పవూ!" అని ఎన్నిసార్లు గుచ్చి అడిగినా శాంత చేత ఏమీ మాట్లాడించలేక పోయాను.

వెళ్ళిపోయే ముందు నాకు ఒక కవరు ఇచ్చింది శాంత. "తర్వాత తీరుబడిగా చదువుకో అన్నయ్యా!" అంటూ వెళ్ళి పోయింది.

శాంత వెళ్ళిపోయిన తర్వాత శాంత రాసిన ఉత్తరం చదువుకున్నాను.

ఆ తర్వాత శాంత మళ్ళీ రాలేదు. ఇకరాదు. అసలు రాలేదు కూడా!

శాంతని చేరదీసిన భుజంగరావు, ఎంతో ఆత్మీయతగా ప్రేమగా నటిస్తో, ఇంటిలో ఎవరూ లేకుండా చూసి శాంతని బలాత్కరించి, శాంత శీలాన్ని సర్వనాశనం చేశాడు. శాంత ఆ రాక్షసుడి, ఆ కిరాతకుడి కామాగ్నికి బలైపోయింది.

ఉత్తరంలో భుజంగరావు ఎడ్రసు రాసింది.

"నమ్మకద్రోహం చేసిన భుజంగరావుని నా చేతుల్తో హతమారిస్తే కాని, తన ఆత్మకి శాంతి ఉండదని" రాసింది ఉత్తరంలో.

ఆ రోజంతా జైల్లో కూచుని ఎంతలా ఏడిచానో నేను వర్ణించలేను. పాషాణ హృదయుడైన జాన్ కూడా నాతో పాటు ఆ రాత్రంతా ఏడుస్తోనే గడిపాడు.

ఆ మర్నాడు జైల్లో అంతా అనుకుంటూ ఉండగా తెలిసింది. జైలుకి దగ్గరగా ఒక అమ్మాయి ఎండ్రిన్ తాగి మరణించిందని.

సందేహం లేదు! శాంత ఉత్తరంలో వ్రాసిన ప్రకారం జైలుకి దగ్గరలోనే తన ప్రాణాలు అర్పించుకుంది.

చనిపోయిన నా చెల్లెలు శాంత శవాన్ని కూడా చూసుకో లేకపోయిన నా దౌర్భాగ్యానికి ఎంతగానో కుమిలిపోయాను.

జరిగిపోయిన పాతరోజులు జ్ఞాపకం వచ్చి అలా ఎంత సేపు ఏడుస్తో, కూర్చున్నానో నాకే తెలియదు, జాన్ వచ్చి 'రోల్‌కాల్' టైం అయిందని చెప్పేవరకు.

అయిష్టంగానే లేచి గదిలోంచి బైటకు నడిచాను.

"ఒరేయ్ భుజంగం! వస్తున్నానురా! నీ ప్రాణాలు తీసి. నా చెల్లెలు శాంత ఆత్మకు శాంతి చేకూర్చడానికి వస్తున్నానురా! ఇదే నా శపథం." అని నా మనస్సు మూగగా ఘోషించింది.

## 3

రాత్రి పదకొండు అయింది.

జైలంతా నిశ్శబ్దంగా ఉంది. బైట కుండపోతగా వర్షం కురుస్తోంది. జైలర్లంతా గదుల్లో హాయిగా, వెచ్చగా పడుకుని ఉంటారు.

సాయంత్రం జైల్ డ్రైవర్ 'వీరస్వామి' జాన్‌కి ఏదో పొట్లం అందివ్వడం నేను గమనించక పోలేదు.

జాన్ నెమ్మదిగా పొట్లం విప్పేడు. అందులోంచి అరిశెలు, మసాలావడలు, సిగరెట్టు పెట్టె తీశాడు. పొట్లం విప్పగానే కమ్మని వాసన ముక్కుకు తగుల్తోంది.

జాన్ నెమ్మదిగా వాచ్‌మెన్‌ని కేకేశాడు.

"ఎందుకు? ఇంకా పడుకోకుండా ఏమిటి నీ గొడవ?" విసుక్కుంటూ వచ్చాడు వాచ్‌మెన్.

"మరేం లేదు! ఇవాళ మా బంధువు ఒకాయన పంపించాడు. ఇవిగో అరిశెలు. మసాలావడలు. నువ్వు కూడా తిను. ఇవిగో సిగరెట్లు కాల్చుకో" ఆప్యాయంగా అందించాడు జాన్.

"ఇది నాకు!" విస్కీ బోటిల్ సీలు ఊడదీస్తో అన్నాడు జాన్.

ఇవన్ని చూడగానే వాచ్‌మెన్ ప్రాణం లేచి వచ్చింది.

"మరి నాకో విస్కీ!" అన్నాడు నోరు తడుపుకుంటూ.

"కొంచెం తాగి నాకియ్యి" అన్నాడు జాన్.

వాచ్‌మెన్ తాగుతుంటే మిగతా ఇద్దరూ వాచ్‌మెన్‌లు కూడా వచ్చారు. 'నాక్కూడా కాస్త గొంతుక తడుపు' అనుకుంటూ.

ఒకడి చేతిలోంచి ఒకడి చేతిలోకి సీసా మారుతో చూస్తుండగానే ఖాళీ అయిపోయింది.

"కొంచెం తాగమంటే అంతా మీరే కానిచ్చేశారు!" విసుక్కుంటున్నాడు జాన్.

వాచ్‌మెన్‌లు ముగ్గురు అరిశెలు, వడలు ఆబగా లాగించేస్తున్నారు.

జాన్, నేను వాళ్ళకేసే చూస్తూ ఉండిపోయాం.

"జాన్! చాలా గొప్పగా ఉంది మందు. అరిశెలు, వడలు మోతగా ఉన్నాయి. నీకూ, అవి తెచ్చిన నీ బంధువుకి మా జోహార్లు." ముద్దగా వస్తున్నాయి మాటలు.

సిగరెట్లు వెలిగించి సగానికి పైగా గుప్పు, గుప్పు మని పించారు.

ఒక పావుగంటలో తుపాకీలు గోడలకు జార్ల పడి నుంచున్నాయి. వాచ్ మెన్‌లు ముగ్గురు నేల కరిచేశారు.

జాన్ గమ్మున పొట్లంలోంచి తీశాడు ఎనిమిది అంగు శాల పొడుగున్న తాళంచెవి. లోపల నుంచి చెయ్యి బైటకు పోనిచ్చి అతి చాకచక్యంగా తాళం తీసి చప్పుడు కాకుండా గేటు తీసి, ఒకసారి కేరిడార్‌లోకి అటు ఇటు పరకాయించి చూసి "మెల్లిగా నాతోపాటు బైటకిరా!" అన్నాడు.

నేను జాన్‌ని అనుసరించాను.

బైట కుంభవృష్టి. విపరీతమైన చలి. ఓ మూలగా నుంచుని మా జైలు బట్టలు విప్పేసి ఒక మూలకి విసిరేశాం.

సరాసరి వెళ్ళి జైలు గోడదగ్గర నుంచున్నాం మేము. అంటే గోడ అవతల బాహ్య ప్రపంచమున్న మాట.

నాకు ఏమిటో చెప్పలేని నూతనోత్సాహం వచ్చింది.

ఒక పదిగజాలు అటు ఇటు తడుముకుంటూ నడుస్తూ ఒక చోట ఆగిపోయాడు జాన్.

అక్కడ ఒక బలమైన తాడు గోడమీద నుంచి కిందకి వ్రేలాడుతోంది.

''నాతో పాటు నువ్వే కూడా తాడు మీద పాక్కుంటూ పైకిరా!'' అనిచెప్పి, తాడు ఒక్కసారి బలంగా గుంజాడు. గోడ అవతల వాళ్ళు కూడా తాడును అవతలనుంచి బలంగా

గుంజినట్టున్నారు, తాడు పైటుగా తయారైంది.

జాన్ పైకి పాకడం మొదలు పెట్టేడు.

సుమారు ఇరవై అడుగుల ఎత్తు ఉంది గోడ. పది నిమిషాల్లో గోడమీదకి చేరుకున్నాం. పైన గోడ వెడల్పు మూడు అడుగులు ఉంది. అక్కడక్కడ బురుజులు కోట గోడలాగ.

ఈసారి తాడు పైకిలాక్కుని తాడు ఒక బురుజుకి రెండు చుట్టలు చుట్టి రెండు తాళ్ళు బైటకి వదిలేడు. రెండుతాళ్ళ సహాయంతో ఇద్దరం బైటకి దిగిపోయాం.

కిందకి దిగగానే ఒక అరడజనుమంది జాన్‌ని ఆప్యాయంగా కౌగలించుకున్నారు.

ఒకడు జాన్‌కి విస్కీబోటిల్ అందించాడు. జాన్ సీసా మూత పళ్ళతో తీసి విస్కీ అంతా సోడాలాగా గడగడ తాగేశాడు.

"బాస్! అక్కడ ఉంది. కారు బయలుదేరుదాం!" అన్నాడు ఒకడు చీకట్లోకి చెయ్యి చూపుతూ.

ఒకడు జాన్‌కి ఓవర్‌కోటు కప్పి తలమీద ఫెల్ట్‌హేట్ పెట్టేడు.

"బట్టలు జీప్‌లో ఉన్నాయి. జీపులో మార్చుకుందురు గాని, లెటస్‌గో!" అన్నారు వాళ్ళంతా.

## 4

జాన్ బృందం నాకేసి మార్చి మార్చి చూస్తున్నారు.

జాన్ వాళ్ళల్లో ఒకణ్ణి దగ్గరకు పిలిచి ఏదో మెల్లిగా చెవిలో గొణిగేడు. వెంటనే వాడు పరుగున జీపు దగ్గరకు పోయి, రెండు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. వాడి చేతిలో ఏదో వుంది. చీకటిలో నాకు సరిగా కనిపించలేదు.

"బ్రదర్! మేము తెల్లవారేలోగా ఈ రాష్ట్రం దాటేసి వెళ్ళిపోతాం. నేను చెప్పిన ప్రకారం నిన్ను జైలులోంచి బైటికి చేర్చాను. ఇక నీ బతుకు నీది. జాగ్రత్త! ఏ పరిస్థితుల్లోనూ నా ఆచూకీ ఇవ్వవనే నా ఉద్దేశ్యం. నా సంగతి తెలుసుగా? బి కేర్‌ఫుల్" అన్నాడు జాన్.

"నీవు చేసిన సహాయం మరిచిపోలేను జాన్! ఏ పరిస్థితుల్లోనూ నీ ఆచూకీ ఎవ్వరికి తెలియనివ్వను. నన్ను నమ్ము!" అన్నాను జాన్ రెండుచేతులు పుచ్చుకుని.

"నేను ముందుచూపు వున్నవాణ్ణి. కీడెంచి మేలెంచమన్నారు మన పెద్దలు. ఈ క్షణంలో నీ మనస్సులో ఉన్న ఉద్దేశ్యం నాకు తెలియదు కదా! అందుకని" అంటూ జాన్ నాకు బాగా దగ్గరగా జరిగాడు.

అప్పుడు చూశాను! జాన్ చేతిలో ఉన్నది ఒక సుత్తి. నేలమీదకు ఒంగి కూర్చుని సుత్తితో నా కుడికాలి పాదం పైన బలంగా. రెండు దెబ్బలు వేశాడు.

లోపల ఎముకలు "కరేల్" మన్నాయి. చూస్తుండగానే పాదం బాగా వాచిపోయింది.

అరవకుండా ఒకడు నా నోరు మూసేశాడు.

ఒకడు నాకు బట్టలు తొడిగి, ఒళ్ళంతా సరిపోయే లాంగ్ కోటు కప్పి, పెల్ట్‌హేట్ పెట్టేడు.

"ఇదంతా ఎందుకో తెలుసా?" అన్నాడు జాన్.

జాలిగా జాన్ కళ్ళల్లోకి చూస్తున్నాను నేను.

"నువ్వు ఇలాగ ఈ వర్షంలో రెండురోజులు ఇక్కడే ఉండాల్సి ఉంది! వర్షంలో తడవడంవల్ల చచ్చిపోకుండా ఈ ఏర్పాటు చేస్తున్నా.

నీ అజాగ్రత్తవల్ల పోలీసులకి దొరికిపోతే నేను కూడా

పట్టుబడిపోయే ప్రమాదం వుంది! నిన్ను జాగ్రత్తగా ఆ కనిపించే చింతచెట్టు చివర గుబురుగా ఉండే కొమ్మల మధ్య తాళ్ళతో బలంగా కట్టి వుంచుతాం. ఒకవేళ నువ్వు చెట్టుమీద నిద్రపోయినా పడిపోయే ప్రమాదం వుండదు. నువ్వు ఎలాగూ రెండురోజుల తర్వాత కాని చెట్టు దిగి కిందికి రాలేవు. రెండురోజుల తర్వాత నువ్వు పోలీసులకి దొరికిపోయినా నాకు ప్రమాదం ఉండదు; ఎందుకంటే అప్పటికి నేను నాలుగు రాష్ట్రాలు దాటి వెళ్ళిపోతాను.

ఈ రెండు రోజులు నువ్వు ఆకలితో చావకుండా ఈ సంచీలో బిస్కట్లు, బ్రెడ్, విస్కీ-బోటిల్ ఉంచాను. ఎందుకేనా అవసరం రావచ్చు అని సంచీలో కొంచెం 'కేష్' కూడా పెడుతున్నా.

సారీ బ్రదర్! ఐ విష్ యు ఆల్ సక్సస్—చెల్లెలు శాంత ఆత్మకి శాంతి కలిగించే శక్తి, యుక్తి నీకివ్వాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను."

నా చేతిని మృదువుగా కరచాలనంచేస్తూ జీపుకేసి వడివడిగా వెళ్ళిపోయాడు.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థమవలేదు.

జాన్ అనుచరులు జాన్ చెప్పిన ప్రకారం నన్ను జైలుకు దూరంగావున్న చింతచెట్టుమీద తాళ్ళతో బంధించి వెళ్ళిపోయారు, సంచీ నా పక్కనున్న కొమ్మకు తగిలించి.

కొంతసేపట్లో జీపు బైలుదేరిన శబ్దం వినిపించింది. జీపు డేంజెర్‌లైట్లు కనిపించినంతసేపూ అలా చూస్తూనే ఉండిపోయా. జీపు మైన్‌రోడ్లో కలిసిపోయింది.

## 5

కాలు బాగా వాచిపోవడంవల్ల అనుకుంటా, ఒళ్ళంతా సలసలా కాలిపోతోంది. జ్వరం వచ్చి శరీరం అంతా మైకం

కమ్మినట్టుగా ఉంది. కాలంతా ఒకటే పోటు. చాలా బాధగా ఉంది.

సీసాలోంచి విస్కీ బోటిల్ బైటకు తీసి గడగడా సగం వరకు తాగేశాను. సీసా మూత బిగించి మళ్ళీ సంచీలో పడేశాను.

విస్కీ నిషా ఒళ్ళంతా క్షణాలమీద పాకింది. మెడ పక్కకి వాలిపోయింది.

నాకు మెలుకువ వచ్చేసరికి సూర్యుడు బాగా ఆకాశం పైకి వచ్చాడు. వర్షం తగ్గిపోయినా ఇంకా బాగా చలిగా ఉంది: జ్వరంవల్ల కాబోలు.

సంచీలోంచి బ్రెడ్ తీసుకుని కొంచెం తిన్నాను. హితవనిపించలేదు.

ఒకసారి చుట్టు పరకాయించి చూశా. దూరంగా సిటీ అంతా ఎంతో అందంగా కనిపిస్తోంది చెట్టుమీదనుంచి. రోడ్లమీద వాహనాలు హడావిడిగా పరుగెడుతున్నాయి.

సడన్‌గా జ్ఞాపకం వచ్చింది; నేను జాన్ జైలులోంచి పారిపోయిన సంగతి. ఈపాటికి పోలీస్‌డిపార్ట్‌మెంటు క్షణం తీరిక లేకుండా నిర్విరామంగా తిరుగుతూ మంచి హడావిడిగా వుంటుంది.

నాకు ఎందుకో నవ్వు వచ్చింది క్షణంసేపు.

మెల్లిగా తల తిప్పి జైలుకేసి చూశాను. ఆకులు గుబురుగా ఉండడంవల్ల అసలు ఏమీ కనిపించలేదు.

కాలు ఇంకా నొప్పిగానే ఉంది. జాన్ రెండురోజులు పురుషత్తు పెట్టాడు. సుత్తిదెబ్బ 'పవర్' రెండురోజుల వరకు ఉంటుందేమో!

"కొంచెం కాలు నయమైన తర్వాత ఎక్కడికి పోయి తల దాచుకోవాలి?"

నాకు సడన్‌గా 'పంకజం' జ్ఞాపకం వచ్చింది. ఔను! నన్ను ఈ ఆపత్ సమయంలో పంకజం తప్పకుండా కంటికి రెప్పలా కాపాడగలదు. ఈ ఆలోచన రాగానే నా మనస్సు తేలికయినట్టు అనిపించింది.

మూడురోజుల తర్వాత కాలునెప్పి కొంచెం తగ్గుముఖం పట్టింది. ఈ రాత్రికి చెట్టుదిగి ఊళ్ళోకి బయలుదేరాలి.

సంచీలో చెయ్యిపెట్టి చూశాను, ఇంకా ఏమైనా ఉన్నాయేమో తినడానికని. రొట్టె, బిస్కట్లు తిని, మిగిలిన విస్కీ బోటిల్ ఖాళీ చేశాను. ఖాళీసీసా, బిస్కట్ పేకెట్ తాలూకు కాయితాలు అన్నీ సంచీలో కూరేశాను.

సంచీలో జాన్ దాచి ఉంచిన సొమ్ము లెక్కపెట్టేను. నూట ఇరవై రూపాయిలు ఉన్నాయి. జేబులో కుక్కుకున్నా.

బాగా రాత్రయింది. నెమ్మదిగా తాళ్ళు విప్పుకుని తాడంతా ఉండకింద చుట్టి సంచీలో పెట్టేశాను. సంచీ చెట్టుమీదే ఉంచేసి నెమ్మదిగా చెట్టుదిగి చీకట్లో, అలాగే కొంచెంసేపు నిశ్శబ్దంగా పరకాయించి చూసి రోడ్డుకేసి నడిచాను.

దార్లో ఎదురైన రిక్షా ఎక్కి బజార్లో దిగేను.

అక్కడనుంచి వేరే రిక్షాలో, అది దిగిపోయి ఇంకో రిక్షాలో, అలా నాలుగైదు రిక్షాలు మార్చి ఊళ్ళో చాలా చోట్ల తిరిగాను.

రిక్షాలో రోడ్డు నాలుగువైపులా నిశితంగా పరీక్షిస్తో కూర్చున్నా. నన్ను ఎవరూ వెంబడించటంలేదని నిర్ధారణ చేసుకుని పంకజం ఇంటికి ఒక అరమైలు దూరంగా దిగిపోయాను.

నాకు పంకజానికి పరిచయం చాలా తమాషాగా జరి

గింది. పంకజానికి కృష్ణ అని ఒక అన్నయ్య ఉండేవాడు. కృష్ణ, నేను ఒకసారి జైల్లో పదిరోజులు ఉన్నాం.

జైల్లోంచి విడుదల అయిన చాలా రోజుల తర్వాత కృష్ణ, నేను ఒకసారి బస్సుస్టేండ్‌లో కలిశాం. చాలాకాలం తర్వాత కలుసుకున్నాం; అన్న సంతోషంతో చాలాసేపు మాట్లాడుకున్న తర్వాత కృష్ణ వాళ్ళింటికి తీసుకుని వెళ్ళేడు నన్ను.

అక్కడ వాళ్ళింట్లో చూశాను పంకజాన్ని.

చాలాసార్లు కృష్ణ ఇంటికి వెళ్ళేవాణ్ణి; పంకజంకోసం. అలా మా స్నేహం ప్రేమగా మారి, చాలాసార్లు ఏకాంతంగా కలుసుకునేవాళ్ళం.

ఇలా చాటుమాటు వ్యవహారం మాకు అంతగా ఇష్టం లేక పెళ్ళి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాం.

మా పెళ్ళికి కృష్ణ కూడా తన అంగీకారం సంతోషంగా తెలియజేశాడు.

ఇలా ఉండగా ఒకసారి రాత్రి పంకజం, నేను వాళ్ళింట్లో ఉండగా కృష్ణ వచ్చి తలుపు తట్టాడు ఆదుర్దాగా!

కృష్ణ లోపలకు వచ్చి తలుపులు మూసేసి నా దగ్గరకు వచ్చాడు. బాగా పరుగుపెడుతూ వచ్చినట్టున్నాడు, ఒగర్చుకుంటూ, ఆయాసపడుతున్నాడు.

పంకజం చెయ్యి, నా చేతిలోపెట్టి "బావా! ఇక నా చెల్లెలు జీవితం నీ చేతిలో పెడుతున్నాను. ఇకనుంచి నా చెల్లెలుకి నువ్వే దిక్కు. నేను తిరిగి రాకపోవచ్చు. నేను వెళ్ళిపోవాలి. పోలీసులు నాకోసం వెతుకుతున్నారు" అన్నాడు.

"అసలు ఏం జరిగింది?" అన్నాం నేను, పంకజం ఒకేసారి.

"ఈ పరిస్థితిలో ఇంతకన్నా ఏమీ చెప్పలేను. నన్ను వెళ్ళనివ్వండి!" అంటూ వంటింటి తలుపులు తీసుకుని గోడ ఎక్కి అవతలకు దూకి చీకట్లోకి కలిసిపోయాడు.

నేను, పంకజం, నోటంట మాటరాక అలా నిలబడిపోయాం. నా చేతులు జిగురుగా అంటుకున్నాయి. బట్టలు రక్తం వాసన వేస్తున్నాయి.

దీపం వెలిగించి చూద్దునుకదా! కృష్ణ నుంచున్నచోట, కృష్ణ నడిచిన మేర అంతా రక్తమయం. కృష్ణ ఎవరినేనా హత్య చేశాడా? లేక ఏ పోలీసుల తుపాకి కాల్పులకు గురి అయ్యాడా?

ఆ రక్తం చూడగానే నాకు తల తిరిగినట్టు అయింది. ఎందుకంటే అంతకుముందు ఎప్పుడు నేను రక్తపాతానికి గురికాలేదు, రక్తపాతానికి ఎవరిని గురిచెయ్యలేదు.

పంకజం ఏడుస్తోంది. కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది.

నేను గబగబ చేతులు కడుక్కుని బట్టలు మార్చుకున్నా. తలుపులకి, కింద నేలమీద, గోడమీద అయిన రక్తం అంతా ఏమీ కనిపించకుండా తడిగుడ్డతో తుడిచేశాను.

పంకజాన్ని తెల్లవార్లూ ఓదారుస్తూ కూర్చున్నా.

ఆ విధంగా పంకజం భారం నామీద పడింది. పంకజం లాంటి అందమైన స్త్రీని పొందడం నిజంగా నా అదృష్టంగా భావించుకున్నా. పైగా పంకజం నేనంటే ప్రాణం పెడుతుంది.

"కృష్ణ ఒక హత్యకేసులో ఇరుక్కుని, పారిపోతున్న కృష్ణని పోలీసులు పట్టుకోలేక కాల్పులు జరిపారని, పొరపాటున, రెండు గుళ్ళు పొత్తికడుపులో దిగబడి, రైల్వే స్టేషన్ లెవిల్ క్రాసింగుదగ్గర చచ్చిపడి ఉండగా మర్నాడు

పోలీసులు కనుక్కున్నారని" ఆ తర్వాత తెలిసింది.

కృష్ణకి పంకజం అనే ఒక చెల్లెలు ఉన్నదని పోలీసులకి ఆచూకీ తెలియలేదనుకుంటా. పంకజం దగ్గరకు ఎవరూ పోలీసు ఎంక్వైరీకి రాలేదు.

పంకజాన్ని, కృష్ణ ఫోటోముందు నా అర్ధాంగిగా చేసుకున్నాను. చనిపోయిన కృష్ణ మమ్మల్నిద్దర్నీ ఆ పై లోకం లోంచి దీవించినట్టు అనుభూతి పొందాను.

పంకజానికి నాకో చెల్లెలు ఉన్నదని చెప్పడానికి ,నా మనస్సు ఒప్పుకోలేదు. కారణం నాకే తెలియదు.

అప్పటికి, ఇప్పటికి మా దాంపత్యం రహస్యంగానే ఉండిపోయింది.

పంకజం నేను జైలులో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా రాలేదు నన్ను చూడ్డానికి. పంకజం అలా బైటకి విచ్చల విడిగా తిరిగే రకం కాదు. ఎన్ని సంవత్సరాలైనా నాకోసం అలా ఎదురుచూస్తోనే ఉంటుంది. అదే పంకజంలోని ప్రత్యేకత.

పంకజం నా భార్య అని ఎవరికి తెలియకపోడం ఒక లాగ నాకు మంచిదే అనిపించింది.

"పంకజం ఎలా ఉందో? ఇంతకాలం పంకజం పోషణ ఎలా జరిగిందో?" అన్న ఆలోచన రాగానే నా ఒళ్ళు వేడెక్కింది. పంకజాన్ని త్వరగా కలుసుకోవాలి.

అటు ఇటు చూసి తృప్తిగా ఒక నిట్టూర్పు వదలి పంకజం ఉండున్న ఇంటి సందులోకి తిరిగాను. ఆ సందు నాకు బాగా పరిచయమే. ఒకపక్క మునిసిపాలిటి వాళ్ళ చెత్తడబ్బా, ఒకవైపు కుళ్ళు కాలవ. ఆ సందులో కాలవ పక్కనుంచే లోపలకి వెళ్ళి ఎడంవైపు తిరిగితే కుడివైపు

ఉన్న మూడో ఇల్లు పంకంజం ఇల్లు.

ఆ సందులోకి అడుగుపెట్టగానే నాకు వెయ్యి ఏనుగులు బలం వచ్చింది. ఇక్కడ తలదాచుకుంటే పట్టుకోడం ఎవరి తరం కాదు. నగరంలో బాగా పేరుమోపిన రౌడీలు, గూండాలు, ఉండే పేట ఇది. అందరూ కూలీ నాలీ చేసుకుని, కలిసి కట్టుగా బతికే సంఘీభావం ఉంటుంది ఇక్కడి వాళ్ళకి.

పోలీసులకి, చట్టానికి లొంగని కిరాతక జీవితం సాగించే వ్యక్తులకోసం ఈ పేట తయారయిందనుకుంటా. సంఘంలో గౌరవం, వ్యక్తిత్వం, హోదా ఉన్నవాళ్ళు ఎవరూ ఇక్కడకు రారు. రావడానికి భయపడతారు కూడా.

సందు తిరగ్గానే రెండు ఊరకుక్కలు నా కాళ్ళను చుట్టేసుకున్నాయి. నేను ఒకప్పుడు ఈ వాతావరణంలో తిరిగినవాణ్ణి కనుక ఊరుకున్నాయి. లేకపోతే నానా అల్లరి చేసి, ఒళ్ళంతా చీల్చి చెండాడి ఉండేవి.

పంకజం ఇంటి గుమ్మం ఎక్కుతుంటే నాకు చాలా హాయి అనిపించింది. ఒక కోటలోకి అడుగు పెడుతున్నంత అనుభూతి కలిగింది.

# 6

"పంకజం!" అన్నాను, నెమ్మదిగా తలుపు తడుతూ. నాలుగైదుసార్లు పిలవగా "ఎవరు?" అన్న పంకజం గొంతుక మంచం మీదనుంచి కదులుతున్నట్టు గరగర చప్పుడు వినిపించింది.

తలుపుతీసి నన్ను నిశితంగా పరీక్షచేసి "నువ్వా!" అని నన్ను లోపలకు ఒక్క లాగులాగి తలుపులు బిగించి నన్ను చుట్టుకుపోయింది. ఆశ్చర్యం, ఆనందంతో ఉక్కిరిబిక్కిరి

అయిపోయింది.

పంకజం నేను ఒకే మంచమీద పడుక్కుని తెల్లవారే వరకు ఈ రెండు సంవత్సరాల జీవితంలో జరిగిన సంగతులు, సంఘటనలు చెప్పుకుని ఒకరి కష్టాలకు ఒకరు ఓదార్చుకుంటూ గడిపేశాం.

కృష్ణ చనిపోయిన తర్వాత ఓ రోజు పెట్టె సర్దుతో వుంటే అందులో వున్నాయిట మూడువేల రూపాయలు. వాటితో సాగిస్తోంది జీవనం.

పంకజం ఉపచర్యలవల్ల పదిహేను రోజులకి కాలిమీద దెబ్బ కాస్త తగ్గుముఖం పట్టింది. ఇంకా మామూలుగా నడవలేకపోతున్నా.

కాస్త అటు ఇటు నడవడం అలవాటు అయిన తర్వాత ఒక రాత్రి బాగా వేషం మార్చుకుని బైటకి బయలుదేరేను నేను దాచిన ఎనభై వేల రూపాయలు తెచ్చుకోడానికి.

కాస్త హుషారుకోసం బార్‌లోకి వెళ్ళి విస్కీ పట్టించాను. బార్ పక్కనున్న కిళ్ళీషాపులో సిగరెట్లు కొనుక్కుంటున్నప్పుడు చూశాను, అక్కడ వ్రేలాడదీసిన దినపత్రికలో మొదటి పేజీలో పెద్ద అక్షరాలతో "అంతర్ రాష్ట్రీ ముఠా నాయకుడు జాన్, అతని అనుచరులు అహమ్మదాబాద్‌లో అరెస్టుచెయ్యబడ్డారన్న వార్త."

ఒక పేపర్ కొనుక్కుని అక్కడనుంచి చల్లగా చీకట్లోకి తప్పుకున్నా. పేపరు మడిచి బొడ్లో దోపుకున్నా, తీరుబడిగా తర్వాత చదువుకోవచ్చని.

నేను ఇంటికి చేరుకునేసరికి అర్ధరాత్రి దాటింది. నేను దాచిన సొమ్ము ఎవరికంటా పడకుండా సేఫ్‌గా వున్నందుకు చాలా ఆనందమనిపించింది నాకు.

"పంకజం! ఇదిగో ఎనభై వేల రూపాయలు, జాగ్రత్తగా దాచు. ఇక మన జీవితమంతా ఏ చీకూచింతా లేకుండా హాయిగా బ్రతకవచ్చు" అన్నాను.

"దొంగతనంచేసి తెచ్చావా ఇప్పుడు?" అంది పంకజం.

"ఇప్పుడు కాదు? రెండు సంవత్సరాల క్రిందట చేసిన దొంగతనం ఇది. పోలీసులు ఎంత హింపించినా ఈ డబ్బు విషయం మాత్రం బయటపెట్టలేదు నేను" చెప్పాను.

తీరుబడిగా పేపరుతీసి చదివేను.

"జాన్ నాయకత్వంలో జాన్ ముఠావాళ్ళు. జాన్ అహమ్మదాబాద్‌లో అర్ధరాత్రి ఒక జ్యూయలరీ షాపు కొల్లగొడుతుండగా పట్టుబడిపోయారు."

జైల్లో వాచ్‌మెన్‌లని చంపిన నేరం ఒప్పుకున్నాడుట. నా గురించి ఎన్నిరకాలుగా చిత్రహింసలు పెట్టినా ఏమీ చెప్పలేదుట.

జాన్ దొరికిపోయాడంటే నాకు చాలా బాధ కలిగించింది. అంతటి అనుభవశాలి జాన్ దొరికిపోయాడంటే, పోలీసులకు నేనొక లెక్కకాదు. ఇవాళ కాకపోయినా రేపైనా నేను కూడా పోలీసులకు దొరక్కపోను.

అందుకే ఎంత త్వరగా అయితే అంత మంచిది నా పని ఈలోగానే నెరవేర్చాలి.

ఇంకా నాకు స్వస్థత చేకూరలేదు.

ఈలోపుగా ఏదో ప్లాన్ వెయ్యాలి. ఆలోచిస్తో వుండిపోయా.

## 7

నా కాలు మళ్ళీ స్వాధీనంలోకి రావడానికి రెండు నెలలు పట్టింది. నేను యిప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతుణ్ణి అన్నమాట.

రేపే పని మొదలుపెట్టాలి, భుజంగం అంతం చూడాలి. శాంత ఆత్మకి శాంతి చేకూర్చాలి. ఆ తర్వాత నేను ఏమైపోయినా ఫరవాలేదు. పంకజానికి జీవితాంతం సరిపోడానికి ఎలాగూ పుష్కలంగా సొమ్ము ఇచ్చాను కదా!

ప్రతీకారంకోసం నా మనస్సు నన్ను రక్తపాతం చెయ్యమని పురిగొల్పుతోంది, నన్ను ఉసిగొల్పుతోంది.

మర్నాడు సాయంకాలం కొంచెం చీకటిపడగానే ఇంటిలోంచి బయలుదేరా. వేషం బాగా మార్చుకున్నా. ఈ వేషంలో పంకజం చూసినా సరే నన్ను పోల్చుకోలేదు.

తాపీగా భుజంగరావు ఎడ్రసు వెతుక్కుంటూ నడుస్తున్నా ఒక్కొక్క ఇంటి నెంబరు ఓరకంట కనిపెడుతూ.

భుజంగరావు ఇల్లు కనుక్కోడం అట్టే కష్టమనిపించలేదు నాకు. భుజంగరావు ఇంటి గేటు రెండువైపులా గోడమీద పాలరాతిమీద 'ఆర్. భుజంగరావు, కంట్రాక్టరు' అని అందంగా చెక్కబడివుంది తెలుగులోను, ఇంగ్లీషులోను.

గేటుమీద చెక్కమీద "కుక్క ఉన్నది జాగ్రత్త" అని బోర్డు ఉంది. గేటుకి లోపల ఒకవైపు గూర్ఖా స్టూలుమీద కూర్చుని ఉన్నాడు. బంగళా గేటుకు ఇరవై గజాల దూరంలో ఉంది. బంగళా ముందు అందమైన పూదోట. రకరకాల ఫలవృక్షాలు.

మేడ అంతా లైట్లతో అందంగా కనిపిస్తోంది.

ఆ రాత్రి భుజంగరావు ఇల్లు సమీపించాను.

గోడ అంచునే నడుస్తూ ఒకసారి వెనక్కి ముందుకి చూసుకున్నా. నేను ఎవరికీ కనిపించడానికి వీలులేదు. వీధిదీపం ఎక్కడో దూరంగా వుంది. నేను వేసుకున్న నల్లని

బిట్టలు చీకటిలో కలిసిపోయేలా వున్నాయి.

ఒక్క ఎగురుతో గోడ ఎక్కేశా. గోడకి ఆనుకుని వున్న మామిడికొమ్మ పట్టుకుని నెమ్మదిగా చెట్టుమీదకి చేరుకున్నా.

చెట్టుమీద నిద్రపోతున్న పక్షులు రెండు పైకి ఎగిరి పోయాయి.

గూర్ఖా వీపు నావైపుకి పెట్టబడి ఉంది.

అటువేపు తిరిగి బీడీ కాలుస్తున్నాడు. తోటంతా తిరుగు తోంది అల్సేషన్ డాగ్. అప్పుడప్పుడు వచ్చి గూర్ఖా దగ్గర నుంచుంటోంది.

కుక్క తిరుగుతున్న దారిలో పడేలాగ చప్పుడుకాకుండా విసిరేను. చీకట్లోపడ్డ బిస్కట్లు చూసింది అల్సేషన్. ఒక సారి గూర్ఖాకేసి చూసింది.

గూర్ఖా బీడీ కాలుస్తో మాంచి ఖుషీగా ఉన్నాడు ఎటో చూస్తో. కుక్క వచ్చి ఆవురావురుమని బిస్కట్లన్నీ తినేసి వెతుకుతోంది ఇంకా ఏమైనా మిగిలిపోయాయేమోనని.

మెల్లిగా గూర్ఖాదగ్గరకు వెడుతూ దార్లోనే నేలకరిచే సింది. తెల్లవారేవరకు లేవదు. మత్తు ఒళ్ళంతా ఆవరించు కుంది. కుక్క చచ్చిపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఓవర్ డోస్‌లో ఉంది మత్తుమందు.

కుక్కకోసం వెతుకుతున్నాడు గూర్ఖా. ఏమైపోయిందో అని స్టూలుమీదనుంచి లేచి తోటంతా తిరుగుతున్నాడు.

అంతకుముందే కుక్క పడిపోయినచోట ఉన్న ఒక గుబురులో నక్కి దాక్కుని గూర్ఖాకోసం జపంచేస్తూ ఎదురు చూస్తున్నా.

దూరాన్నుంచి కుక్కని చూసి గమ్మున దగ్గరకు వచ్చి

ఒంగుని చూస్తున్నాడు.

ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా వెనకనుంచి ఎడం చేత్తో నోరునొక్కి క్లోరోఫాం గుడ్డ ముక్కుకు అదిమి పట్టాను.

గూర్ఖా మెడ పక్కకు వాల్చేశాడు.

అతడిని వదిలేసి భుజంగరావుని వెతుక్కుంటూ మేడ లోపలికి వెళ్ళాను.

ఒక గదిలో పరుపుమీద హాయిగా ఫేనుక్రింద చల్లగా నిశ్చింతగా పడుకున్న భుజంగరావుని సమీపించాను.

పక్కనే ఉన్న టీపాయ్‌మీద విస్కీ బోటిల్, సోడాలు పళ్ళాలనిండా తినుబండారాలు వున్నాయి.

బాగా విస్కీ తాగి ఒళ్ళంతా నిషా పట్టించుకుని గురకలు పెడుతున్న భుజంగరావు పక్కకి చేరాను.

భుజంగరావు పక్కనే నుంచుని మొహంమీద గట్టిగా రెండుసార్లు చరిచాను.

భుజంగరావు అదిరిపడి కళ్ళు తెరిచి చూశాడు.

కాళ్ళు చేతులు కదల్చడానికి వీలులేకుండా అంతకుముందే తాళ్ళతో మంచానికి బిగించేశాను.

"నేనెవరో తెలుసా?" అన్నాను ఉరిమి చూస్తూ.

"తెలియదు?" అన్నాడు కోపంతో బుసలుకొడుతూ.

"రెండు సంవత్సరాల క్రిందట నీ యింటిలో వంట మనిషిగా చేరిన శాంత నా చెల్లెలు" అన్నాను భుజంగరావు ముఖంలోని భావాలు కనిపెడుతూ.

మొహంలో రంగులు మారుతున్నాయి.

"నీ కామాగ్నికి బలైపోయి, తన ప్రాణాలు తీసుకుని నాకు దూరమైపోయింది. నా చెల్లెలు ఆత్మశాంతికోసం,

నీ ప్రాణాలకోసం వచ్చిన నీ పాలిట మృత్యువుని." అన్నాను కత్తిని ఝళిపిస్తూ.

భుజంగరావు నోరు తడి ఆరిపోయింది.

చేతులు తమాషాగా తిప్పుతూ, రెండు చేతులు జోడించాడు.

ఇంక ఆలస్యం చెయ్యదలుచుకోలేదు. ఆలస్యంచేస్తే అమృతం కూడా విషమైపోతుంది.

కుడిచేతిలోని కత్తి గాల్లోకి లేచింది.

ఎడంచెయ్యి అరవకుండా నోరు నొక్కింది.

కత్తి పొత్తికడుపులోకి బలంగా దిగి మళ్ళీ గాల్లోకి లేచింది. అలా చేతులు నొప్పి పుట్టేవరకు పొడుస్తూనే ఉన్నాను,

రక్తం గది అంతా ఎర్రగా, చిక్కగా, పరుచుకుని వేగంగా చిమ్ముతోంది.

ఒక్కసారి భుజంగరావు మొహంలోకి చూశా. ప్రాణం ఎప్పుడో పోయింది.

కత్తిని దుప్పటితో బాగా తుడిచేసి, భుజంగరావుమీదే పడేశాను.

సింకు దగ్గరకు వెళ్ళి చేతులకి అయిన రక్తం శుభ్రంగా కడుక్కున్నా.

అక్కడవున్న సబ్బుతో ముఖం కడుక్కుని కొంచెం సేపు హాయిగా ఫేను క్రింద కూర్చున్నా అలసట తీర్చుకుంటూ.

ఇప్పుడు నా మనస్సు హాయిగా ఉంది.

నా చెల్లెలు శాంత ఆత్మ ఇప్పుడు ఆనందంతో గంతులు వేస్తుంది,

అదే నాకు తృప్తి. అదే నాకు నూతనోత్సాహం.

పోలీసులకి ఏ పరిస్థితుల్లోనూ, నేను పట్టుబడను. నా ఆచూకీ ఎంత మాత్రం తెలియదు. ఎందుకంటే నా వేలి ముద్రలుగాని, నా అడుగుజాడలుగాని, ఎక్కడా కనిపించవు కాళ్ళకి సాక్సులు, చేతులకు గ్లవుజస్, తొడుక్కున్నా.

గదిలోంచి బైటకి వచ్చేటప్పుడు నేను తిరిగిన ప్రదేశాలు. నేను ముట్టుకున్న వస్తువులు. జాగ్రత్తగా పరీక్షించుకుని, నా ఆచూకీ తెలిపే పరిస్థితి లేకుండా జాగ్రత్తపడ్డా.

గదిలోంచి వస్తూ ఆఖరిసారిగా భుజంగరావు శవాన్ని చూసి కసిగా నవ్వుకున్నాను.

రోడ్డుమీదకు చేరుకున్నాను. అప్పటికి టైం మూడవుతుంది.

రక్తంతో తడిసిన నా బట్టలు లుంగచుట్టి డ్రైనేజిలో పారేశాను, ప్రవాహానికి కొట్టుకుపోయేలా.

మనస్సు చాలా ఆందోళనగా, గాబరాగా ఉంది.

అంత రక్తం చూసేసరికి నా కళ్ళు తిరుగుతున్నట్టుగా వుంది.

సెంటర్లో ఉన్న సారాకొట్లో కసితీరేలాగ, పీకలదాకా తాగి ఇంటికి వచ్చి పక్కమీద వాలిపోయాను.

*  *  *

మెలుకువ వచ్చేసరికి కడుపు అంతా ఒకటే మంట. ప్రేగులు తెగిపోతున్నట్టు మరణ బాధ.

ఛాతీ భగభగమండుతున్నట్టుగా ఉంది.

'ఇదేమిటి? ఎప్పుడు ఇంత బాధలేదు? ఏమిటీ నరక బాధ?' కళ్లు కొంచెం తెరిచాను.

మసక మసకగా కనిపిస్తున్నాయి అన్నీ. మంచం మీద ఫేను గిరగిర తిరుగుతోంది.

మంచం పక్క డాక్టర్లు, పోలీసాఫీసర్లు, జైలు అధికారులు, అంతా గుమిగూడి ఉన్నారు.

"ఏమిటిది?హాస్పటలా?" అన్నాను నాలో నేను మాట్లాడుకుంటున్నట్టు.

"ఔను!ఇది హాస్పటల్ నీవు జైలునుంచి పారిపోయావు. నిన్నరాత్రి భుజంగరావుగారిని హత్య చేశావు కదూ?" అన్నాడు ఒక పోలీసాఫీసరు నా మీదకు ఒంగి.

"ఔనని" కసిగా తలూపేను.

పోలీసాఫీసర్లు గబగబా ఏదో రాసుకుంటున్నారు.

"నిన్నరాత్రి నువ్వుత్రాగిన సారాలో పొరపాటుగా విషం కలిసింది. చాలా మంది చచ్చిపోయారు.

నిన్ను హాస్పటల్లో చేర్పించారు మీ వాళ్లు. అప్పుడు నీ ఇంట్లో దొరికింది నీ చెల్లెలు శాంత నీకు రాసినఉత్తరం."

నా గుండె ఆగిపోతున్నట్టుగా ఉంది.

"దీనిమీద నీ వేలిముద్రలు వేసుకుంటున్నాం. నీ.చెయిలా ఇలా యియ్యి!" అన్నాడు ఒక పోలీసాఫీసర్.

ఇంక నాకు ఏమీ కనిపించటం లేదు.

డాక్టరు అన్న ఆఖరి మాటలు ఎలాగో అస్పష్టంగా వినిపించాయి.

"హి ఈజ్ గోయింగ్ టు బి డెడ్" అని. ***

# తడిగుడ్డతో గొంతుకోత!

## హుస్సేన్ బాషా

రజని వెక్కి వెక్కి ఏడుస్తోంది!

డిటెక్టివ్ ప్రేమ్‌కుమార్ రజనికేసి ఆశ్చర్యంగా చూశాడు. "నువ్వలా ఏడుస్తూ నిలుచుంటే అసలు విషయ మేమిటో నేనెలా అర్థం చేసుకోగలను. నావల్ల ఏం సహాయం కోరి వచ్చావో చెప్పమ్మా!" అని అడిగాడు, సిగరెట్ వెలిగించుకుంటూ.

రజని, ప్రేమ్‌కుమార్ ముఖంలోనికి చూసింది. జలజలా రాలుతున్న కన్నీటి కిరణాలను తుడుచుకుంది. "నా.... భర్త.... రమేష్.... అకారణంగా చనిపోయాడు...."

"అంటే?...."

"ఆయన్ని యెవరో హత్యచేసి చంపి వుంటారని నా అనుమానం."

"అనుమానమా? అంటే, నీ భర్త చావుకు కారణం నీకు తెలియదా?"

"అందరూ ఆయన హార్ట్‌ఫయిల్‌వల్ల మరణించి వుంటాడంటున్నారు."

"అంతా వివరంగా చెప్పు!"

"నా భర్త రమేష్ పబ్లిక్ వర్క్సు డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఇంజనీరు మహేష్ దగ్గర ప్యూన్ పని చేస్తున్నాడు. నెలకు రెండు వందలకుపైగా జీతం వస్తుంది. మాకు ఇద్దరు పిల్లలు!

నా భర్త ఎవరితోనూ ఎక్కువగా స్నేహంగా మెలిగే మనిషి కాదు. మితభాషి. తన పనేమిటో తను సక్రమంగా చూసుకుంటూ తన పై అధికారులపట్ల వినయవిధేయతలతో మెలిగేవాడు.

నిన్న కూడా డ్యూటీకి వెళ్లాడు. మామూలు టైం ప్రకారం అంటే రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వచ్చి పడుకున్నాడు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే నిద్ర లేచి ఆఫీసరు ఇంటికి వెళ్లేవాడు. కాని, ఈ రోజు ఉదయం 7 గంటలు కావచ్చినా నిద్ర లేవలేదు. ఒంట్లో బాగలేక లేవలేదనుకున్నాను.

రెండు మూడు సార్లు పిలిచాను. ఆయన లేవలేదు. జవాబివ్వలేదు. దగ్గరికి వెళ్ళి కదిలించాను. మనిషిలో చలనం లేకపోయేసరికి కప్పుకున్న దుప్పటిని ప్రక్కకు తొలగించాను. ఆయన ప్రాణాలు లేవని తెలుసుకొన్న నా హృదయ స్పందన ఆగిపోయినట్లయి, భయాందోళనలతో గట్టిగా గావుకేక వేసి ఆయన శవంపై వాలిపోయాను.

చుట్టు ప్రక్కలవాళ్ళు వచ్చి ఆ ఘోర దృశ్యం చూసి విభ్రాంతులయ్యారు. ఆరోగ్యవంతుడైన మనిషి తెల్లారేసరికి నిద్రపోయిన వాడు నిద్రపోయినట్లే మరణించాడంటే

ఎవరికైనా ఆశ్చర్యంగానే ఉంటుంది.

ఆయన అకస్మిక మరణా కారణం యెవరి ఊహకూ అందలేదు. కొందరు హార్ట్ అటాక్ అని, మరికొందరు ఏదైనా విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడేమోనని నలుగురు నాలుగు విధాల అనుకోసాగారు. కాని, ఆయన మరణానికి సరియైన కారణం యెవరికీ అంతు చిక్కలేదు! ఆయన హత్య కాబడి వుంటాడేమోనని నా అనుమానం!"

రజని చెప్పడం ఆపింది. అయినా దుఃఖంలో కన్నీటి ప్రవంతి ఆగడంలేదు.

"నీ భర్తను యెవరో హత్యచేశారనేదేనా నీ దృఢ నిశ్చయం?"

"అవును."

"నిజంగా అలాంటిదేదైనా జరిగియుంటే తప్పకుండా పరిశోధిస్తాను. నీకు యెవరిమీదైనా అనుమానం వుంటే చెప్పు!"

"చెప్పలేను. కాని, నిన్న మధ్యాహ్నం జరిగిన ఒక సంఘటన మీకు చెబుతాను. నా భర్త చావుకు.... ఆ సంఘటనకి ఏదైనా సంబంధముందేమో చూడండి!....

ప్రేమ్‌కుమార్‌గారూ! నిన్న మధ్యాహ్నం నా భర్త భోజనానికి ఇంటికి వచ్చినప్పుడు ఒక జిప్‌బ్యాగ్ తీసుకొచ్చాడు. దాన్ని నా చేతికిస్తూ— 'రజనీ! ఈ బ్యాగ్‌లో పదివేల రూపాయలున్నాయి. జాగ్రత్తగా దాచి వుంచు!' అన్నాడు.

నేనెంతో ఆశ్చర్యపడ్డాను. అంత డబ్బు ఎక్కడిదని అడిగాను. అందుకు ఆయన "రజనీ! ఆ వివరాలన్నీ నువ్వు నన్ను అడక్కూడదు - నేను చెప్పకూడదు. ఆ డబ్బు మనది! రేపు నీకు ఒక బంగారు నెక్లెస్, ఖరీదైన చీరెలు

తెస్తాను. త్వరలో ఎక్కడైనా స్థలం చూసి మంచి ఇల్లు కట్టిస్తాను!" అన్నాడు.

ఇది కల కాదు కదా అనుకున్నాను. ఇన్నాళ్ళకు నాకు మంచి చీరెలు, బంగారు నగలు, కాపురం చేయడానికి సొంత ఇల్లు లభించబోతున్నందుకు నేనెంతో సంతోష పడ్డాను. కాని, అంత డబ్బు ఆయనకు ఎవరిచ్చారో, ఎక్కడ్నించి తెచ్చారో అర్థంకాలేదు. ఎంత అడిగినా చెప్ప లేదు. సమయం వచ్చినప్పుడు చెబుతానన్నాడు.

ఆయన ఆశించిన విధంగా నాకు నగలు, చీరెలు కొనక ముందే....ఇల్లు కట్టుకోకముందే....డబ్బు తెచ్చిన మరుసటి దినమే ఆయన...." అని ఆమె తల వంచుకుంది. కుమిలి కుమిలి ఏడ్వసాగింది.

"రజనీ! ఈ కేసు పరిశోధించవలసిన పనిలేదు."

"ఏం?"

"రమేష్ హత్య కాబడలేదు. అతను హార్ట్ అటాక్‌తో చావలేదు. ఆత్మహత్య చేసుకొనివుంటాడు."

"లేదు. నా భర్త ఎన్నటికీ అంత నీచమైన పని చెయ్యడు."

"డబ్బు మనిషిని ఎన్నో విధాలుగా మారుస్తుంది. రజనీ! ఒక ఆఫీసులో ప్యూన్ పనిచేసే మనిషికి అకస్మాత్తుగా పదివేల రూపాయలు ఎక్కడ్నించి వస్తాయి? రమేష్ ఎక్కడైనా దొంగతనం చేసి వుండొచ్చు! రహస్యం బయట పడివుంటుంది. పోలీసుల చేతికి చిక్కక ముందే ఆత్మహత్య చేసుకున్నాడు. అంతే జరిగి వుంటుంది."

"ఆ డబ్బుకు—నా భర్త మరణానికి సంబంధం వుండ వచ్చు కాని, మీ రూహించినట్లు ఆయన దొంగతనం చేసే

మనిషి కాదు. కనుక, ఆయన ఆత్మహత్య చేసుకోలేదు.... హత్య చెయ్యబడ్డాడు."

"పోలీసులు ఏమన్నారు?"

"పోలీసు రిపోర్ట్ యివ్వవద్దని యిరుగు—పొరుగువాళ్ళు నన్ను వారించారు. కేసుల్లో యిరుక్కొని పిల్లల భవిష్యత్తు నాశనం చెయ్యవద్దన్నారు. అయినా ఆ చావు కబురు యెలాగో పోలీసులకు తెలిసింది. వెంటనే పోలీసులు వచ్చారు. ఆయన చావుకు కారణం అడిగారు. తెలియదన్నాను. అలా చెప్పమని యిరుగు—పొరుగువాళ్ళే చెప్పారు. హార్ట్ అటాక్‌వల్ల చనిపోయాడని, హత్యగాని ఆత్మహత్యగాని కాదని చెప్పారు. అంతటితో వాళ్ళేమీ పట్టించుకోకుండా వెళ్ళిపోయారు.

అయినా, నా భర్తను యెవరో హత్య చేసివుంటారనే అనుమానం నా హృదయంలో పెనుభూతంలా పట్టుకోవడంతో పోలీసులు చేయలేని పనిని మీరు త్వరగా చేయగలరని మీ సహాయం కోరి వెంటనే పరుగెత్తుకొని వచ్చాను. ప్రేమ్‌కుమార్‌గారూ!—నేను పేదదాన్ని. మీరు కోరినంత డబ్బు నేను ఇచ్చుకోలేను. మీరు కోరని పద్ధతిలో...." అని రజని చెబుతుంటే—

"నాకు ఫీజు ఏమీ అక్కర్లేదమ్మా! నీ అనుమానం నిజమైతే తప్పకుండా హంతకుడ్ని పట్టుకుంటాను" అని అన్నాడు డిటెక్టివ్ ప్రేమ్‌కుమార్ గంభీరంగా.

## 2

డిటెక్టివ్ ప్రేమ్‌కుమార్, రజని ఇంటికి వచ్చేసరికి అక్కడ ఇన్‌స్పెక్టర్ మనోహర్ తన బృందంతో కనిపించాడు.

పోలీసులు మళ్ళీ యెందుకు వచ్చారో అతనికి అర్థం కాలేదు.

"హల్లో ప్రేమ్‌కుమార్‌గారూ! రండి! సమయానికి వచ్చారు—" అని ఇన్‌స్పెక్టర్ మనోహర్ ఆహ్వానించాడు.

ప్రేమ్‌కుమార్ చిరునవ్వుతో మనోహర్‌కేసి చూస్తూ శవాన్ని చూడ్డానికి యింట్లోకి వెళ్ళాడు. అయిదు నిమిషాల్లో శవాన్ని చూసి తిరిగి బయటికి వచ్చాడు. "రమేష్ హత్య కాబడ్డాడని తెలిపి వచ్చారా?" మనోహర్‌ని అడిగాడు.

"రమేష్ హత్య కాబడలేదు. ఆత్మహత్య చేసుకున్నాడు."

"ఎలా?"

"శవపరీక్ష జరిగాక తెలుస్తుందిగా?"

"నేనడుగుతున్నది అదికాదు ఇన్‌స్పెక్టర్! అది హత్య కాదని ఆత్మహత్య అని ఎలా నిర్ణయించారు?"

"రమేష్ పదివేలు రూపాయలు చోరీ చేశాడు."

"ఎక్కడ?"

"ఇంజనీరు మహేష్‌గారింట్లో!"

"జరిగిందేవిఁటో వివరంగా చెప్పండి ఇన్‌స్పెక్టర్!"

"ప్యూన్ రమేష్ మరణవార్త మాకు ఉదయం 8 గంటలకు తెలిసింది. విషయమేమిటో తెలుకొరమ్మని మా హెడ్‌ను పంపించాను. హెడ్ తిరిగివచ్చి హార్ట్ అటాక్ వల్ల మరణించాడట—అని చెప్పాడు. దానికి మేము కలుగజేసుకునే అవసరం లేకపోయింది.

కాని, రమేష్ పనిచేసే యింజనీరు మహేష్ భార్య శ్రీమతి సుమతి—తన యింట్లో పదివేలు రూపాయలు చోరీ అయ్యాయని రిపోర్ట్ యిచ్చింది. తన అనుమానం ప్యూన్

రమేష్ ఆ డబ్బు చోరీ చేశాడని. నిన్న డబ్బు కనిపించక పోయేసరికి రమేష్‌మీద అనుమానంవేసి ఆ విషయం అడిగిందట. అతను కంగారుపడి తనకేమీ తెలియదని చెప్పాడట. అతని కంగారును అతని ముఖంలో కలిగిన మార్పును గమనించి అతనే ఆ డబ్బు దొంగిలించాడన్న దృఢనిశ్చయంతో—మర్యాదగా డబ్బు తెచ్చియిస్తే క్షమించి విడిచి పెడతానని లేకుంటే అతనిమీద పోలీస్ కంప్లయింట్ ఇస్తానని బెదిరించిందట. దానికి రమేష్ ఏమీ జవాబు ఇవ్వకుండా యింటికి వెళ్ళిపోయాడట. అతను డబ్బు తెచ్చి ఇస్తాడని ఎదురుచూసిందట. అతను రాలేదు.

కాని, రమేష్ మరణవార్త ఉదయం సుమతికి తెలిసింది. పదివేలు రూపాయలు దొంగతనం చేసిన రమేష్ గుట్టు బయటపడినందుకు భయపడి ఆత్మహత్య చేసుకున్నాడని తన రిపోర్టులో పేర్కొంది.

మా అనుమానం తీర్చుకోడానికి మేము వెంటనే ఇక్కడికి వచ్చాము. అతని భార్య ఇంట్లో లేదు. ఎక్కడికి వెళ్ళిందని విచారించాను. ఎక్కడికి వెళ్ళిందో ఎవరూ మాకు తెలియదన్నారు. భర్త శవం ఇంట్లో వుండగా ఆమె ఎక్కడికి వెళ్ళివుంటుందో అని ఆలోచించాను. రమేష్ తెచ్చిన డబ్బును ఆమె ఎక్కడైనా దాచడానికి పోయివుంటుందనుకున్నాను.

వెంటనే నా డ్యూటీ ప్రకారం ఇల్లు సోదా చేశాను. చెక్కపెట్టెలో బట్టలక్రింద జిప్‌బాగ్ కనిపించింది. జిప్‌బాగ్‌లో పదివేలు రూపాయలున్నాయి. కనుక, రమేష్ హత్య కాబడలేదు. అతను నిజంగా ఆత్మహత్య చేసుకొన్నాడని నిర్ణయించాను."

అని ఇన్‌స్పెక్టర్ మనోహర్ చెప్పి ముగించేసరికి రజని కోపోద్రేకాలతో గట్టిగా అరచింది.

"లేదు... నా భర్త దొంగతనం చెయ్యలేదు. అంతా అబద్ధం! నా భర్త ఆత్మహత్య చేసుకోలేదు ...హత్య చేయ బడ్డాడు!" అంటూ శవంపై వాలి వెక్కి-వెక్కి ఏడ్వసాగింది రజని.

ప్రేమ్‌కుమార్ కొద్ది క్షణాలు ఆలోచించాడు. సిగరెట్ వెలిగించుకొని రెండుదమ్ములులాగి "ఇన్‌స్పెక్టర్! మీకు సుమతి రిపోర్టు ఎప్పుడు ఇచ్చింది?" అని అడిగాడు.

"గంట క్రితం."

ప్రేమ్‌కుమార్ వెంటనే వాచీకేసి చూశాడు. "4 గం॥ 15 నిమిషాలు అయింది అంటె 3 గంటల 15 నిమి షాలకా?"

"ఎస్."

"సుమతి స్టేషన్‌కు వచ్చి రిపోర్టు యిచ్చిందా?"

"లేదు. ఫోన్‌చేసి చెప్పింది, నేను రిపోర్టు వ్రాసుకుని ఇక్కడికి వచ్చాను."

"ఆమె భర్త మహేష్ వుండగా ఆమె ఎందుకు రిపోర్టు చేసింది?"

"మహేష్ ఊర్లో లేరు. క్యాంప్‌కు వెళ్ళాడట."

"ఐ. సీ. నిన్ననే ఆమె ఎందుకు రిపోర్టు యివ్వలేదు?"

"అతను డబ్బు తెచ్చి ఇస్తాడేమోనని ఎదురుచూసిందట. అదీగాక ఆమె భర్త క్యాంపునుండి వచ్చాక రిపోర్టు ఇవ్వా లనుకున్నదట. అతను రాకపోవడం చూసి ఇప్పుడు రిపోర్ట్ ఇచ్చింది."

"ఆల్ రైట్! మీ డ్యూటీ మీరు చెయ్యండి. సాయంత్రం

6 గంటలకల్లా శవపరీక్ష జరిగిపోవాలి. నాకు డాక్టర్ రిపోర్ట్ కావాలి" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ ఆదేశానుసారం శవాన్ని పోస్టుమార్టమ్‌కోసం పోలీస్ వేన్‌లో హాస్పిటల్‌కు తరలించారు.

ఇన్‌స్పెక్టర్ మనోహర్ వెళ్ళిపోయాక "రజనీ! నా అనుమానంకూడా నిజమైంది. సందేహంలేదు; రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడు" అని చెప్పాడు ప్రేమ్‌కుమార్.

"ప్రేమ్‌కుమార్‌గారూ! నేను అబద్ధం చెప్పడం లేదు. ఆయన ఎప్పటికీ దొంగతనం చెయ్యడు."

"అసలు రహస్యం బయటపడినా నీ అభిప్రాయాన్ని నువ్వు మార్చుకోవడంలేదు. నువ్వేం చెప్పినా పోలీసులు నమ్మరు."

"నేను అబద్ధం చెప్పడం లేదు. మీకు సహోదరిలాంటి దాన్ని! నా మాటను విశ్వసించండి!"

"అయినా ఇప్పుడు నేనేమీ చెప్పలేను. డాక్టర్ రిపోర్టును బట్టి అతను ఏ విధంగా ఆత్మహత్య చేసుకున్నాడో తెలుస్తుంది. లేదా హత్య చేయబడ్డాడో అవగతమవుతుంది. కాస్త ఓపిక పట్టమ్మా. త్వరలోనే ఈ కేసును తేల్చిపారేస్తాను" అని చెప్పి ప్రేమ్‌కుమార్ అక్కడ్నించి హోటల్‌కు బయలు దేరాడు.

## 3

సాయంత్రం 6 గంటలకంతా శవపరీక్ష రిపోర్ట్‌ను పంపించాడు డాక్టర్.

అందులో హతుడు రమేష్ భోజనానంతరం అరటి పళ్ళను తిన్నాడు. ఆ అరటిపళ్ళలో అధికంగా స్లీపింగ్ టాబ్లెట్స్ వేసుకొని తినడంవల్ల నిద్రించిన రమేష్ నిద్రించి

నట్లే ప్రాణాలు విడిచాడు. అతని ప్రాణాలు రాత్రి 11-12 గంటలమధ్య పోయాయి. కనుక రమేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పవచ్చు—అని వుంది.

కనుక రమేష్ తను చేసిన దొంగతనం బయటపడినందుకు భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుతోంది.

అతను స్వయంగా నిద్రమాత్రలు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక, యెవరైనా అతన్ని తెలివిగా హత్య చేయడానికి నిద్రమాత్ర లుంచిన అరటిపళ్ళను అతనికి తెలియకుండా తినిపించారా??

స్లీపింగ్‌టాబ్‌లెట్స్ వేసుకున్న మనిషియొక్క ప్రాణాలు పోవడానికి కనీసం రెండు మూడు గంటలైనా పట్టవచ్చు. కనుక, అతను రాత్రి 8-9 గంటల మధ్య స్లీపింగ్ టాబ్స్ వున్న అరటిపళ్ళను తిని వుండాలి—అంటూ ఆలోచించిన ప్రేమ్‌కుమార్ వెంటనే రజని ఇంటికి వచ్చాడు.

"రజనీ! రాత్రి ఎన్ని గంటలకు ఇంటికి వచ్చాడు రమేష్?" అని అడిగాడు.

"తొమ్మిది గంటలకు."

"ఎన్ని గంటలకు భోంచేశాడు?"

"ఆయన యింట్లో భోంచేయలేదండీ. మహేష్‌గారి ఇంట్లోనే భోంచేసి వచ్చారు."

"అప్పుడప్పుడు అతను మహేష్ ఇంట్లోనే భోంచేస్తుంటాడా? లేక నిన్న రాత్రే భోంచేశాడా?"

"చెప్పాలంటే ఎక్కువగా ఆయన అక్కడే భోంచేస్తుంటాడు. సుమతి చాలా మంచిదట. ఆమె ఎంత సౌందర్యవతో మనసుకూడా అంత మంచిదట. ఆమె మంచితనం గురించి అప్పుడప్పుడూ చెబుతుంటాడు."

"అలాగా?" అని ఏదో ఆలోచించి తల పంకించాడు. "రజనీ! రాత్రి నీ భర్త అరటిపళ్ళు ఇంటికి తెచ్చాడా?"

"లేదు."

"రహస్యంగా తెచ్చుకున్నాడేమో?"

"ఏది తెచ్చినా నాకు, పిల్లలకు పెట్టకుండా ఆయన ఎప్పుడూ తినలేదు. ఒకవేళ తెచ్చుకొని తినియుంటే మంచం దగ్గర అరటితొక్కలు పడివుండేవి."

"కిటికీగుండా బయటికి విసిరివేసి వుండొచ్చు!"

"అసలు ఈ ఇంటికి కిటికీలే లేందే?"

"అంటే అతను అరటిపళ్ళను బయటే తినివచ్చాడు."

"ఆయన్ని చంపాలని యెవరైనా తినిపించివుంటారు."

ప్రేమ్‌కుమార్ రజనిని యింకేమీ అడుగలేదు. పెదిమల మధ్య సిగరెట్ పొగలను గ్రక్కుతోంది. క్రాపింగ్‌లో చేతివ్రేళ్ళు జొనిపి మెల్లగా గీరుకుంటూ అటూ ఇటూ పచార్లుచేస్తూ ఆలోచించసాగాడు. అతని కేదో విషయం స్ఫురణకు వచ్చి చప్పున ఆగాడు. సిగరెట్‌ను క్రిందవేసి బూటుకాలితో నలిపాడు. "రజనీ: మహేష్ బంగ్లాకు వాచ్ మెన్ ఎవరు?"

"కోటయ్య."

"కోటయ్య ఇల్లెక్కడుందో నీకు తెలుసా?"

"అవతలి వీధిలోనే! చిట్టచివరి ఇల్లు."

ప్రేమ్‌కుమార్ యింకేమీ అడుగలేదు. చప్పున బయటికి వెళ్ళాడు.

## 4

"రమేష్‌ను హత్యచేసిన హంతకి శ్రీమతి సుమతిని అరెస్ట్‌చేయించి యిక్కడికి వస్తున్నాను." అని డిటెక్టివ్

ప్రేమ్‌కుమార్ చెప్పేసరికి ఎంతో ఆశ్చర్యపడింది.

"సుమతి నా భర్తను చంపిందా?"

"అవునమ్మా! నీ భర్త ఆత్మహత్య చేసుకోలేదు. హత్య చేయబడ్డాడు.

సుమతి ఇంట్లో పదివేల రూపాయలు చోరీకాబడ్డాయని, ఆ డబ్బును ప్యూన్ రమేష్ తీసివుంటాడన్న అనుమానం మీద అతన్ని అడిగిందని, అతను తనకేమీ తెలియదని చెబితే పోలీసు రిపోర్ట్ ఇస్తానని బెదిరించిందని సుమతి చెప్పింది.

నిజంగా డబ్బు చోరీకాబడియుంటే వెంటనే రమేష్ మీద కాకపోయినా డబ్బు పోయిందని పోలీసు రిపోర్ట్ యిచ్చేది. అదికాకుండా చోరీకాబడింది పగలే! తను ఇంట్లో వుండగా పట్టపగలు అంత డబ్బు పోయిందంటే ఆలోచించవలసిన విషయం.

ఆ ఇంట్లో కొత్త దొంగలెవరూ చోరీజరుపడానికి అవకాశంలేదు. ఆ ఇంట్లో మెలిగే మనుష్యులే తీసివుండాలి. పగలు ప్యూన్ రమేష్, పనిపిల్ల కాంతం, నైట్ వాచ్‌మెన్ కోటయ్య — ఆ ఇంట్లో తిరిగే మనుషులు. డబ్బు చనిపోయిన రమేష్ ఇంట్లో లభించింది గనుక మిగతావారికి ఆ చోరితో సంబంధంలేదని అనుకోవచ్చు.

ఆఫీసుకు వెళ్ళి వాచ్‌మెన్ కోటయ్యను కలుసుకున్నాను. డబ్బు రమేష్ ఇంట్లో దొరికిందని తెలుపకుండా నువ్వే ఆ దొంగతనం చేసినట్లు తెలిసింది అన్నాను.

కోటయ్య భయంతో వణికిపోయాడు. వెంటనే కాళ్ళ మీద పడ్డాడు, ఆ డబ్బు ఎవరూ దొంగిలించలేదని సుమతి రమేష్‌కు యిచ్చిందని, నిన్న సాయంత్రం రమేష్ సుమతి

ఎదురుగానే ఒక జిగ్‌బాగ్ చంకలో పెట్టుకొని వెళ్ళడం తను చూశానని కోటయ్య చెప్పాడు.

అంత డబ్బు సుమతి రమేష్‌కు ఎందుకు యిస్తుందని అడిగిందానికి, వారిద్దరి మధ్య చాలా రోజులనుండి తెర చాటు భాగోతం జరుగుతుంది సార్! అని అసలు రహస్యం బయటపెట్టాడు.

సుమతి పెళ్ళి జరిగి 12 సంవత్సరాలు. ఆమెకు సంతానం లేదు. పరపురుష సంపర్కంవల్ల పిల్లలు పుడతారన్న అభిప్రాయంతో సుమతి ఇంజనీరు బాబుగారు ఇంట్లో లేని సమయం చూసి రమేష్‌తో గడిపేది. అందుకే అతనికి రోజూ అన్నం పెడుతుంది. ఖర్చులకు డబ్బు యిస్తుంది.

సుమతి యిప్పుడు గర్భవతి! రమేష్‌తో సంబంధం వుందని ఎవరికీ తెలియదనుకుంది. కాని నాకు వారి విషయం చాలా రోజులనుండి తెలుసా బాబూ! అయినా నాకు తెలిపి నట్లు యింతవరకు యెవరితోనూ బయటపెట్టలేదు అని చెప్పాడు కోటయ్య.

రమేష్‌ను ప్రేమించిన సుమతి తనకు అతనివల్ల గర్భం వచ్చింతరువాత పదివేల రూపాయలు అందజేసి అతన్ని అంత రహస్యంగా ఎందుకు చంపిందో బాగా ఆలోచించిన మీదట నాకు అర్థమైంది.

వెంటనే మెరుపులా ఓ ఉపాయం స్ఫురించింది. కోటయ్యను రాత్రికి సుమతి ఇంటికి రావద్దని చెప్పాను. వేషం మార్చుకుని కోటయ్యలా తయారయ్యాను. 6 గంట లకు ఆమె ఇంటికి వెళ్ళాను. నన్ను చూసి సుమతి—

'ఏం కోటయ్యా, ఈ రోజు చాలా పెందలాడే వచ్చావు?' అని అడిగింది.

"మరేంలేదు అమ్మగారూ! మీతో కాస్త పనుండి.... వచ్చాను. అమ్మగారూ! మూడు సంవత్సరాల క్రితం నా కూతురు పెళ్ళికి డబ్బులేక రెండువేల రూపాయలకు ఇల్లు తాకట్టుపెట్టాను. పది రోజుల్లో నేను బాకీ కట్టకుంటే ఇల్లు బాకీదారుని సొంతమైపోతుంది. అతను నోటీసు పంపించి వారం రోజులైపోయింది. అంత డబ్బు నా దగ్గరెక్కడుంది అమ్మగారూ! ఎలాగైనా ఇల్లు విడిపించమని మా ఇంట్లో ఒకటే గోల! ఇంకా పెళ్ళికావలసిన యిద్దరు పిల్లలున్నారు. ఎంత ఆలోచించినా ఇల్లు విడిపించే మార్గం కనిపించలేదు అమ్మగారూ! ఈ సమయంలో నా కష్టాలను తీర్చగలిగేవారు మీరొక్కరేనని ఎంతో ఆశతో వచ్చాను అమ్మగారూ!"

"నీ కష్టాలు నేను తీర్చాలా?"

"మీరు నాకు సహాయం చేస్తే నా అప్పు తీరి ఇల్లు నిలబడుతుంది."

"అంటే నీకు రెండువేల రూపాయలు నేను ఇవ్వాలా?"

"రెండువేలు చాలవు అమ్మగారూ! వడ్డీ అయిదువందలు అయింది. మొత్తం...."

"కోటయ్యా!"

"మీరు నాకీ ఒక్క సహాయం చేసి పెడితే?"

"....చేసిపెడితే?"

"చచ్చినా మీ రహస్యం బయటికి పొక్కనివ్వను. ఏమీ ఎరుగనివాడిలాగే ఆ రహస్యాన్ని నా గుండెల్లోనే సమాధి కడతాను." అని చెప్పేసరికి సుమతి నాకేసి అదో విధంగా చూసింది.

"రహస్యమా?" అంది అయోమయంగా నాకేసి చూస్తూ.

"అవును. మీరు యింతవరకూ రమేష్‌తో ప్రేమకలా

పాలు సాగించారు. మీరిద్దరి భాగోతం నేనెప్పుడో కని పెట్టాను. కూతురులాంటివారని భావించి, రహస్యాన్ని నా కడుపులోనే దాచుకున్నాను. భగవంతుడు మీకు మీ భర్త వల్ల గాకపోయినా రమేష్‌వల్ల సంతానం కలిగే అదృష్టాన్ని కలిగించాడు. అందుకు నేను కూడా చాలా సంతోషపడు తున్నానమ్మగారూ!"

"కోటయ్యా! ఏఁవిటి నువ్వంటున్నది?"

"మీరు రమేష్‌తో అవినీతిగా ప్రవర్తించి అతనివల్ల స్వర్గసుఖాలు చవిచూసి కూడా....చివరికి అతన్ని హత్య చేశారు."

సుమతి కంగారుపడింది. భయాందోళనలతో 'కోటయ్యా!?' అని అరిచింది. 'లేదు....అబద్ధం!....నేను రమేష్‌ను ఎందుకు హత్యచేస్తాను?'

"ఏనాటికైనా రమేష్‌వల్ల మీకు ప్రమాదం రావచ్చునని."

"నువ్వు చెప్పేదంతా అబద్ధం! నానుంచి 2,500 రూపా యలు సులభంగా రాబట్టడానికి ఉపాయం....నాతో బ్లాక్ మెయిల్ చేయాలనుకుంటున్నావా కోటయ్యా?....ఆ బ్రూట్ నా ఇంట్లో దొంగతనంచేసి గుట్టు బయటపడిందని పిరికి వాడై ఆత్మహత్య చేసుకొని చచ్చాడు."

"కాదు. అధికమైన నిద్రమాత్రలను అరటిపళ్ళలో పెట్టి ప్రేమతో అతనికి యిచ్చారు. మీరు చేస్తున్న ద్రోహం అర్థంచేసుకోలేక మిమ్మల్ని, మీ కపట స్వార్థప్రేమను నమ్మి అరటిపళ్ళను తిని ఇంటికి వెళ్ళి చచ్చాడు. అమ్మ గారూ! రమేష్ చావుకు కారణం మీరేనని నాకు బాగా తెలుసు. నిన్న సాయంత్రం నాతో మీరు అరటిపళ్ళు తెప్పిం చారు. అబద్ధమా?....ఈ విషయం పోలీసులకి తెలిస్తే

హత్యానేరంమీద మిమ్మల్ని అరెస్ట్ చేస్తారు. అప్పుడు మీ పరువుప్రతిష్ఠలు గంగలో కలిసిపోతాయి. మీ భర్త గుండె ఆగి చస్తాడు. ఆలోచించండి అమ్మగారూ! నా అవసరం తీర్చారంటే నేను మీ రహస్యం బయటపెట్టను."

సుమతి కొద్ది క్షణాలు పలుకలేదు. భయాందోళనలతో ఆకులా వణికిపోయింది. ముఖంపై కత్తివ్రేటుకు నెత్తురు చుక్క లేదు. ఆమె కళ్ళనుండి అశ్రువులు జారుతున్నాయి. సుమతి వెంటనే నా కాళ్ళమీద పడింది.

"కోటయ్యా!"

"కాదు. డిటెక్టివ్ ప్రేమ్‌కుమార్‌ను."

సుమతి దిగ్గున లేచింది. వేషాన్ని తీసివేశాక నా ముఖం కేసి చూసి ప్రమాన్పడిపోయింది. 'ప్రేమ్....కు....మా....ర్!?....' ఆమె పెదాలు వణికాయి.

ఇన్‌స్పెక్టర్ మనోహర్‌కు ఫోన్‌చేయగా వెంటనే వచ్చి సుమతిని అరెస్ట్ చేశాడు." అని ముగించాడు ప్రేమ్ కుమార్.

అంతా విన్న రజని "అసలు రహస్యం యిదా?" అనుకొంది, కన్నీళ్ళు తుడుచుకుంటూ.

***

మిత్రుడు: ఏమయింది సుబ్రావ్? ఒకే కాలికి రెండు కట్లు కట్టావు?

సుబ్రావ్: కుక్క కాటుకి చెప్పుదెబ్బ అంటారు గదా అని, మొన్న కుక్క కరిస్తే చెప్పుపెట్టి కొట్టాను. వెధవది మళ్ళీ కరిచింది!

—వి. రాజచంద్ర, విజయనగర్ కాలనీ.

# గుండెలు తీసిన బంటు!

శశిభూషణ్

చీకటి పడింది.

వీధి దీపాలు చకచక వెలిగాయి. ఒక్కసారిగా నలు వైపుల నుంచీ పైకిలేచిన చీకటి తెరలు చిన్నబోయాయ్.

"ఇక్కడ ఆపెయ్యి!" చెప్పాడు విక్రాంత్- రిక్షావాలాకి విన్పించేలా.

రిక్షా ఆగింది.

విక్రాంత్ రిక్షానుండి క్రిందకు దిగాడు. పాంటు జేబు లోంచి రూపాయి నోటుతీసి రిక్షావాలాకి యిచ్చాడు.

ఖాళీ రిక్షా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

ఇళ్ళ నెంబర్లు చూసుకుంటూ ముందుకు కదిలాడు విక్రాంత్. అతనికి కావల్సిన ఇల్లు పది బంగ్లాళ కవతల వుంది.

అది ఎక్స్‌టెన్షన్ ఏరియా కావటంతో ఇళ్ళు విడివిడిగా అందంగా కట్టబడున్నాయ్. ప్రతి ఇంటిముందు తోట

కన్పిస్తోంది. ప్రశాంతంగా వుండే కాలనీ అది. రాత్రి తొమ్మిది దాటితే గంభీరంగా మనుష్య సంచారం లేకుండా వుంటుంది.

మర్యాదస్తులు, ఉన్నత కుటుంబీకులు నివసిస్తున్న ప్రాంతమది. మద్రాస్‌లోని ఒక అఫిషియల్ కాలనీ.

"13-128" నెంబరు ఇంటిముందు ఆగాడు విక్రాంత్. నెంబర్ మరొకసారి చూసాడు.

ఆ ఇల్లు గురించి అతనికి కొంత సమాచారం తెలుసు. పదిహేను రోజులుగా శ్రమించాడు. కోడిగుడ్లు అమ్మే నెపంతో ఓరోజు ఆ ఇంట్లోకి వెళ్లాడు. మరొకసారి పాత వారపత్రికలు కొనుక్కుంటానంటూ వెళ్ళాడు. ఆ ఇంటికి న్యూస్ పేపర్ సప్లయ్ చేసే కుర్రాడితో స్నేహం చేసాడు.

ఎలాగైతేనేం.... తనకు కావల్సిన సమాచారం పూర్తిగా సేకరించుకో గలిగాడు.

ఆ ఇల్లు జగన్నాధరావ్‌ది. ఆయన మిలటరీలో బ్రిగేడియర్ వరకు ఎదిగి ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు. ప్రభుత్వం ఇచ్చిన గ్రాట్యూటీ బ్యాంక్‌లో పడేసాడు. భార్య, బిడ్డతో నిశ్చింతగా రోజులు నెట్టేస్తున్నాడు. నెలరోజుల క్రితం హఠాత్తుగా ఆయన్ని లక్ష్మి వరించింది. యు.పి. రాష్ట్రప్రభుత్వ లాటరీలో లక్షరూపాయలు వచ్చాయ్.

మిలటరీలో అయిన అలవాట్లు కొన్ని మానుకోలేక పోతున్నాడు జగన్నాధరావ్. ప్రతిరోజూ క్లబ్‌కి వెళ్ళాల్సిందే. అక్కడ ఎంతో కొంత హాట్‌డ్రింక్ సేవించి, కాసేపు పేకాటతో కాలం దొర్లించి ఇంటికి తిరిగి వస్తాడు.

చీకటి పడుతుండగా క్లబ్‌కి బయలుదేరి వెళ్ళాడంటే తిరిగి ఇంటికి రావటం రాత్రి ఏ పదకొండు గంటలకో.

జగన్నాథరావ్ అర్థాంగి ప్రమీలాదేవి మూడురోజుల క్రితం కాకినాడకు వెళ్ళింది. ఆవిడ పుట్టినిల్లు అదే కావటంతో తిరిగి రావటానికి కాస్త ఆలస్యం కావచ్చు.

ఇహపోతే ఆ ఇంట్లోని ఆఖరు వ్యక్తి జగన్నాధరావ్ కూతురు- మాధవి. కాలేజీ చదువులతో కుస్తీ పడుతోంది. ఫైనల్ బియ్యే.

ఓసారి పరిసరాల్ని పరికించి చూసాడు విక్రాంత్. ప్రక్కింటి ఆవరణలోంచి రోడ్డుమీదకు దూసుకొచ్చిన రోల్స్‌రాయిస్ ఇతన్ని దాటి ముందుకు వెళ్ళిపోయింది.

విక్రాంత్ అమాయకుడు కాదు- యాంటీ సోషల్ ఎలిమెంట్. ఎక్స్‌పర్ట్ క్రిమినల్.

పదిహేనేళ్ళ వయసులో మొట్టమొదటిసారిగా నేరం చేసాడు. జాగ్రత్తగా ఓ జేబు కత్తిరించాడు. అటుతర్వాత ఐదేళ్ళవరకు పోలీసులను తప్పించుకొని తిరిగాడు.

ఓ అర్థరాత్రి పూట మద్రాస్‌లోని ఓ ఇంట్లో దోపిడీ చేస్తూ మూడేళ్ళక్రితం పట్టుబడ్డాడు. ఫలితంగా రెండేళ్ళు శిక్ష అనుభవించాడు జైల్లో.

ప్రస్తుతం విక్రాంత్ వయసు పాతిక. తిరిగి జైలు కెళ్ళటం అతని కిష్టంలేదు. అందుకే జైలునుంచి బయట పడినది మొదలు ఎంతో జాగ్రత్తగా తన వృత్తిలో 'నెగ్గు కొస్తున్నాడు.

ఆరడుగుల రెండు అంగుళాల ఎత్తుతో దృఢంగా కన్పిస్తాడు విక్రాంత్. ఎర్రటి శరీరం. ఉంగరాల జుత్తు, నిండైన బుగ్గలు, ఖరీదైన దుస్తులు అతన్నొక లక్షాధికారి బిడ్డలా చూపిస్తుంటాయ్.

విక్రాంత్ దుస్తుల్ని, ఆకారాన్ని బట్టి అతని వృత్తిని

అంచనా వెయ్యటం కష్టం.

తన్ను దాటి వెళ్ళిన రోల్స్ రాయిస్ వైపు ఓరగానైనా చూళ్ళేదు విక్రాంత్. గంభీరంగా అడుగులేస్తూ జగన్నాథ రావ్ ఆవరణంలోకి నడిచాడు. దగ్గరగా వేసున్న మెయిన్ గేటు తలుపు తెరుచుకుని, ముందుకు వెళ్లాడు. దర్జాగా వరండా మెట్లెక్కి, నింపాదిగా కాలింగ్ బజర్ స్విచ్ నొక్కాడు.

లోపల ఎక్కడో బజర్ మ్రోగుతున్న చప్పుడు విక్రాంత్‌కి విన్పిస్తోంది. స్విచ్ మీదనుంచి చూపుడువేలు తీసేసాడు. రెండు క్షణాలాగి తిరిగి స్విచ్ నొక్కాడు.

హైస్కూల్ గడప దాటకపోయినా విక్రాంత్ చవట కాదు. తనమీద తనకెంతో నమ్మకం కలిగిన వ్యక్తి అతను. గుండెలు తీసిన బంటు!

## 2

చిన్నగా కంఠం సవరించుకుంది మాధవి. అప్పటికే బాగా అలసిపోయినట్టు కన్పిస్తోందామె. అయినా తిరిగి తన వుపన్యాసం కొనసాగించింది.

"....ఇది ఒకరి సమస్య కాదు. ఒక జాతి సమస్య. ప్రకృతికి స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే. సమస్యలకు టెర్రరిజమ్ పరిష్కారమార్గం కాజాలదు. యుగయుగాలుగా, తరతరాలుగా టెర్రరిజమ్ గురించి యోచించకుండా ఓర్పు వహిస్తూనే వుంది స్త్రీ జాతి. స్త్రీకి పర్యాయపదం సహనం కావటమే అందుకు కారణం.

అబల, ఆడది, దైవం, పాపం, కర్మం, ప్రాప్తం మొదలైన మాటలు చెపుతూ స్త్రీ జాతిని అనాది నుంచీ దోపిడీకి గురిచేస్తూనే వున్నాడు పురుషుడు. ఆ బందిపోటు

తానే అయి హాయిగా, నిరంకుశంగా బ్రతికెయ్యాలని చూస్తున్నాడు.

ఆదినుంచీ పురుషుని చేష్టలు అతని ఆధిక్యతను చాట డానికి, కాపడటానికి తోడ్పడుతున్నాయేగాని, స్త్రీ పురోగమ నానికి ఏమాత్రం చేయూత నివ్వలేదు...."

ఒక్కక్షణం ఆగిందామె. దీర్ఘంగా గాలిపీల్చి వదిలింది. నిలువు టద్దంలో కన్పిస్తున్న తన ప్రతిబింబాన్ని చూస్తూ నవ్వి, మళ్ళీ ప్రారంభించింది.

"1946 లోని భారత స్త్రీకి నేటి భారత నారికి కాస్త తేడా వున్నమాట నిజమే. అది పురుషుని గొప్పతనం కాదు. అటు ప్రభుత్వం ఇటు స్త్రీలు ముందంజ వెయ్యటమే కాక...."

కాలింగ్ బజర్ మ్రోత మాధవి వాక్ ప్రవాహానికి అడ్డు పడింది. పమిటతో ముఖం తుడుచుకుంటూ గదిలోంచి బయటకు నడిచింది. బజర్ చేస్తున్న ధ్వని ఇంకా విన్పిస్తూనే వుంది.

కాలేజీ డిబేటింగ్‌లో "స్త్రీ సమస్యలు" అనే విషయంపై మాట్లాడటానికి ఇంట్లో ప్రాక్టీస్ చేస్తోంది మాధవి. డిబే టింగ్‌లో పాల్గొనవల్సిన రోజు ఇంకో వారం తర్వాతగాని రాదు. అయినా ఇప్పట్నుంచి తయారవుతోందామె.

బాల్కనీలోంచి క్రిందకు చూసిన మాధవికి తోట, గేటు మాత్రమే కన్పించాయ్. క్రింద వరండాలో నిల్చుని కాలింగ్ బజర్ స్విచ్ నొక్కే వ్యక్తి పైన బాల్కనీలో నిలబడిన వారికి కన్పించే అవకాశం లేదు.

ఆ సంగతి మాధవికి తెల్సు. వచ్చింది ఎవరై వుంటారా? అని ఆలోచిస్తూ మేడమెట్లు దిగి, హాల్లో కొచ్చింది.

బజర్ ఇంకా మ్రోగుతూనే వుంది.

హాల్లో ట్యూబ్‌లైట్ వెలిగించి, తలుపు గడియ తీసింది మాధవి.

ఎదురుగా గుమ్మం కటువైపు విక్రాంత్ నిలబడున్నాడు.

విక్రాంత్‌ని మాధవి చూడటం అదే మొదటిసారి. వద్దనుకుంటూనే రెండవసారి పరిశీలనగా చూసిందతన్ని.

సినిమా హీరో లక్షణాలతో, కన్నెపిల్లలకు గిలిగింతలు పుట్టించేటంత అందంగా కన్పిస్తున్నాడు విక్రాంత్. ఫ్లానల్ పాంటు. పోలో నెక్ స్వెట్టర్ ధరించాడు. నల్లటి బూట్లు అప్పుడే పాలిష్ చేసినట్టు నిగనిగ మెరుస్తున్నాయ్. మెడలో బౌ నల్లగా కన్పిస్తోంది- రెండు కప్పల్ని మింగి మత్తుగా నిద్రిస్తున్న నల్లత్రాచులా.

అతని ముఖంలో ఎటువంటి భావాలూ కదలటం లేదు. నిర్మలంగా కన్పిస్తోంది. చెంపలమీదకు గుబురుగా పెంచిన సైడ్ బర్న్స్. సన్నటి మీసం, నున్నగా గీసిన గెడ్డం అతని అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయ్.

"మాధవి మీరేనా?" తాపీగా ప్రశ్నించాడు విక్రాంత్.

అతని స్వరంలోగాని, ఆ నిలబడిన విధానంలోగాని, అడిగిన తీరులోగాని ఎక్కడా తొణుకు-బెణుకు లేదు.

అవునన్నట్లు తలూపింది మాధవి. "మీరు...." ఆ తర్వాత ఏంమాట్లాడాలో తెలియక నీళ్ళు నమిలింది.

"నా పేరు వివేక్. మీతో కొంచం మాట్లాడాలి. నన్ను లోపలికి రానిస్తారా?"

అప్పుడు అర్థమైంది మాధవికి, తను గుమ్మానికి అడ్డుగా నిలబడున్న విషయం. విక్రాంత్‌ని అనుమానించ లేదావె. "రండి!" అంది ప్రక్కకు జరుగుతూ.

విక్రాంత్ లోని కెళ్ళాడు. అరక్షణంలో హాల్ ని, హాల్లోని ఫర్నీచర్ ని పరికించి చూసాడు.

"మిస్ మాధవీ! మీరు నన్ను క్షమించాలి!" తల తిప్పి ఆమెను చూస్తూ ఎంతో వినయంగా అన్నాడు.

"తప్పకుండా క్షమిస్తాను. విషయం విన్న తర్వాత. ప్లీజ్.... అలా కూర్చోండి!" సోఫాకేసి చేయి చూపించింది మాధవి.

విక్రాంత్ కూర్చోలేదు. "మిస్ మాధవీ! నేను ఈ ఇంటి అల్లుడిని కాదు...." అతని చేయి పాంటు జేబులోకి వెళ్ళి రివాల్వర్ తో బయటకొచ్చింది. "దీన్నిగురించి మీకు ప్రత్యేకంగా చెప్పటం అనవసరం. వివేకంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను. నాకు మర్యాదలు అవసరంలేదు. ప్లీజ్.... నేను చెప్పినట్టు వినండి! లేకుంటే ప్రమాదం."

మాధవి ఆశ్చర్యపోయింది. వెంటనే ఆ షాక్ నుండి తేరుకోలేదు. నిమిషం తర్వాత కనురెప్పలు కదిలించిందామె. నెమ్మదిగా ఊపిరి పీల్చుకుని ఒక్కసారిగా వదిలేసింది.

"మిస్టర్! ఎవరు నువ్వు?" ఎలాగో కంఠం విప్పగల్గింది.

తల అడ్డంగా వూపాడు విక్రాంత్.

"నా వివరాలు మీకు చెప్పలేను. అది నా వృత్తి ధర్మానికి విరుద్ధం. ప్లీజ్.... తలుపుమూసి గడియ వెయ్యండి."

"షటప్! మర్యాదగా బయటకు వెళ్తావా, లేక...." ఆగింది.

"గో ఎహెడ్" నవ్వాడు విక్రాంత్. "మీరు చెప్పినట్టు నేను వినకూడదు. ఎందుకంటే ఆయుధం వున్నది నా చేతిలో."

హఠాత్తుగా మాధవి శరీరం జలదరించింది ఎందుకో.

వెన్నులోంచి పుట్టుకొస్తున్న చలి శరీరాన్ని వణికిస్తోంది.

"గడియ వెయ్యకుంటే ఏంచేస్తావ్?" ధైర్యాన్ని కూడ గట్టుకుని ప్రశ్నించింది మాధవి.

"చంపేస్తాను."

"ఆ తర్వాత చట్టం చేతిలో నువ్వు చస్తావ్."

"అఫ్కోర్స్- అది చూడటానికి మీరు జీవించి వుండరు. అంతేకాదు, మిస్ మాధవీ! ప్రస్తుతం ఈ ఇంట్లో మీరు ఒక్కరే వున్నారు. మిమ్మల్ని హత్యచేసాక ఇక్కణ్ణుంచి నేను పారిపోవటానికి ఆ తర్వాత పోలీసులను తప్పుదారి పట్టించటానికి నాకు ఎక్కువ అవకాశాలు వున్నాయ్. మూర్ఖంగా యోచించి విలువైన ప్రాణాలు పోగొట్టుకోవటం అవివేకం. డు యా డై. సే. క్విక్!"

కిక్కురు మనకుండా కదిలింది మాధవి. బుద్ధిగా తలుపు మూసి గడియవేసింది.

"గుడ్! ఇహ ఐరన్ సేఫ్ వున్న గదిలోకి నడవండి!"

విక్రాంత్ ఎత్తు ఏమిటో అర్థమైపోయింది మాధవికి. అతని వృత్తికి, ముఖంలో కన్పిస్తున్న భావాలకు పొంతన కుదరటం లేదు. అంతేకాదు, విక్రాంత్ మాటల్లో ఎటువంటి వెలితీ లేదు. ఎంతో పొలైట్గా మాట్లాడుతున్నాడు.

నీచమైన వృత్తిలోని వ్యక్తిగా విక్రాంత్ని వూహించుకో లేకపోతోంది మాధవి. అతనిమీద కోపం కంటే ఎక్కువగా జాలే కలుగుతోం దామెకు.

"వివేక్...." బలవంతంగా నవ్వింది మాధవి. "ఫైన్ నేమ్. నీవంటి హాండ్సమ్ చాప్.... సభ్యత, సంస్కారం తెల్సిన వ్యక్తి చేయాల్సిన పనులుకావు యివి. ఎటువంటి అఘాయిత్యమూ చెయ్యకుండా దయచేసి వెళ్ళిపో. నీ

విషయం ఎవరికీ చెప్పను."

ఒకడుగు ముందుకేసాడు వివేక్. "మిమ్మల్ని ముట్టుకోవటం నా కిష్టంలేదు. దయచేసి అంతటి శ్రమ నా కివ్వకండి. మనం ఐరన్‌సేఫ్‌వున్న గదిలోకి వెళ్ళాలి!"

ఒక్కక్షణం ఆలోచించింది మాధవి. తలొంచుకుని ముందుకు అడుగులేసింది. ఆమె వెనుకే కదిలాడు విక్రాంత్.

వెనుదిరిగి చూళ్ళేదు మాధవి. నెమ్మదిగా మేడమెట్లు ఎక్కి బాల్కనీలోకి నడిచింది.

మేడ మీద రెండు గదులున్నాయ్. ముందు వైపు మెట్లకు ఎదురుగా నున్న గది మాధవి వుపయోగించుకుంటోంది. రెండవ గది జగన్నాధరావ్‌ది. ఆయన పడగ్గదిగా అది ఉపయోగపడుతోంది.

తన గదిలోకి వెళ్ళకుండా ప్రక్క గదిలోకిదారి తీసింది మాధవి. హాండిల్ నొక్కి డోర్ నెట్టింది.

మాధవి వెనుకే లోనికెళ్ళిన విక్రాంత్ తలుపుమూసాడు.

"కేకలు వెయ్యటానికో, గొడవ చెయ్యటానికో ప్రయత్నించకండి!"

జాగ్రత్తగా మాధవినే గమనిస్తూ విండోస్ కర్టెన్స్ వేసాడు. వెనుదిరిగి స్విచ్ బోర్డ్ దగ్గరగా వచ్చి ఓ స్విచ్ నొక్కాడు. లైట్ వెలగలేదు. సీలింగ్ ఫాన్ తిరగటం మొదలుపెట్టింది. ఆ స్విచ్ ఆఫ్ చేసి, దాని ప్రక్కనేవున్న మరొక స్విచ్ నొక్కాడు.

"చక్....చక్...." మంటూ రెండుసార్లు వెలుగుల్ని విరజిమ్మి, హఠాత్తుగా వెలిగింది ఫ్లోరోసెంట్ దీపం.

మాధవి శిలా విగ్రహంలా నిలబడుతుంది. ఎటువంటి పరిస్థితి ఎదురైనా తట్టుకోవటానికి సిద్ధపడిన తెగించిన మనిషిలా కన్పిస్తోందామె.

అటువంటి సమయాల్లో కంగారుపడి కేకలు వెయ్యటమో బయటి సహాయం కోసం గొడవ చెయ్యటమో మంచిపని కాదని ఎన్నో కథల్లో చదివి వున్నదామె. సమస్య ఎదురైన పుడు దాన్ని చాకచక్యంగా పరిష్కరించుకోవాలి. ఎలా? ఎలా??

"మిస్ మాధవీ! ఐరన్‌సేఫ్ తాళాలు కావాలి నాకు" నెమ్మదిగా చెప్పాడు విక్రాంత్.

తల అడ్డంగా వూపిందామె. "వాటిని ఇంట్లో వుంచి వెళ్ళరు డాడీ. తన వెంట క్లబ్బుకి తీసుకెళ్ళారు."

ఆ గదిలో హేంగర్స్‌కి వ్రేలాడుతున్న బట్టల్లో వెతికాడు విక్రాంత్. మంచంపైనున్న తలగడను ఎత్తి చూసాడు,

మరో రెండు నిమిషాలపాటు అక్కడ యిక్కడ వెతికి మాధవి నిజమే చెప్పిందని అర్థం చేసుకున్నాడు.

"మీ యింట్లో దొంగతనం చెయ్యటం కోసం నేను చాలా శ్రమపడ్డాను. మీ డాడీ అలాంటి పని చేస్తారని వూహించి వుంటే తగిన జాగ్రత్తలో వచ్చి వుండే వాడిని" మాటలు ఆపేసి మాధవి ముందుకొచ్చి నిలబడ్డాడు.

"మీరు మూర్ఖంగా ప్రవర్తించరని నాకు తెల్సు. మీ చెవుల్లోని దుద్దులు కావాలి నాకు. ఇంకా మీ రిస్ట్‌వాచీ, మీ గదిలో ఏదైనా పైకం వుంటే అది కూడా ఇవ్వండి. వెండి సామానులు, వేరే ఏమైనా వస్తువులు తీసుకెళ్ళటం నా కిష్టం లేదు."

రెండు క్షణాల పాటు విక్రాంత్ ముఖంలోకి సూటిగా చూసింది మాధవి. "నువ్వు కోరినవి ఇస్తాను. నా వెంటరా!" అని వెనుదిరిగింది.

# 3

మాధవి గదిలో ఒక వైపు గోడ వారగా నిలబడున్నాడు విక్రాంత్. అతని చూపులన్నీ మాధవి మీదే వున్నాయ్.

బల్ల సొరుగులో ఏమిటో వెతుకుతోంది మాధవి. అప్పటికే ఆమె దుద్దులు విక్రాంత్ స్వాధీన మయ్యాయ్.

"ఏమిటి మీరు వెతుకుతున్నది?" ఏదో అనుమానం రావటంతో హఠాత్తుగా ప్రశ్నించాడు విక్రాంత్.

బల్లసొరుగు మూసి, ఇటు తిరిగింది మాధవి. నెమ్మదిగా అడుగులేస్తూ ముందుకొచ్చింది. ఆమె రెండుచేతుల్లోనూ నోట్లు వున్నాయ్.

"వివేక్! ఇది ఐదొందల రూపాయలు. ఈ మధ్యనే విడుదలైన క్రొత్త ఐదురూపాయలు కావటంతో మా డాడీతో దెబ్బలాడి ఒక కట్ట తీసి దాచుకున్నాను....తీసుకో! ఇది డాడీ యిచ్చిన పాకెట్ మనీలో నేను ఆదా చేసిన మొత్తం! దాదాపు నాలుగొందల వరకు వుంది. ఇది కూడా తీసుకో!"

మాధవి అందించిన నోట్లు తీసుకొని పాంటు జేబుల్లో కుక్కుకున్నాడు విక్రాంత్.

"ఇదిగో రిస్టువాచీ....చాలకుంటే ఈ రింగ్ కూడా తీసుకెళ్లు!" వాచీతో బాటు కుడిచేతి వ్రేలికున్న వుంగరం కూడా తీసి ఇచ్చేసింది మాధవి.

మాధవి అమాయకురాలని అర్థమైపోయింది విక్రాంత్‌కి. కొందరు వయసుతో బాటు సమాన స్థాయిలో మానసికంగా ఎదగరని అతనికి తెల్సు.

"థాంక్యూ!" నవ్వాడు. చిన్న టాబ్లెట్ తీసి మాధవికిచ్చాడు. "అది మింగెయ్యండి:"

"ఏమిటిది?"

"మత్తుమందు. నేను సురక్షితంగా ఇక్కణ్ణుంచి బయట పడాలంటే మీరు ఆ మాత్ర మింగాలి. తప్పదు!"

పమిటతో కళ్లొత్తుకుంది మాధవి. "క్లబ్బుకి వెళ్ళి మా డాడీని కూడా బెదిరిస్తావా?" అమాయకంగా ప్రశ్నించింది.

తల అడ్డంగా ఆడించాడు విక్రాంత్.

"నేను వెళ్లాలి. టాబ్లెట్ మింగండి."

క్లబ్‌కెళ్ళివున్న తన తండ్రి సహాయం అందుతుందని ఆశపడటం లేదు మాధవి. తల వెనక్కు వంచి టాబ్లెట్ నోట్లో వేసుకుంది. విక్రాంత్ చూస్తుండగానే గుటకవేసింది.

"వెళ్ళి ఆ మంచమీద పడుకోండి. మీ కెటువంటి ప్రమాదమూ జరుగదు. కాసేపట్లో మత్తుమందు ప్రభావంతో మీకు నిద్ర వస్తుంది. దట్సాల్!" నెమ్మదిగా చెప్పాడు.

బుద్ధిగా వెళ్ళి అదే గదిలో నున్న కాట్ మీద వాలిపోయింది మాధవి. తనకు స్పృహ తప్పే వరకు అతను అక్కణ్ణుంచి కదలడని ఆమెకు అర్ధమైపోయింది.

రెండు నిమిషాలు భారంగా గడిచాయ్.

మాధవి కళ్ళు నెమ్మదిగా మూతలు పడటం ప్రారంభించాయ్. మత్తుమందు తన ప్రభావాన్ని చూపెడుతోందని అర్ధమైందామెకు. చటుక్కున కళ్ళు మూసుకుంది.

అరనిమిషం తర్వాత మంచం మీద అటు యిటు పొర్లుతూ ఏదో కలవరించటం ప్రారంభించింది.

మాధవి పలవరింతలు పూర్తయ్యే వరకు అదే గదిలో వున్నాడు విక్రాంత్. ఆమె నిద్రలోకి జారిపోయాక నింపాదిగా ఆ గదిలోంచి వచ్చేసాడు.

# 4

మద్రాస్ సెంట్రల్ స్టేషన్‌లోంచి బయలుదేరింది దాదర్ ఎక్స్‌ప్రెస్.

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో యిటు చివర నున్న కాబిన్‌లో వుంది మాధవి. ఆమె చేతుల్లో ఆ నెల "అపన" వుంది. తాపీగా అపన చదువుకుంటోందామె.

మెడలో వజ్రాలు నెట్ నెక్లెస్ ధగధగ మెరుస్తోంది. రవ్వల దుద్దులు అందంగా కాంతుల్ని వెదజల్లుతున్నాయ్, క్రితం రాత్రి జరిగిన సంఘటన గురించి ఎప్పుడో మర్చిపోయినట్టు కన్పిస్తోందామె.

అదే కంపార్ట్‌మెంట్‌లో మరొక కాబిన్‌లో ప్రయాణం చేస్తున్నాడు విక్రాంత్.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రేణిగుంటలో ఆగింది రైలు.

ఇహ ఓర్చుకోలేక పోయాడు విక్రాంత్.

రైలు ఆగిన ప్రతిసారీ ప్లాట్‌ఫారం మీదకు మాధవి దిగటం, విసుగ్గా ప్లాట్‌ఫాం మీద తిరిగి రైలు కదిలే వరకు ఆమె పచార్లు చెయ్యటం అతను గమనిస్తూనే వున్నాడు. ఆమె మెడలోని నెట్ నెక్లెస్ చూసిన ప్రతిసారీ అతని గుండెలు దడదడ లాడుతూనే వున్నాయ్.

మాధవి ఒంటరిగా ఫ్రెండ్ పెళ్ళికి బయలుదేరింది. అది తన అదృష్టం! అసలు ఆవిడ యిలా బయలుదేరుతుందని తనకు తెలిసేదే కాదు. తను ఇచ్చిన మత్తుమందు బిళ్ళమింగి, తను ఏం పలవరిస్తున్నదో తెలియని మైకంలో ఏదేదో వాగేసింది మాధవి.

పాతికవేలు ప్లస్ రవ్వల దుద్దులు ఓ మైగాడ్! చెప్పుకోదగ్గ మొత్తం!

కడపలో రైలు దిగేస్తుంది మాధవి. ఈ రైలు కడప చేరక మునుపే మాధవి ఒంటి మీదున్న నగలు తన ఆధీనం కావాలి.

మాధవి వున్న కాబిన్‌లో మరొక పురుగు లేదు. ఆవిడ ఏదైనా ప్లాన్ మీద వచ్చి వుంటే.... అంతటి తెలివి తేటలు ఆమెకు లేవు.

మద్రాస్‌లో రైలు ఎక్కినప్పటినుంచి ఆమెను తను గమనిస్తూనే వున్నాడు. ఆ కాబిన్‌లోకి ఎవరూ వెళ్ళలేదు.

రేణిగుంట స్టేషన్‌ను వదిలింది దాదర్ ఎక్స్‌ప్రెస్.

రైలు వేగం క్షణక్షణానికీ పెరుగుతోంది.

ఐదు నిమిషాల తర్వాత తన కాబిన్‌లోంచి బయటపడి, కారిడార్ వెంట ముందుకు నడిచాడు విక్రాంత్.

మాధవి కాబిన్ ముందే శబ్దమూ విన్పించలేదు.

కాబిన్ తలుపు తెరుచుకొని హఠాత్తుగా మాధవి ముందు ప్రత్యక్ష మయ్యాడు.

చేతిలోని "అపన" పుస్తకాన్ని మూసేసి ప్రక్కన పడేసింది మాధవి. ఆమె మాత్రమే వుంది ఆ కాబిన్‌లో.

"మిస్టర్! ఎవరు నువ్వు?" కోపంగా అరిచింది.

విక్రాంత్ ప్రస్తుతం సిక్కు వేషంలో వున్నాడు. పెట్టుడు గడ్డం, మీసాలు, తలపాగా తీసేసి విండో గుండా బయటకు విసిరాడు.

అదిరిపడింది మాధవి.

గుండెల్ని అదరగొట్టే చప్పుడుతో ముందుకు పరుగులు తీస్తూనే వుంది రైలు.

"వివేక్....నువ్వు....నువ్వు మళ్ళీ యిక్కడ కూడా ప్రత్యేక్షమయ్యావా?" మాధవి పమిటి తీసి మెడచుట్టూ కప్పుకోబోయింది.

"నో....నో!" జేబులోంచి రివాల్వర్ తీసాడు విక్రాంత్. "దయచేసి నెక్లెస్, దుద్దులు ఇవ్వండి!"

"నేను....నేను పెళ్ళికి వెళుతున్నాను. ఈ నగలు లేకుంటే...." నీళ్ళు నమిలింది.

"ఇట్సాల్‌రైట్. నెక్లెస్ ఇవ్వండి చాలు."

"అసలు ఈ రైల్లో నేను ప్రయాణం చేస్తున్నట్టు నీకెలా తెల్సింది?"

"నిన్న సాయంత్రం మీకు మత్తుమందు బిళ్ళ యిచ్చాను. గుర్తుందా? అది సేవించిన తర్వాత మీరే అన్ని విషయాలూ బయట పెట్టుకున్నారు. రైల్లో మీరు ప్రయాణిస్తున్నట్టు, పలవరించారు. దట్సాల్!" నవ్వాడు. "మీ వంటి అమాయకమైన ఆడపిల్లలు వున్నంత వరకు నా వంటి వారికి ఎటువంటి కొరతా వుండదు."

అందంగా నవ్వింది మాధవి.

"మై డియర్ బ్రూట్! ఆడపిల్లలు అందరూ పిల్లిపిల్లలు అయి వుండరు. కొందరైనా పులిపిల్లలు అయివుంటారు. నీ పాపం పండిపోయింది. అందుకే సరాసరి నేను పోలీసులతో కల్సి విసిరిన వలలోకి వచ్చి పడ్డావ్."

అదిరి పడ్డాడు విక్రాంత్. "వాడ్డుయు మీన్?"

"వాట్ ఐ మీన్ ఈజ్ ఎగ్జాక్ట్లీ దిస్. ఈ కాబిన్ బయట కారిడార్‌లో పోలీసులు వున్నారు. నువ్వు అనుకుంటే నన్ను చంపెయ్యగలవ్. ఆ తర్వాతనైనా పోలీసులకు పట్టుబడక తప్పదు. వివేకంగా యోచించి, మర్యాదగా లొంగిపో. లేకుంటే శిక్ష పెరుగుతుంది."

"అయితే మీ పలవరింతలు...."

"నిన్ను ట్రాప్‌లో ఇరికించటానికి ఆ విధంగా పలవరిం

చాను. అంతేకాదు, నిన్ను నమ్మించటానికి నగలు ధరించి ప్రయాణం కూడా చేస్తున్నాను. పాతిక వేలు చేసే డైమండ్ నెక్లెస్, రెండు వేలు ఖరీదు చేసే రవ్వల దుద్దులు వదులుకునేటంత మూర్ఖునివి కాదు నువ్వని యోచించాను.

సో, మై డియర్ స్వాయిన్! నీ అనుమానాలన్నీ తీరిపోయి వుంటే ఆయుధం క్రింద పడెయ్! డ్రాప్ ది వెపన్!" ఆఖరున ఆడపులిలా ఉరిమి చూసింది మాధవి.

బోల్టు తీసి కాబిన్ తలుపు తెరిచాడు విక్రాంత్. మాధవి బుకాయిస్తోందని అతను అనుమానించాడు.

విక్రాంత్ అనుమానం సరైనది కాదు. బయట కారిడార్‌లో నలుగురు పోలీసులు, ఒక యిన్‌స్పెక్టర్ కన్పించారు.

చటుక్కున కాబిన్ తలుపు మూసెయ్యబోయాడు విక్రాంత్ అప్పటికే ఆలస్యమైంది.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముందుకు దూకి, తలుపుకు మోకాలు అడ్డంపెట్టి, విక్రాంత్ డొక్కలో బలంగా పిడికిటితో పొడిచాడు.

అదే సమయంలో విక్రాంత్ కుడి చేతిని మాధవి పాదం ముద్దుపెట్టుకుంది. మెరుపు వేగంతో ఎగిరిపోయింది రివాల్వర్.

బూట్లు టకటక లాడించుకుంటూ లోనికొచ్చారు పోలీసులు.

తను మళ్ళీ జైలు ముఖం చూడక తప్పదని అర్థమైపోయింది విక్రాంత్‌కి. అంతేకాదు, డిటెక్టివ్ పత్రికల్ని మాధవి వంటి ఆడపిల్లలు చదవటం వలన తనవంటి వారికి ఎంత నష్టమో కూడా అతని కర్థమైపోయింది. ***

# మాయమైన షికారీ బృందం!

ఏ. వీ. మోహన్రావ్

"ఛీ! పాడు డొక్కు బస్సు!" విసుగెత్తి లోలోపలే తిట్టుకున్నాను.

పొద్దున్న పదింటికి బయలుదేరింది విశాఖపట్టణంలో. నాలుగు గంటలకల్లా కిరందుల్ చేరవలసింది. కానీ ఏం ప్రయోజనం? మధ్యలో ఉన్నట్టుండి ఊపిరిపోయిన మనిషిలా ముందు టైరు ఒకటి పంచరై గాలి కాస్తాపోయింది.

స్పేర్ టైర్లు లేకపోవడంతో కండక్టర్ తిరుగు బస్‌లో వెళ్ళి విశాఖపట్టణంలో ట్యూబుకు పంచరు వేయించుకొని, టైరు తీసుకొని రెండింటికి వచ్చాడు.

బస్సు బయలుదేరేసరికి అందవూ, వాళ్ళతోపాటు నేను "అమ్మయ్య" అనుకున్నాం.

చుట్టూ కనుపిస్తున్న అందమైన చెట్లనూ, సుందరమైన తూర్పు కనుమల్లోని కొండల్నీ చూస్తూ మైమరచిపోయాను.

నేను వెళ్తున్నది భోగపురానికి. అది కొకులు దూరని కారడవి మధ్య వుంది. కిరందుల్ కివతల దిగి, అక్కడ నుంచి అడవిలో నాలుగు మైళ్ళు నడచివెళ్ళాలి. నా ప్రియురాలు రాణి తండ్రితో అక్కడికొచ్చి వుంది 'షికారీ' కోసం. నన్నూ రమ్మని రాసింది. ఆమె తండ్రి మంచి షికారీ. అలాంటి వాతావరణంలోనైతే మన ప్రేమ గురించి చెప్పి, పెళ్ళికి ఒప్పించడం వీలవుతుందని కూడా రాసింది.

రాణిని చూసి అప్పుడే రెండు మాసాలయింది. నాకవి రెండు యుగాల్లాగున్నాయి. ఆమె రమ్మని రాశాక ఆగ దలచుకోలేదు. అందుకే వెంటనే బయలుదేరాను. మధ్యలో ఈ అవాంతరం.

బస్సు మరో రెండు గంటలు ప్రయాణం చేసింది.

డొక్కు సరుకు కావడంతో రెండెడ్ల బండికన్నా కాస్త వేగంగా, గుర్రపుబగ్గీకన్నా కొంత నిదానంగా పోసాగింది.

"భోగపురం!" అరిచాడు కండక్టరు.

గబగబ సంచీ తీసుకుని దిగాను. నాతోపాటు మరెవరన్నా దిగుతారేమోనని చూశాను. ఎవ్వరూ కదలలేదు. బస్సు దుమ్ము లేపుకుంటూ వెళ్ళిపోయింది.

వాచీ చూసుకున్నాను. అయిదుగంటలా పది నిముషాలయింది. పరిసరాలు సర్వేచేశాను. బాబ్ చేసిన జుట్టులో తీసిన పాపిడిలాగుంది అడవి మధ్యనుండి కనుపించిన కాలిబాట. నాకోసం ఎవరూ రాలేదు.

అప్పుడే చిన్నగా మసకచీకట్లు కమ్ముకుంటున్నాయి.

నాలుగు మైళ్ళు నడిచేందుకు గంటన్నర మించి పట్టక పోవచ్చుననుకున్నాను.

సంచీ భుజాన వేసుకుని బయలుదేరాను.

ఒక మైలు నడిచాను. అడవిలో చీకటి దట్టంగా అలుము కుని చుట్టుముట్టేసింది. నా దగ్గిర బ్యాటరీలైటు కూడా లేదు. ముందున్న దారి సరిగ్గా కనిపించలేదు. తడుముకుంటూ మరికొంతదూరం నడిచాను.

ఉన్నట్టుండి బాటలోంచి కుడివేపుకు చీలిక కనిపించింది.

సందిగ్ధంలో పడ్డాను. ఎటు పోతే భోగపురం వస్తుందో అర్థంగాలేదు. గమ్యం చేరడానికి బదులు తప్పుదోవన వెళ్ళి అగమ్యగోచరమైన అడవిమధ్యకు చేరి క్రూరమృగాల వాతనబడి వాటికి బలైపోయే ప్రమాదముంటుందేమోనను కున్నాను.

రాణిపైని ప్రేమ మాయమై కోపం పుట్టుకొచ్చింది. అసలు నన్ను రమ్మన్న మనిషి బస్ దిగేదగ్గిర ఎంతసేపైనా వెయిట్ చెయ్యాల్సిన బాధ్యత వుంది.

ప్రేమలో పడ్డవాడు గ్రుడ్డివాడితో సమానం అన్నారు ఇందుకేనేమో అనుకున్నాను.

భగవంతుణ్ణి తలుచుకుని కుడివేపు నడకసాగించాను. బాట బాగానే వుంది. ముళ్ళతుప్పలు, తీగపొదలు అప్పు డప్పుడు కాళ్ళకు అడ్డంపడ్డాయి. వాటిని తప్పుకొని నడిచాను.

అలా ఎంతసేపు నడిచానో చూసుకోలేదు. కాళ్ళు పీక్కు పోవడం మొదలైంది. కూలబడ్డాను త్రోవలోనే. సంచీ తీసి సిగరెట్ వెలిగించుకొన్నాను.

నిశ్శబ్దాన్ని బ్రద్దలుచేస్తూ వీస్తున్న గాలీ, అది చెట్ల ఆకుల్లోంచి వేగంగా పోయేటప్పుడు వస్తున్న ధ్వని. అరణ్య రోదనం అంటే ఏమిటో అర్థమయ్యేలా చేసింది. ధైర్యం అనేది ఎప్పుడో మటుమాయమైంది. గుండెనిండా భయం

పేరుకొనిపోయింది.

వాచీ చూశాను. ఎనిమిదిన్నరయింది.

నేను నడిచిన వేగంతో ఈపాటికి కనీసం ఏ ఆరేడు మైళ్ళు నడిచివుంటాను. అంటే భోగపురం దారి ఇది కాదు. దాన్నుంచి మరో కోణంలో ఇంతసేపు దూరంగా వెళ్ళి పోవడమే నేను చేసిన ఘనకార్యం.

ఏం చెయ్యాలాని ఆలోచించాను. వెనక్కి వెళ్ళి, మళ్ళీ జంక్షనునుంచి రెండోవైపు వెళ్దామా అనుకున్నాను. అలా చెయ్యాలంటే ఇంకా మూడు గంటలు నడవాలి. అప్పటికి అర్ధరాత్రి అవుతుంది. అక్కడనుంచి తిరిగి నడచి భోగపురం చేరగలనో లేదో నమ్మకం చిక్కలేదు.

అంతకన్నా ఇంకొంత ముందుకు నడిస్తే మరేదైనా ఊరు చేరుకోగలనేమోనన్న ఆశ కలిగింది. అది భోగపురం కాకున్నా, ఇంకేదైనా ఊరు కావచ్చు. నా పరిస్థితి చెప్పుకొని, ఈ రాత్రికి తలదాచుకుని, తెల్లవారాక ఎవరి సాయంతో నన్నా భోగపురం చేరవచ్చుననిపించింది.

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి విసిరిపారేశాను.

ఆలోగా ఆకాశంలో చంద్రుడు పైకి లేచాడు. వెన్నెల అడవిని వెలిగించింది. చల్లని, నున్నని కాంతిలో ఆ చెట్లనూ, గుట్టలనూ చూస్తుంటే మనోహరంగా కనుపించింది క్షణకాలం. నా స్థితి గుర్తుకు రాగానే భయం మళ్ళీ దాని స్థానంలో వచ్చి తిష్ఠవేసింది.

మెల్లిగా లేచి కాలు సాగించాను.

వేగం హెచ్చించి నడవడం మొదలెట్టాను. వెన్నెల స్ఫటకపురజనులా భూమిపైకి పరచుకుంటూంది, బాటపైన పెద్ద పెద్ద కాలి గుర్రులు కనిపించాయి. అవి మనిషి అడుగు

జాడలకన్నా ప్రమాణంలో రెట్టింపు వున్నాయి.

ఆఫ్రికా ఎలుగుబంట్లను గురించి నేను చదివిన విషయాలూ, వివరాలు బుర్రలో మెదిలాయి. ఆ ఎలుగులు అతి భయంకరమైనవి. మనిషినికానీ, జంతువునుకానీ, అరగంటలో, ఆవకాయ ముక్కల్లా కొరుక్కుని తినగలవు. వాటి కళ్ళు మనుషుల పాదాలలాగానే వుంటాయి. లేకుంటే బాగా పెద్దవి.

అంటే నా ముందు కనిపిస్తున్న అడుగుల గుర్తులు ఆఫ్రికా ఎలుగుబంటువయి వుండాలని తీర్మానించుకున్నాను. ఈ అడవుల్లో అవి వున్నాయని కూడ విన్నాను.

ఇంకొంతదూరం నడిచాను.

బాట కడ్డుగా ఏదో చెట్టు మొదలుపడివున్నట్లు దూరం నుంచి గమనించాను. కాస్త వేగం తగ్గించి నడవసాగాను. అదేదో క్రూరమృగమయితే నాకు భూమిపైన నూకలు నిముషంలో చెల్లిపోయే ప్రమాదముందన్న భయంతో బాగా దగ్గరకంటూ వెళ్ళాను.

అది మనిషి ఆకారం.శవరూపంలో వుంది. అస్థిపంజరం తప్ప మరోటి లేదు. ఎముకల మధ్యనున్న కండలు, రక్తం, ఆ జంతువేదో తినేసి మిగిలిన కట్టె పారేసి వెళ్ళింది.

ముచ్చెమటలు పోసి, బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. శరీరం చల్లబడి పోయింది. కాళ్ళకు నడిచే జ్ఞానం నశించి పోయింది. అవాక్కయి నిలబడిపోయాను కొన్ని నిముషాలు. అంతలోనే చైతన్యం కలిగింది.

జాగ్రత్తగా పరిసరాలు గమనిస్తూ ముందుకు నడిచాను. బాటకు ఎడమప్రక్కన దూరంగా కొండలాంటిది కని

పించింది. అడవికి అడ్డం పడ్డాను. కొండలా వున్న ఎత్తైన ప్రాంతంపైకి ఎక్కి వెళ్ళాను.

చలిగాలి రివ్వుమని వీచసాగింది. పైనుంచి చూశాను. కొండకు రెండో ప్రక్కన క్రింది భాగంలో చెట్ల గుబురులు వున్న చిన్న మైదానంలో ఇల్లులాంటిది కనుపించింది.

అక్కడెవరయినా మనిషి తోడు దొరకవచ్చునన్న ఆశ పొడచూపింది. వేగంగా అటువైపు దిగి వెళ్ళాను.

ఆ గుడిసెలాంటి ఇంటికి దూరంగా నిలుచుని చూశాను. అది కొయ్యలతో కట్టబడి వుంది. పై భాగాన ఆకులు పరచి వున్నాయి. మెల్లగా దగ్గరకు వెళ్లాను. తలుపు వేసివుంది. బయట గొళ్ళెంలాటిదేమయినా వుందేమోనని చూశాను. అలాంటిదేదీ కనుపించలేదు.

లోప లెవరన్నా వున్నారేమో నన్న అనుమానం కలిగింది.

పిడికిలితో గుమ్మంపైన తట్టాను.

ఎవ్వరూ పలకలేదు. మళ్ళీ తట్టి "ఏమండీ! ఏమండీ!" అని పిలిచాను.

దానిక్కూడా జవాబులేదు.

తలుపు గట్టిగా నెట్టాను. లోపల చీకటి తప్ప మరేమీ లేదు. లోనికి వెళ్ళాను. మళ్ళీ "ఏమండీ! ఏమండీ!!" అంటూ చిన్నగా పిలిచాను.

జేబులోంచి అగ్గిపెట్టితీసి వెలిగించాను. ఆ వెలుతురులో నాకు ఒకమూల కొన్ని తుపాకీలు, ఇంకోమూల మందు గుండు సామాను పెట్టుకొనే ఇనుప బాక్సులు. గదిమధ్యగా, చలిమంట వేసుకునేందుకు వీలుగా చిన్న చతురస్రాకారపు పొయ్యి కనుపించాయి. కుడివేపు గోడలాగున్న కొయ్య

చ(్రటంలో ఒక చిన్న కిటికీ వుంది. ఆ గదినిండా ఎముకలు. పు(్రెలు చెల్లాచెదురుగా పడివున్నాయి. ఒక్క_క్షణం నా గుండె కొట్టుకోవటం మానేసింది.

అగ్గిపుల్ల ఆరిపోయింది. లోపలంతా మళ్ళీ చీకటి నిండి పోయింది. ఆలోచించాను. ఈ రాత్రికి అడవిలో అడ్డదిడ్డంగా తిరిగి ఏ క్రూరమృగం వాతనోపడి చావడంకన్నా, లోపలే కూర్చుని ఏదోవిధంగా ప్రాణాలు కాపాడుకోవడం మెరుగని పించింది.

ఇంకో అగ్గిపుల్ల వెలిగించి, ఆ వెలుగులోకెళ్ళి తలుపు మూసి, దానికున్న తోలుపటకాతో గుమ్మానికి బిగించాను, వెలుపలనుంచి ఎవ్వరూ తెరిచేందుకు వీలులేకుండా.

గదిమధ్యగా శుభ్రంచేసి పడుకున్నాను. కాళ్ళు పీకు తున్నాయి. వాట్ని ముడుస్తూ, సాగదీస్తూ కొంతసేపు వ్యాయామం చేశాను. మనసులో గుబులుగా వుంది.

వెలుపల వాతావరణం బాగా చల్లబడిపోయింది. కిటికీ లోంచి రివ్వుమని చల్లగాలి లోనికి వచ్చింది. కప్పు కొనేందు కేదయినా రగ్గులాంటిది దొరుకుతుందాని చూశాను. ఏదీ కనుపించలేదు.

అసలు ఇన్ని తుపాకీలు, మందుగుండ్లు మొదలయినవి పెట్టుకున్న మనిషి ఏమయిపోయి వుంటాడు? అసలతను ఎవరు? అన్న ప్రశ్నలు మొదటిసారిగా నా మెదడులో కదిలాయి.

ఆఫ్రికన్ ఎలుగుబంట్లను చంపి చర్మంతీసి, అమ్మితే దానికి అమెరికాలో మంచి ఖరీదు పలుకుతుంది. వాట్ని వేటాడేందుకు గవర్నమెంటు దగ్గర పర్మిషన్ తీసుకుని వెళ్ళిన ఐదుగురు షికారీల బృందం అయిపులేకుండా

పోవడం, ప్రభుత్వం వారికోసం అన్వేషణ సాగించడం, పేపర్లలో ప్రాముఖ్యంగా ప్రచురించారు కొన్నిదినాల క్రితం. అదంతా గుర్తొచ్చింది నాకు.

ఆ బృందం తాలూక నివాసమేమో నేనున్నదనుకున్నాను. అందువల్లే అన్ని తుపాకులు, మందుగుండు సామాగ్రి ఇక్కడున్నాయనిపించింది. అయితే వాళ్ళేమయినట్లు అక్కడ ఎముకలు, మనుషుల పుర్రెలు చూసి వాళ్ళు ఆ ఎలుగుబంట్లకు బలియిపోయి వుండాలని తీర్మానించు కున్నాను. తెల్లారాక వెళ్ళేముందు ఆ తుపాకులు తీసుకె ళ్తే వాట్నిబట్టయినా ప్రభుత్వానికి కొంత సమాచారం తెలిసినట్ల వుతుందని ఊహించాను.

గాలి ఎక్కువయింది. చలి నా ఎముకల్ని కొరకడం మొదలెట్టింది.

ఉన్నట్టుండి తలుపు "దబదబ" తట్టిన శబ్దమయింది.

భయం పుట్టింది. అదేదైనా క్రూరమృగమై వుంటుం దేమోనని అనుమానపడ్డాను.

ఉలుకూ పలుకూ లేకుండా రాయిలా కూర్చున్నాను.

మళ్ళీ శబ్దం వినిపించింది.

మూలనున్న తుపాకీ ఒకటి తీసుకుని, తలుపు దగ్గరగా నుంచుని "ఎవరు?" అని అడిగాను.

నా గొంతు ప్రతిధ్వని తిరిగి నాకే వినిపించింది.

సమాధానం రాలేదు.

కానీ తలుపు తట్టిన చప్పుడు మాత్రం వినిపించింది.

కొయ్యతలుపు పైన చేత్తో కొట్టిన శబ్దం మాత్రం విన్నాను. ఆ తడుతున్నది మనిషా లేక, జంతువా అన్నది మాత్రం నా కర్థంకాలేదు. ధైర్యంచేసి తలుపు తీద్దామని

అనుకున్నాను. అంత సాహసం చేసేందుకు శక్తి చాల లేదు.

చెవులు రిక్కించి వింటున్నాను. దబదబ ఎడతెరిపి లేకుండా తలుపులు బాదుతూనే వున్నారు.

"అడిగితే చెప్పకుండా అలా తలుపు తడతారెందుకు? ఇది అడవి! మనిషో, జంతువో తెలీకుండా తలుపు తెరవడ మెలా?" అడిగాను కోపంగా.

నా ప్రశ్నకు సమాధానం రాలేదు! తలుపు తట్టిన శబ్దం ఆగలేదు.

ఈ మారు నాలో భయానికి బదులు కోపం రేగింది. తుపాకీ తీసుకునివెళ్ళి తలుపుకు ఆనించి,ట్రిగ్గర్ నొక్కాను. ఐదారు గుండ్లు అమాంతం కొయ్యను చీల్చుకుని రంధ్రం చేసుకుంటూ వెలుపలకు వెళ్ళిపోయాయి.

తలుపులు తట్టిన శబ్దం ఆగిపోయింది.

ఏదో దబ్బున క్రిందపడ్డ శబ్దమయింది. ఆలస్యం చెయ్య కుండా తుపాకీ ఎడంచేతిలోకి మార్చుకుని, ఠక్కున తలుపు తీశాను. ఎదురుగా ఎవరూ కనుపించలేదు. నేలపైన వొంగి చూశాను. ఏ ఆకారమూ కనుపించలేదు. అంటే నా తుపాకీ గుండ్లు ఎవరికీ తగలలేదనుకున్నాను.

వెలుపలకు వచ్చి ఎదురుగా చూశాను. యాభై గజాల దూరంలో కొండలాంటి ఎత్తైన ప్రాంతం వుంది. తలుపు తట్టినమనిషి అక్కడెక్కడయినా దాక్కున్నాడేమోనని మెల్లిగా అటుకేసి వెళ్ళాను. ఆ ప్రాంతమంతటా కలియ తిరిగాను. ఎవ్వరూ కనుపించలేదు.

నా కంతా వింతగా విచిత్రంగా వుంది. ఏదైనా దయ్యం

ఇలా నన్ను లోపల పడుకోనీకుండా తంటాలుపెడుతుం దేమోనని అనుమానించాను. ఆ అనుమానం నాలో బల పడింది. వెనక్కి తిరిగి ఆ గుడిసెలోకొచ్చి తలుపులు మూసుకున్నాను. ఏ శబ్దమయినా తెల్లవారిందాకా తలుపులు తెరవకూడదని నిర్ణయించుకున్నాను. తెల్లారేవరకూ ఆ గుడిసెలోనే శవ జాగరణ చేశాను.

కిటికీగుండా తెల్లని వెలుగు లోనికి ప్రవహించింది. మెల్లిగా లేచి తలుపులు తెరచుకొని వెలుపలకు వెళ్లాను. వాతావరణం ప్రశాంతంగా వుంది.

నేను మళ్ళీ చిన్న గుట్టలావున్న ప్రాంతంవేపు వెళ్లాను. అక్కడ గుబురుగా వున్న చెట్లసందునో ఆకారం నా కళ్ళకు కనుపించింది. దగ్గరకంటూ వెళ్ళి చూశాను. అది ఆఫ్రికా ఎలుగుబంటి. సందేహంలేదు.

శరీరం బోరగింతలా పడివుంది. వీపుపైన ఐదారు రంధ్రాలు కనుపించాయి. వాటినిచుట్టూ ఎండిపోయిన రక్తం వుంది. ఆ ఎలుగుబంటి చనిపోయినాకగూడ భయంకరం గానే కనిపిస్తోంది. రాత్రి నేను కాల్చినగుళ్ళు దాని శరీరంలో దూరినందువల్లే అది చనిపోయిందని వూహించాను.

ఒకవేళ రాత్రి నేను కాల్చకుండా, తలుపు తీసివుంటే? ఇక వూహించలేక పోయాను. నిస్సందేహంగా ఆ షికారీ బృందానికి పట్టిన గతే నాకూ పట్టివుండేది.

నాకు ఇంకా ఆ ప్రాంతాల వుండాలనిపించలేదు.

సూర్యుడు నెమ్మదిగా ఆకాశంలోకి ఎగబ్రాకుతున్నాడు. నేను ఆ అడవిలో ఎటు వెళ్ళాలో పరిశీలించటానికి కొండ ఎక్కసాగాను.

***

# చస్తే ఏం?

సుజనశ్రీ

నైరాశ్యం నిండుకున్న కళ్ళతో క్రిందకు చూశాడు.

సుందరం.

రోడ్డుమీద జనం జాస్తి అవుతున్నారు అంతకంతకు. తలలు వెనక్కు విరుచుకుని మరీ పైకి చూస్తున్నారు. రోడ్డు పట్టనంతటి జనం చేరారు అప్పటికే.

ఆదరాబాదరాగా ముక్కుకు సూటిగా వెళ్ళే మనుష్యులు గూడ ఈ జనాన్ని చూసి అక్కడే ఆగి, వాళ్ళకు మల్లేనే తలలు పైకెత్తి చూస్తూ నిలబడిపోతున్నారు.

రోడ్డుకి అటూ ఇటూ ట్రాఫిక్‌ని మళ్ళించలేక పోలీసులు సతమతమవుతున్నారు. జనం ఆతృతతో, సానుభూతితో పైకి చూస్తున్నారు.

వాళ్ళు వెలిబుచ్చే ఆశ్చర్యానికీ, ఆతృతకూ, నోరు తెరుచుకుని అలాగే చూస్తూన్న వాళ్ళ చూపులకు సుందరం ఏమాత్రం చలించలేదు.

హోటల్ మమతాలో ఏడవ అంతస్థు కిటికీలోంచి ఆరో అంతస్తులోని గది కిటికీ మీదున్న సన్‌షేడ్ మీదకు దూకాడు సుందరం. అక్కడే కొద్దిక్షణాలు వేచి ఉన్నాడు.

రూమ్‌బాయ్ ఒకడు కిటికీలోంచి తొంగి చూశాడు.

"ఏయ్! ఏం పని అది? అక్కణ్నుంచి పడితే ఇంకేమన్నా ఉందా?" అని హెచ్చరించాడు సుందరాన్ని.

"నా సంగతి నీకెందుకు! వెళ్ళి నీ ఏడుపేదో నువ్వు ఏడ్చుకో!" సుందరం అతడి మాటల్ని లక్ష్యపెట్టలేదు.

రూమ్‌బాయ్ మాయమయాడు. రెండు నిముషాలు గూడా గడవకముందే హోటల్ అసిస్టెంట్ మేనేజర్ కిటికీలోంచి తల బయటకుపెట్టి సుందరంవంక చూశాడు.

"చూడండి! మా వల్ల ఏదైనా పొరబాటు జరిగితే నిరసన తెలుపవలసిన తీరు ఇదికాదు సార్!" తన పాండిత్యాన్నంతా ఒలకబోసి సుందరాన్ని అనునయించబోయాడు.

అతడ్ని విదిలించి కొట్టాడు సుందరం.

మళ్ళీ కాస్సేపట్లోనే మేనేజర్ ప్రత్యక్షమయాడు.

లావుగా, కందగడ్డలాగున్న ముఖం, బట్టతల వ్యక్తి కిటికీ కర్టెన్‌ని తొలగించుకుంటూ బయటకు చూశాడు.

"ఏయ్ మిస్టర్! ఏం చేస్తున్నావక్కడ?" తన అధికార దర్పాన్ని చూపబోయాడు.

"కనపట్టంలా? ఇక్కడ్నుంచి రోడ్డుమీదకు దూకబోతున్నాను."

"అంటే ఆత్మహత్య చేసుకోబోతున్నావా? నీ వెవరు? నీ పేరేమిటి? కోరి చావు తెచ్చుకునే ఖర్మ ఏమొచ్చింది నీకు?"

"నా పేరు సుందరం! మీ లాడ్జి రిజిష్టర్‌లో వ్రాశానే?

ఇక చావు కారణం అంటావా? అది నీకు సంబంధించింది కాదులే!"

"పోన్లే! కానీ నీవు చేయబోతున్నది ఎంత దారుణమో మరోసారి ఆలోచించుకో!"

"నన్ను ఆట్టే విసిగించక ముందు ఇక్కడ్నుంచి వెళ్ళిపో! లేదా ఈ క్షణాన్నే క్రిందకు దూకేస్తాను" సుందరం బెదిరింపుకు హోటల్ మేనేజర్ చరచర అక్కడ్నుంచి వెంటనే వెళ్ళిపోయాడు.

సుందరం నిల్చున్న చోటుకు నాలుగడుగుల దూరంలో అటూ ఇటూ కిటికీలున్నాయ్. కాని వాటిల్లోంచి ఎవరూ తనను అందుకోలేరు. అతడు నిల్చున్న సన్ షేడ్ చాలా ఇరుకుగా ఉంది. అడుగున్నర వెడల్పూ, రెండడుగుల పొడవూ ఉంది. అందుకే అతడు బల్లిలా గోడకానుకుని నిలబడ్డాడు.

అతడి తెల్లచొక్కా ఎండవేడికి, చెమటపట్టి తడిసి పోయింది. గాలి ఆడటానికి చొక్కాకి పై బటన్స్ ఊడ దీశాడు. జుట్టు రేగిపోయి, మరీ భయంకరంగా కనుపిస్తు న్నాడు అతడు. అతడి వాలకం ముమ్మూర్తులా ఆత్మహత్యకు సిద్ధపడేవాడిలానే ఉంది. జనం అతనిని వింతగా చూస్తు న్నారు.

ప్రక్కనున్న కిటికీల్లోంచి రకరకాల మనుష్యుల తలలు అప్పుడప్పుడు బయటికి వస్తున్నాయ్. వారిలో కొందరు సుందరాన్ని బ్రతిమాలుతున్నారు. నిండు జీవితాన్ని బలి పెట్టుకోవద్దని. మరికొందరు కోప్పడ్డారు. "నీవు ఛస్తే చావు. ఈ హోటలుకు అప్రతిష్ట తేకు" అంటూ.

అలా ఒకరి తర్వాత ఒకరు కిటికీల్లోంచి తొంగి చూస్తూ

అతడి ప్రయత్నాన్ని విరమింపజేయాలని చూస్తున్నారు.

ఒక వేదాంతిగూడ అతడ్ని వారించటానికి యత్నించాడు.

"నాయనా! ఆత్మహత్య మహా పాపం! నీ కంత ఖర్మం ఏమొచ్చింది? నీ ఇబ్బంది ఏమిటో చెప్పు. ఇక్కడ ఇందరం ఉన్నాం! మేమంతా కలసి నీ బాధ తీర్చటానికి సాయం చేస్తాం!" అన్నాడు వేదాంతి.

"నీ సాయం నా కక్కరలేదు. నన్ను విసిగించకుండా వెళ్ళు అవతలకు!" సుందరం కసురుకున్నాడు.

"పోనీ నేను అక్కడకు వచ్చి, నీకు చేయూతనిచ్చి, పైకి తీసుకురానా?"

"మీరెవరన్నా కిటికీలోకి ఎక్కారో, మరుక్షణంలోనే నేను అమాంతం క్రిందకు దూకేస్తాను తెలుసా?"

"అలాగంటే ఎలాగ? నీ సమస్య ఏమిటో అదైనా తెలుపు మాకు!"

"ముందు నీవు అవతలకు ఫో!"

వేదాంతి తలను కిటికీలోంచి వెనక్కు తీసుకున్నాడు. కొద్దిక్షణాలు ఎవరూ రాలేదు ఆ కిటికీలోకి.

ఆ తర్వాత అదే కిటికీలోంచి ఎర్రబుట్ట తొంగిచూచింది.

"ఏయ్! ఆత్మహత్య పెద్ద నేరం? తెలుసా?" కానిస్టేబుల్ గదమాయించాడు.

"అయితే ఏం చేయమంటావ్?" వెటకారంగా అడిగాడు సుందరం.

"హోటలు మేనేజర్ నన్ను పిలిపించాడు. ఎవరో మతి చలించిన యువకుడు ఆత్మహత్యకు యత్నిస్తున్నాడని రిపోర్టు చేశాడు. వాళ్ళందర్నీ ఆట పట్టించాలనా నీవు ఈ

పని చేస్తున్నది?"

"లేదు నిజంగానే చావబోతున్నాను."

"దేనికో!"

"అందరి దృష్టి ఆకట్టుకోవాలని! నా ఫోటో పేపర్లో పడాలని!"

"మంచి జోక్ వేశావులే! సిగరెట్ ఏమైనా కావాలా?" అంటూ కానిస్టేబుల్ సిగరెట్ ప్యాకెట్ లోంచి సిగరెట్ తీసి ఆఫర్ చేయబోయాడు.

"చచ్చేవాడికి నాకు సిగరెట్టు ఎందుకులే? అన్నట్టు నీకు పెళ్ళయిందా?" సుందరం అడిగాడు.

"అయింది. భార్య ఉంది. పిల్లలు లేరు!" కానిస్టేబుల్ బదులు పలికాడు.

"నాకు ఏదీ లేదు!"

"అందుకని చావటం ఎందుకు? కో అంటే కోటిమంది ఆడపిల్లలు!"

సుందరానికి తన భార్య గుర్తుకు వచ్చింది. అతడికి వివాహమై మూడునెలలుగూడా కాలేదు. పెళ్ళయిన మరుసటి నెలలోనే శోభనం ఏర్పాటయింది. ఎన్నో ఆశలతో, మధుర భావాలతో గదిలోకి అడుగుబెట్టాడు సుందరం. భార్య అందాన్ని ఆరాధిస్తూ ఆమెను చేరబోయాడు.

భార్య శరీరం అతడికి చల్లగా తగిలింది. ఆమె ప్రక్కలో ఉత్తరం దొరికింది.

వివాహానికి పూర్వమే ఆమె మరొక వ్యక్తికి తన హృదయాన్ని ఇచ్చి పుచ్చుకుంది. అతడ్ని పూర్తిగా విశ్వ సించి, తన సర్వస్వాన్ని అతడికి అర్పించింది. తీరా అతడు తన మోజు తీరంగానే, ఆమెకు ముఖం చూపకుండా

దాటుకున్నాడు. తల్లిదండ్రుల ఒత్తిడికి లొంగి, ఆమె సుందరాన్ని పెళ్ళాడింది.

అపవిత్రమైన తన శరీరాన్ని మేలి ముసుగులో గోప్యంగా ఉంచి, తనింకా కన్యననే బొంకి, తాళిగట్టిన భర్తకైనా సరే, తననుతాను అర్పించుకోటానికి ఆమె అంతరాత్మ అంగీకరించలేదనీ, అందుకే తాను విషం పుచ్చుకుని చనిపోతున్నట్టుగా రాసింది. అతడి సుఖాన్ని పాడుచేస్తున్నందుకు క్షమించమని వేడుకుంది, ఆమె ఆ ఉత్తరంలో.

సుందరానికి మతిపోయినట్టయింది.

ఉద్యోగం వదిలేపి పిచ్చిగా ఊళ్ళు తిరిగాడు. రెండు నెలలు గడిచేసరికి ఇక తను జీవించలేననే నిర్ణయానికి వచ్చాడు. జీవచ్ఛవలాంటి బ్రతుకు నిరర్థకమని తేల్చుకున్నాడు.

పిటీ అంతా గాలించి ఏ హోటల్‌లో ఎక్కువ అంతస్థులున్నాయో తెలుసుకున్నాడు. హోటల్ మమతాలో ఏడంతస్తులున్నయ్. ఏడో అంతస్తులో ఒక రూమ్ తీసుకున్నాడు.

సుందరం మళ్ళీ క్రిందకు చూశాడు. కొత్తగా రిలీజయిన పిక్చర్ ఆడే సినిమా హాలు ముందు ఎంతమంది జనం ఉంటారో, ఇక్కడా ఇప్పుడు అంతమంది పోగయారు.

రోడ్డుమీద పోలీసులు జనాన్ని వెనక్కు నెట్టివేశారు, అతడు దూకే ప్రాంతంలోంచి.

"మిస్టర్! నీ మనసుకు విశ్రాంతి అవసరం! పైకిరా! నా హాస్పిటల్‌లో నీకు మంచి వైద్యం చేస్తాను," ఎవరో డాక్టర్ కాబోలు అతడ్ని కాపాడాలని తాపత్రయపడ్డాడు.

"పిచ్చాసుపత్రి డాక్టర్‌వా నీవు?" సుందరం ఫక్కున నవ్వేశాడు.

"నీలాంటి వాళ్ళు పదిమంది ఉంటే, నేను పిచ్చాసుపత్రే ఓపెన్ చేయాల్సి ఉంటుంది!" డాక్టర్ నవ్వాడు అదోలా.

"లాభంలేదు! అంతా మించిపోయింది. మీ సహాయం కక్కర్లేదు."

"నీవు క్రిందపడేదాకా వ్యవధి ఉంది. మరేం మించి పోలేదు. క్రిందకు దూకటానికి యత్నించే లోపల, ఇంకో సారి ఆలోచించుకో!"

"నాతో ఇలా టైమ్ వేస్ట్ చేసేకన్న, ప్రాణాపాయంలో ఉన్న ఏ రోగినైనా బ్రతికించుకో వెళ్ళు. వెళ్ళు!" కసురు కున్నాడు.

సుందరం మాటలకు డాక్టర్ నిజంగానే విసుగెత్తినట్టు న్నాడు, అతడూ వెళ్ళిపోయాడు.

ఆ గదిలో ఇంకా చాలామంది ఉన్నారు. గలభాగా ఏదేదో చర్చిస్తున్నారు. ఏవేవో రాసుకుంటూ, ప్లాన్‌లు గీస్తూ, పథకాలు వేస్తున్నారు. అతడ్ని ఎలా లాలించాలా, ఏవిధంగా అతడిలో జీవితేచ్ఛను రేకెత్తించాలా అని వాళ్ళు బుర్ర బద్దలుకొంటున్నారు.

మరికొందరు అదే పనిగా ఎక్కడెక్కడికో ఫోన్‌లు చేస్తున్నారు.

సుందరం క్రిందకు చూశాడు మళ్ళీ.

అక్కడున్న జనం తను ఎప్పుడు దూకుతాడా అని కనిపెట్టుక్కూర్చున్నారు. వాళ్ళ నిరీక్షణకు తగిన ఫలితాన్ని కొద్దిలోనే చూడబోతారుగదా అని తనలో తానే నవ్వు కున్నాడు సుందరం. జనంలో కొందరయితే, తనను అప్పుడే చనిపోయినవాడి క్రింద జమకట్టేస్తున్నారు.

ఈసారి కిటికీలోకి హోటలు ప్రొప్రయిటర్ రణధీర్

వచ్చాడు. అతడూ యువకుడే. తండ్రి తదనంతరం కొత్తగా బరువు బాధ్యతలు స్వీకరించాడు.

"రోడ్డుమీది ప్రజలంతా నీవు ఎప్పుడు క్రిందకు దూకుతావో, నీ అంతాన్ని కళ్ళారా చూద్దామని కనిబెట్టుకుని ఉన్నారు తెలుసా? వాళ్ళ అరుపులు నీకు బాగా వినిపిస్తున్నాయో లేదోగానీ, వాళ్ళంతా నిన్ను త్వరగా దూకమంటున్నారు." అంటూ నవ్వుతూ పలకరించాడు.

"నిజంగానే దూకమంటున్నారా?" నమ్మలేనట్టుగా చూశాడు సుందరం.

"ఇందాకట్నుంచి వాళ్ళందరూ ఊపిరి బిగబట్టుకుని నీవు ఎప్పుడు ఛస్తావా అని కాచుకుని కూర్చున్నారు."

"అయితే వాళ్ళందరూ క్రూరులూ, దుర్మార్గులూ అయి ఉండాలి!" సుందరం కోపంగా పళ్ళు కొరికాడు.

"అవునా? అలాంటి హింసాపరులకోసం, దుర్మార్గుల కోసం పండంటి నీ జీవితాన్ని ఎందుకు బలిపెట్టుకుంటావ్ మరి?" తన పాచిక పారినందుకు రణధీర్ తృప్తిగా తల పంకించాడు.

"అదీ నిజమే లాగుందే?" సుందరం సంశయంగా చూశాడు.

"అందుకు సందేహమా?"

సుందరం తనున్న చోటునుంచీ, ఇరువైపులా ఉన్న కిటికీల వంక చూశాడు.

"ఏమిటీ?" అడిగాడు రణధీర్.

"నేను ఇక్కడనుంచి ఏ ఆసరా లేకుండా రాలేననుకుంటాను!" సుందరం అనుమానంగా అన్నివైపులా చూశాడు.

"భయపడకు, నాచేయి పుచ్చుకుని నీవు పైకి ఎగ

బ్రొకేయి!" అంటూ క్రిందకు వంగాడు. వీలైనంతవరకూ తన చేతిని జాపి సుందరాన్ని అందుకోవటానికి.

సుందరం గూడ ఒక్క అడుగు ప్రక్కకు జరిగాడు. తన చేతిని జాపి రణధీర్ చేతిని అందుకుని గట్టిగా పట్టుకున్నాడు.

రోడ్డుమీద ప్రెస్ విలేఖర్లు గూడ పోగయారు. ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీస్తున్నారు.

రణధీర్ సాహసానికి రోడ్డుమీద జనం హర్షధ్వానాలు చేస్తున్నారు. ఎక్కడో దూరంగా పోలీస్ సైరన్లు వినిపించాయి.

సుందరం పళ్ళు బిగబట్టి. ఒక్కసారిగా వికృతంగా నవ్వాడు రణధీర్‌ని చూసి.

"నీవు వస్తావని తెలుసు. అందుకే నా చావుకు నీ హోటల్‌ని ఎంపిక చేసుకున్నాను" అన్నాడు సుందరం.

"ఏమిటి నీ వనేది?" రణధీర్ అయోమయంగా చూశాడు.

"మీనాక్షి అనే అమ్మాయిని ప్రేమించి, ఆమె సర్వస్వాన్ని దోచుకుని, పారిపోయి వచ్చిన పిరికిపందవు నీవే కదూ? ఆ మీనాక్షినే నేను పెళ్ళాడాను. నీ ఘనకార్యాన్ని నాకు తెలియజేస్తూ ఉత్తరం రాసిపెట్టి, ఆమె ఆత్మహత్య చేసుకుంది. నేను ఎటూ మీనాక్షిని చేరబోతున్నాను. నిన్నూ ఆమె దగ్గరకే లాక్కెళ్ళుతున్నాను" అంటూ సుందరం ఊహించని వేగంతో రణధీర్‌ను క్రిందకు గుంజాడు.

మరుక్షణం ఇద్దరూ గాలిలో ఉన్నారు.

ఆఖరి క్షణాల్లో రణధీర్, సుందరం మాటలకు ఉలిక్కిపడ్డాడు. సుందరం చేతుల్లోంచి బయటపడడానికి పెనుగులాడాడు. కానీ సుందరం భల్లూకపు పట్టులోంచి విడివడలేకపోయాడు,

రోడ్డుమీద జనంలో హాహాకారాలూ మిన్నుముట్టాయి.***

# చివరి నేరం!

## అజీజ్

తలుపు దగ్గిర వాలుకుర్చీ వేసుకుని, సిగరెట్ కాలుస్తూ ఆ ఇంటి గుమ్మంవేపు చూస్తున్నాను.

గంటనించీ ఆమె రూపంకోసం కళ్ళు తహతహలాడుతున్నాయి. ఐనా దర్శనంలేదు. ఇంట్లో మొగుడు మళ్ళీ ఏదైనా గొడవ లేవదియ్యలేదు కదా!

టైం చూసేను.
సాయంత్రం ఆరు గంటలు.

వెధవ దుకాణంనించి వచ్చివుంటాడు. రాగానే అలవాటు ప్రకారం ఆమెతో కీచులాట లేవదీసి వుంటాడు. అందుకే మాటిమాటికీ గుమ్మంలో ప్రత్యక్షమయ్యే ఆమె ఇంత సేపైనా కనిపించడంలేదు. వాడి మొహం చూస్తే చాలు నాకు వళ్ళు భగ్గుమంటుంది. అంత అగ్లీగా వుంటాడు రాస్కెల్!

నేను ఈ గదిలో దిగి నెలే అవుతోంది. దొంగవృత్తి చేపట్టిన నావంటివాడికి ఆ మద్రాసు మహానగరంలో అడపా దడపా ఆ వీధినించి ఈ వీధికి, ఈ వీధినించి ఆ వీధికి మకాం మార్చకతప్పదు.

ఇప్పుడు నివసిస్తున్న ఈ గది ఓ సందులో వుంది. సందు కిరుపక్కలా వరసగా ఇళ్లున్నాయి. ఆ సందులో కేవలం ఓ రిక్షా మాత్రం వెళ్ళగలదు.

నా గది కెదురుగా వుంది ఆమె ఇల్లు! మొదటి రోజు రిక్షాలో సామానుతో ఆ సందులోకి రాగానే చూసేను ఆమెని. గుమ్మంలో నిల్చునుంది.

ఆ క్షణంనించీ నా మనసు మనసులో లేదు. ఎందుకో ఆమెను ఒక్కసారి కావాలని మనసు తపించిపోతున్నది.

ఆమె గురించి కూపీతియ్యాలని వచ్చిన కొత్తలో పొరుగింటి కుర్రాణ్ణి బిస్కట్లతో, చాక్లెట్లతో మచ్చిక చేసుకుని వివరాలు సేకరించాను.

ఆమె పేరు రాజ్యలక్ష్మి, మొగుడి పేరు విశ్వనాథశెట్టి. అతన్ది వడ్డివ్యాపారం. మూర్‌మార్కెట్‌లో అతని తాకట్టు దుకాణం వుంది. పిల్లల్లేరు.

విశ్వనాథశెట్టి ఉదయం ఎనిమిది గంటలకి ఇంటినించి దుకాణం వెళ్ళి, మధ్యాహ్నం ఒంటిగంటకి భోజనంకోసం వస్తాడు. భోజనం తర్వాత ఓ గంట ఇంట్లో రెస్టుతీసుకుని రెండు గంటలకి వెళ్ళిపోయి, రాత్రి ఎనిమిది గంటలకి తిరిగి వస్తాడు.

ఇవీ నేను సేకరించిన విషయాలు.

విశ్వనాథంకు దాదాపు నలభై ఏళ్ళు దగ్గిర పడుతున్నాయి. బుర్రమీద పల్చని జుత్తు, ఇప్పుడా, అప్పుడా అన్నట్టు

మిగిలివుంది అక్కడక్కడా.

నల్లగా, బొద్దుగా వుండే అటువంటి వ్యక్తితో అంత అందమైన పాతికేళ్ళ యువతి ఏం చూసి పెళ్ళికి రాజీ పడిందో, ఎంత గింజుకున్నా నాకు బోధపడలేదు. మొత్తానికి ఏవో బలీయమైన పరిస్థితులు ఎదురై, అతన్ని భరించడానికి సిద్ధపడుంటుందని గ్రహించాను.

తనబోటివాడికి అటువంటి అందగత్తె దొరికినందుకు మురిసిపోక, ఆమెని పువ్వుల్లో పెట్టి పూజించక, బడుద్ధాయ్ దుకాణంనించి రాగానే ఏదో ఒక గొడవ లేవదీస్తుంటాడు. వీధిలోకి వినిపించేలా కేకలేస్తుంటాడు. ఒకటిరెండుసార్లు ఆమెని చావమోదిన సంఘటనలూ వున్నాయి. పాపం, ఆ మూగప్రాణి నేరం ఏమిటో తెలీదు.

మొగుడివల్ల యాతనలుపడే ఆడదాన్ని ఇట్టే మచ్చిక చేసుకోవచ్చు. ఇది హ్యూమన్ సైకలాజికల్ పాయింట్! తన ఇంటివాడు ఇవ్వని ప్రేమా, ఆదరణా పరాయివాడిలో పొందడానికి ఆ స్త్రీ తహతహలాడుతుంటుంది,

ఈ పాయింట్ మీదే రాజ్యలక్ష్మిని మచ్చికచేసుకుని నా కోరిక తీర్చుకోవాలని, పగలంతా గడప దగ్గిర వాలుకుర్చీలో తిష్ఠవేసి ఆ ఇంటివేపు చూస్తూ చూపులగాలం విసరసాగాను.

నా చేతికి సాధారణంగా అమావాస్య రాత్రుల్లోనే ఎక్కువ 'పని' వుంటుంది. పగలంతా ఇంట్లోనే గడుపుతాను. విశ్వనాథం ఉదయం దుకాణానికి వెళ్ళిపోతాడు గనక, రాజ్యలక్ష్మికి ఇంట్లో ఒంటరిగా ఏమీ తోచదు. అడపాదడపా గుమ్మంలోకి వచ్చి, వీధిలోకి చూస్తూ నిల్చుంటుంది.

ఆమె అలా బైటికి రాగానే మొదట కనిపించేది నేనే!

నా చూపుల గారడీ కొద్దికొద్దిగా పనిచెయ్యసాగింది. మొదట ఓరగా వాల్జూపులతో చూసేదల్లా ఇప్పుడు కాస్త పరీక్షగా చూస్తోంది. కొత్తలో నేను చిరునవ్వు విసిరితే చటుక్కున వెనుదిరిగి లోనికెళ్ళిపోయేది. ఇప్పుడు తనూ చిన్నగా నవ్వుతోంది.

ఓ సాయంత్రం గదికి తాళంవేసి అలా బజారు వెళ్ళి తిరిగి వచ్చాను. వాళ్ళ గుమ్మం దగ్గిర రాజ్యలక్ష్మి నిల్చుని కనిపించింది.

సడన్‌గా నాలో ఓ ఆలోచన వచ్చింది. కాసేపు చేతులు తడుముకున్నట్టు నటించి, ఆమె దగ్గిరికెళ్ళాను.

"నా తాళంచెవి ఎక్కడో పడిపోయినట్టుంది. మీ దగ్గిర గోద్రెజ్ తాళంచెవులేవైనా వుంటే కాస్త ఇస్తారూ? ప్రయత్నించి చూస్తాను" అన్నాను.

రాజ్యలక్ష్మి ఇంట్లోకెళ్ళి తాళంచెవుల గుత్తి పట్టుకొచ్చింది. వాటిని అందుకుంటూ, వేళ్ళతో ఆమె చెయ్యి మెత్తగా వత్తి వదిలాను. ఆమె చిటపటలాడలేదు. పెదాల మీద మెరిసి మాయమైన దరహాసం నాలో కొండంత ధైర్యం నింపివేసింది.

తాళంచెవులు తిరిగి ఇచ్చేటప్పుడు ఆమె వేళ్ళూ నా చేతిని మెల్లిగా రాసుకున్నాయి. ఆ సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఒళ్ళు పులకించిపోతుంది.

ఉన్నట్టుండి ఆ ఇంట్లోంచి మగకంఠం పెద్దగా వినిపించడంతో ఆలోచనలకి బ్రేకులుపడ్డాయి. నా అంచనా కరెక్టే. విశ్వనాథం రాజ్యలక్ష్మిని దేనికో కేకలేస్తున్నాడు.

టైం చూసాను. అప్పటికే ఏడున్నరయింది. హోటల్ కెళ్ళి భోంచేసి రావాలి. గూట్లోంచి తాళం అందుకుని

లైటార్పి బైటికి నడిచాను.

"ఎనిమిది గంటలకి బస్సుంది. ఆ తోలుసంచీలో ఓ లుంగీ, రెండు జతల బట్టలూ, ఓ టవలూ సర్దిపెట్టు. అక్కడ నా పని ఒక్కరోజులో అవుతుందో, రెండ్రోజులు పడుతుందో తెలీదు. ఇల్లు జాగ్రత్త! వీధి తలుపు ఎప్పుడూ మూసివుంచాలి. వాకిలి వదలి ఇరుగుపొరుగు అమ్మలక్కలతో కబుర్లుపెట్టికూర్చునేవు. నే వెళ్ళాక ఇంట్లో ఏదైనా జరిగితే, చర్మం ఒలిచేస్తాను. జాగ్రత్త!" అంటున్నాడు విశ్వనాథం,

రాజ్యలక్ష్మి ఏదో అంది. సరిగ్గా వినిపించలేదు. ఏది ఏమైనా ఆనందంతో నా మనసు ఉరకలు వేసింది. విశ్వనాథం ఎనిమిది గంటల బస్‌లో ఎక్కడికో పోతున్నాడు. ఈ ఆలోచన మనసంతా ఆనందం నింపుతోంది. ఇన్నాళ్ళకి దొరికింది గోల్డెన్ ఛాన్స్!

సిగరెట్ అంటించి, తలుపుకి తాళంవేసి, కూనిరాగం తీస్తూ సందులోపడి నడవసాగాను.

బిర్యానీ, కోడికుర్మా, పరోటా అంటే నాకు ప్రాణం. పీకవరకూ లాగించాను. కష్టార్జితం అయితే తెలిసివచ్చేది. దొంగసొమ్మాయె. ఎంత తిన్నా పోయిందేమిటి?

బిల్లు చెల్లించి ఇవతల పడ్డాను.

అప్పటికే ఎనిమిదిన్నరయింది. ఈపాటికి విశ్వనాథం వెళ్ళిపోయుంటాడు. రాజ్యలక్ష్మి ఒంటరిగా వుంటుంది. సందులోనూ జనసంచారం వుండదు.

ఏదో ఒక మిషతో ఇంట్లో ప్రవేశిస్తే సరి. ఇంతకి ముందు రాజ్యలక్ష్మి క్రీగంట చూపులూ, చిర్నవ్వులూ, గ్రీన్ సిగ్నల్స్ ఇవ్వనే ఇచ్చాయి.

# 2

ఆ వీధి చేరేసరికి సరిగ్గా తొమ్మిది గంటలయింది.

మలుపు తిరిగి సందులో ప్రవేశించాను. మిగతా ఇళ్ళ తలుపులన్నీ మూసివున్నాయి. సందులో జనసంచారంలేదు.

మూసివుంటుందనుకున్న రాజ్యలక్ష్మి ఇంటితలుపు తెరిచి వుండటంతో ఆశ్చర్యపోయాను. కొంపదీసి విశ్వనాథం తన ప్రోగ్రాం కేన్సిల్ చేసుకోలేదు కదా?

ఇంటిని సమీపించాక వాళ్ళ గుమ్మంలో రాజ్యలక్ష్మి నిల్చుని కనిపించడంతో మనసు ఉరకలువేసింది. విశ్వనాథం ఇంట్లో వుంటే, రాజ్యలక్ష్మి ఎప్పుడూ అలా గుమ్మంలో నిల్చోదు. వెధవ వెళ్ళుంటాడు. వాళ్ళింట్లో లైటు వెలగడంలేదు. మాటలు కలపడానికి మంచి సాకు దొరికింది.

"మీ ఇంట్లో లైటు వెలగడంలేదేమిటి? ఫ్యూజు పోయిందా?" అడిగాను.

"ఔనండీ! గంటక్రితం మావారు, పనిమీద ఊరెళ్ళడానికి బస్‌స్టాండ్ వెళ్లారు. వారలా వెళ్ళిన పావుగంటకి ఇంట్లో కరెంటు పోయింది. కాస్త ఫ్యూజ్ వేసిపోతారూ?" ఆమె కంఠంలో ప్రాధేయత.

ఇంకేం కావాలి? రొట్టె విరిగి నేతిలో పడినట్టే!

నవ్వి తలూపాను. "అలాగే! ఫ్యూజ్ వైర్ పట్టుకొస్తానుండండి." అంటూ నా గది తలుపు తెరిచి లోనికెళ్ళాను.

మూల వున్న ట్రంకుపెట్టి తెరిచాను. లోపల అంతకుముందు తాగి, సగం వుంచిన బ్రాందీసీసా తీసి, గడగడ దాన్ని ఖాళీచేసి, ఓ వైర్ ముక్కా, టార్చ్‌లైట్ అందుకుని బైటికి వచ్చాను. తలుపు లాక్‌చేసి, ఆమె ఇంటివేపు నడి

చాను. తలుపు కడ్డం తొలిగి దారిచ్చింది.

లోన అడుగుపెట్టి, టార్చ్ వెలిగించి, "ఫ్యూజ్ బోర్డ్ ఎక్కడ?" అడిగాను.

"ఆ గదిలో వుంది రండి!" అంటూ ఓవేపు నడిచింది.

ఆమె కాలి అందెలు చేసే చప్పుడు నా గుండెలో గజ్జెలు మ్రోగిస్తోంది. అడుగులకి లయగా కదిలే ఎత్తైన పిరుదులు చూస్తూ ఆమెని అనుసరించాను.

అప్పటికే నాలో బ్రాందీ మహత్తు పని చెయ్యసాగింది. చటుక్కున చెయ్యి ఆమె నడుంచుట్టూ వేసి మీదికి లాక్కున్నాను.

"అయ్యో, ఎవ్వరైనా చూస్తారు. వదలండి," అంటూ విడిపించుకో బోయింది.

"చూడకుండా తలుపు మూస్తే సరి!" అంటూ రెప్ప పాటులో తలుపు మూసి వెనుదిరిగేను.

నా నరాలు పూర్తిగా వేడెక్కి పెటపెటలాడుతున్నాయి.

"వద్దండీ, నాకు భయం వేస్తోంది!" అంది వెనక్కి జరుగుతూ.

"చెట్టంత నేను తోడుండగా, భయం దేనికి?" అంటూ ఆమెని చుట్టేసి మీదికి లాక్కున్నాను.

"నా మాట వినండి. మా వారికి తెలిస్తే నన్ను చంపే స్తారు," జాలిగా అంది.

"ఏడిశాడు. నీ మెత్తదనం చూసి వాడలా ఎగురుతాడు గానీ, పెళ్లాం అప్పడాల కర్రందుకుంటే, ఏ మొగుడైనా నోరెత్తుతాడా?

అసలు, ఇంత అందం, యవ్వనం ఉంచుకుని, దేభ్యం లాటి విశ్వనాథాన్ని దేనికి కట్టుకున్నావ్? నీవు కో అంటే

కోటి మంది అందమైన యువకులు పాదాల ముందువాలేవారు కాదా?"

రాజ్యలక్ష్మి పేలవంగా నవ్వింది. "నిజమే! బ్రహ్మ రాతలో మరో విధంగా రాసి వుంటే, ఎవ్వరేం జెయ్య గలరు? మీ ప్రశ్నలకి జవాబులు ఓ విషాద గాధ రూపంలో చెప్పవలసి వుంటుంది."

"ప్లీజ్! చెప్పవూ? వినాలని చాలా కుతూహలంగా వుంది."

రాజ్యలక్ష్మి కాసేపు పలకలేదు. తరవాత భారంగా నిట్టూర్చి చెప్పసాగింది.

"అప్పుడు మేము కాకినాడలో ఉండేవాళ్ళం. విశ్వనాథం ఆ ఊళ్ళోనే తాకట్టు వ్యాపారం జేసేవాడు. అతని దగ్గిరే మా నాన్న గుమాస్తాగా పనిజేసేవాడు. పద్దులు రాయడం, జమా లెక్కలు చూడటం, అప్పులవాళ్ళ దగ్గరినించి అప్పులు వసూలు జేసుకు రావడం ఆయన పని.

అమ్మ చాలా కాలం క్రితమే పోయింది. నాన్న దీర్ఘ కాలంగా దమ్మరోగంతో బాధపడేవాడు. ఆయనతో బాటు నేనూ ఇద్దరు తమ్ముళ్ళూ రోజులు వేళ్ళ మీద లెక్క పెడుతూ, చాలా కఠినంగా గడిపేవాళ్ళం. విశ్వనాథం ఇచ్చే రెండు వందల్లో సగానికి పైగా, నాన్న మందూ మాకులకే సరిపోయేది. ఓ పూట తినీ, ఓ పూట తినకా....అబ్బ, ఆ రోజులు జ్ఞాపకం వస్తే నా ఒళ్ళు ఇప్పటికీ జలదరిస్తుంది.

అప్పటికి నేను పంధొమ్మిదో ఏట ప్రవేశించేను. నా పెళ్ళి ఎలా చెయ్యగలనా అన్న దిగులూ, సరైన తిండీ, చికిత్సా లేక, నాన్న జబ్బు తీవ్రమై, ఆయన్ని మంచాన పడవేసింది.

ఇక ఇల్లెలా గడిచేది? తమ్ముళ్లు ఇంకా చిన్నవాళ్ళు ఏం సంపాదించగలరు? ఐనా, పేపర్లూ అవీ అమ్మి అంతో ఇంతో పట్టుకొచ్చేవారు. ఈ రోజుల్లో ఆ పిసరు సంపాదన ఏమూలకి? జీవితాలు దుర్భరంగా తయారయ్యేయి.

అప్పుడు పడింది విశ్వనాథం దృష్టి నా మీద. మా దీన స్థితి చూసి జాలి పడుతున్నట్టు, ఎంతో ఆత్మీయుడిలా ఆర్థిక సహాయం అందిస్తూ, రాకపోకలు సాగించేవాడు. నా కళ్ళ కతను ఆపద్బాంధవుడిలా కనిపించేవాడు.

ఒకరోజు డాక్టర్ నాన్నకి రాసిచ్చిన మందులు తేవడానికి డబ్బు తనిస్తాననీ, సాయంత్రం ఇంటికి వచ్చి తీసికెళ్ళమనీ చెప్పేడు విశ్వనాథం. నిజమే అనుకున్నాను. తమ్ముళ్ళు పగలంతా న్యూస్ పేపర్లమ్మి, రాత్రిళ్ళు సినిమా టాకీసులు దగ్గిర బ్లాకులో టిక్కెట్లమ్మి కమీషన్ సంపాదించడానికెళ్ళే వారు.

విధిలేక, ఆ రోజు సాయంత్రం విశ్వనాథం ఇంటికి నేనే వెళ్ళవలసి వచ్చింది. అతని భార్య అంతక్రితమే ఏదో దుర్ఘటనలో మరణించిందిట. పిల్లా జల్లా లేరు. నేను ఇంట్లో కెళ్ళగానే, తలుపులు మూసి బలాత్కారానికి దిగేడు.

అరిచేను. గింజుకున్నాను. రక్కేను. కొరికేను. లాభం లేకపోయింది. క్రూరంగా చెరచబడ్డాను. పెళ్ళి జేసుకోమనీ, మా కుటుంబ గౌరవాన్ని కాపాడమనీ కాళ్ళా వేళ్ళాపడ్డాను.

నవ్వేడు. శాస్త్రోక్తంగా పెళ్ళి మాత్రం జేసుకోననీ, కావలిస్తే ఉంచుకుంటాననీ, తన ఉంపుడుగత్తెగా ఉండి పొమ్మనీ, మా అవసరాలన్నీ తీరుస్తాననీ చెప్పేడు.

ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించే నాన్న కోసం, నా తమ్ముళ్ళ కోసం అతనితో రాజీపడ్డాను. విశ్వనాథం కోరి

నప్పుడల్లా. రమ్మన్నప్పుడల్లా చాటు మాటుగా వెళ్ళి అతని మృగతృష్ణ తీర్చి వచ్చేదాన్ని.

అటువంటి వ్యవహారం ఎంతకాలం దాగుతుంది? లోకానికి తెలిసిపోయింది. ఆ అవమానం భరించలేక నాన్న ఆత్మ హత్య జేసుకున్నాడు. తమ్ముళ్ళు ఊళ్ళో తలెత్తుకు తిరగ లేక చెప్పా పెయ్యకుండా ఎక్కడికో వెళ్ళిపోయేరు.

దిక్కూ దరీ తోచక జీవచ్ఛవంలా విశ్వనాథంతో ఉండి పోయేను. ఇంతలో కొత్తగా ఆ ఊళ్ళో ఇద్దరు ముగ్గురు వడ్డీ వ్యాపారంలో దిగడంతో, విశ్వనాథం వాళ్ళ పోటీకి తట్టుకోలేక, నన్ను తీసుకుని మద్రాసు మకాం మార్చి, ఇక్కడ వ్యాపారం మొదలు పెట్టేడు.

మద్రాసు వచ్చేక, అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది నా మీద మొహం మొత్తింది. మొదట చీటికీ మాటికీ చీవాట్లు పెట్టేవాడు. ఇప్పుడు అడపా దడపా చెయ్యి కూడా జేసు కుంటున్నాడు. ఏం జెయ్యను? భరిస్తున్నాను. మరోదారిలేక!

ఆత్మహత్య జేసుకునే ధైర్యం నాకు లేదు. ఒక్కోసారి అతను పెట్టే అగచాట్లు భరించలేక, ఎక్కడికైనా పారిపో దామా అనిపిస్తుంది. ఎక్కడికి పారిపోను? ఒకవేళ పారి పోయినా, ఇంతకంటే హీనమైన మురికి కూపాలు తప్ప నాలాటి వాళ్ళకి ఈ లోకంలో మరో నీడ ఏది? ఇప్పుడు ఒక్కడితో సరిపోతోంది. అప్పుడు ఇలాటి వాళ్ళనెందర్ని భరించవలసి వస్తుందో?

అందుకే, పడున్నాను. ఇక్కడే పడున్నాను. తమ్ముళ్ళు ఎక్కడున్నారో ఏమైపోయేరో నాకు తెలీదు." చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఓహ్! నిజంగా నీది చాలా దయనీయమైన గాథ!"

అన్నాను జాలిగా ఆమె వీపు నిమురుతూ.

కాసేపు గదిలో విషాదం రాజ్యమేలింది నిశ్శబ్దంగా. గుండె భారం కాస్త తెప్పరిల్లేక, కళ్లు తుడుచుకుని, "సరే, ముందు ఆ ఫ్యూజ్ విషయం చూడండి" అంది రాజ్యలక్ష్మి.

3

టార్చ్ మసక వెలుగులో తడుముకుంటూ ఫ్యూజ్ బోర్డు వున్న గదిలోకి నడిచేను.

సరిగ్గా అదే సమయంలో వెనక టక్ మనే శబ్దం!

గిరుక్కున వెనుదిరిగి చూసేను. గుండె గుభిల్లుమంది. గది తలుపు మూసుకుంది! తలుపు పట్టి గట్టిగా లాగేను. తెరుచుకోలేదు. అవతల గడియ బిగించేరు. ఎవ్వరు? ఏమిటీ మాయ? రాజ్యలక్ష్మి ఏమైంది?

ఎందుకో భయంతో ముచ్చెమటలు పడుతున్నాయి.

టార్చ్ వెలుగులో చుట్టూ పరికించేను.

అప్పుడు పడింది దృష్టి. నేల మీద ఓ గోడవారగా బోర్లాపడున్న మానవాకారం మీద! ఆశ్చర్యంతో భయంతో బుర్ర గిరగిర తిరగసాగింది.

అడుగులో అడుగు వేసుకుంటూ అటు నడిచేను. లైటర్ వెలుగులో వంగి పరీక్షగా చూసేను. స్త్రీ కాదు. మగాడు కాలితో అతన్ని వెల్లికిలా తిప్పి చూసేను.

నా ఊపిరి ఆగిపోయినట్టు తోచింది.

అతనెవ్వరో కాదు. రాజ్యలక్ష్మి భర్త విశ్వనాథం?

నుదురూ, కుడి కణతా పగిలి పచ్చడై ఉంది. ధారలుగా కారి గడ్డకట్టిన ఎర్రని చిక్కని రక్తం! కళ్ళు సగం తెరిచి ఉన్నాయి. అతని పక్కనే లావుపాటి ఇనపరాడ్ పడుంది. ఓ మూల ట్రంకుపెట్టె తెరవబడి వెండి, బంగారు నగలు

చెల్లా చెదరుగా పడివున్నాయి.

అది కలో నిజమో, నమ్మాలో వద్దో ఎటూ పాలుపోడం లేదు. ఏమిటీ గారడి? ఊరికి వెళ్ళాడనుకున్న విశ్వనాథం ఇక్కడే చచ్చిపడున్నాడు. ఇంట్లో ఫ్యూజు పోయిందని రాజ్యలక్ష్మి నన్ను ఆహ్వానించింది, గదిలోకి పంపి తలుపు బైటనించి మూసుకుంది.

ఇవన్నీ కళ్ళల్లో గిరగిర తిరుగుతుంటే, సంగతేమిటో అరటిపండు ఒలిచినట్టు తెలిసిపోయింది.

ఇది ముందే అల్లి అమలుపెట్టిన పథకం! నంగనాచిలా నటిస్తూ తన తళుకు బెళుకులతో నన్ను వల్లో వేసుకుంది. ఊరికి వెళ్ళడానికి తయారవుతున్న విశ్వనాథాన్ని ఇనప రాడ్‌తో చితగ్గొట్టి చంపేసింది. తనకీ, తన కుటుంబానికీ అతను జేసిన అన్యాయానికి ఈ విధంగా శిక్షవేసి కసి తీర్చు కుంది.

....నా ఆలోచనలు ఇంకా పూర్తికాలేదు. అవతలి గది లోకి ఎవ్వరో వచ్చినట్లు బూట్సుల సవ్వడి వినిపించడంతో ఉలిక్కిపడ్డాను.

"ఎక్కడున్నాడు?" అన్న అధికారయుతమైన కంఠం.

"ఇదుగో, ఈ గదిలో!" అన్న రాజ్యలక్ష్మి కంఠం విని వణికిపోయేను. సరిగ్గా అదే సమయంలో నేనున్న గది తలుపు తెరుచుకుంది.

పోలీస్ ఇన్‌స్పెక్టర్!

అతని వెనక రాజ్యలక్ష్మి?

"ఈ గదిలో ఏవో చప్పుళ్ళు విని నా నిదర మేల్కొంది. నా పక్కన మా వారు కనిపించలేదు. పడగ్గదిలోంచి లేచి

వచ్చి, తలుపు చాటున నక్కి గదిలోకి చూసేను. ఆ ఇనప రాడ్‌తో ఇతను మా వారి తల పలగొడుతుండటం కనిపించింది. చప్పుడు కాకుండా తలుపు మూసి అవతల గడియ పెట్టేను.

ఈ రాక్షసుడు మా వార్ని పొట్టన బెట్టుకుని, నా పసుపు కుంకుమ చెరిపి, నన్ను దిక్కులేని ద్దాన్ని జేసేడు." అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది రాజ్యలక్ష్మి.

బైట వున్న కానిస్టేబుల్స్‌ని కేకేసేడు ఇన్‌స్పెక్టర్. ఇద్దరు వచ్చేరు లోనికి.

ఐపోయింది. అంతా అయిపోయింది. నేను పోలీసులకు కొత్తవాణ్ణి కాను. నా మాట ఎవరూ ఆలకించరు. ఇనప బేడీల బరువు చేతుల నలంకరించింది. ఇక నా జీవితంలో చివరి నేరం ఇదే!

***

ఏక్సిడెంటయింది. ఒక మనిషిని కారు రాచుకుంటూ వెళ్ళిపోయింది. అతను స్పృహ తప్పి పడిపోయాడు.

అందరూ చుట్టూ మూగారు. అందులో ఒకడు "ఒక గ్లాసు మంచినీళ్ళు ఇవ్వండి" అన్నాడు.

"ఓ గ్లాసు కాఫీ తెండి" అన్నాడు మరొకడు.

ఇంతలో దెబ్బ తగిలినవాడు కళ్ళు తెరిచి, "కాఫీ వద్దు, గోల్డ్ స్పాట్ తెప్పించండి" అన్నాడు; తిరిగి కళ్ళు మూసుకుంటూ.

—మామిడి సత్యనారాయణమూర్తి, బరంపురం.

## కొత్త సీరియల్ ప్రారంభం

డార్జిలింగ్ స్టేషన్‌లో రైలు ఆగేప్పటికి రాత్రి ఎనిమిదయ్యింది.

సన్నని ఈదురు గాలితో పాటు జోరుగా వాన పడుతోంది.

కంపార్టుమెంట్‌లోనే సూట్‌కేస్ తెరచి రెయిన్‌కోటు బయటికి తీశాను. స్టేషనుకు కారు తీసుకురమ్మని కలకత్తాలో బయలుదేరే ముందు నా నౌకరు బిమాన్‌కు టెలిగ్రామ్ ఇచ్చాను.

వర్షంవలన చాలా చలిగా వుంది. సముద్రమట్టానికి చాలా ఎత్తులో వుండడంవలన వేసవిలోనే అతి చల్లగా వుంటుంది డార్జిలింగ్. ఇక వర్షాకాలంలోనూ, శీతాకాలం లోనూ చెప్పక్కరలేదు. వులెన్ హుడెడ్ టోపీని చెవులమీదకు లాక్కొని ప్లాట్ ఫారంమీదకు దిగాను.

ఎక్కడా బిమాన్ జాడలు తెలియడంలేదు. నా టెలి గ్రాం అందిందో లేదో....వర్షాకాలంలో తరచు టెలిగ్రాఫ్ స్థంబాలు పడిపోయి లైన్లు పాడయిపోతూవుంటాయి. బహుశా అంది వుండదు. అందివుంటే తప్పక స్టేషన్ కు వచ్చి వుండేవాడే....యిప్పుడిక ఏ టాక్సీలోనో వెళ్ళాలి యింటికి.

స్టేషన్ బయట ఒకే ఒక టాక్సీ వుంది. పోర్టరు సూట్ కేసును ముందుసీట్లో పెట్టాడు. నేను సిగరెట్టు పారేసి లోపల కూర్చున్నాను. టాక్సీ రయ్యిన డార్జిలింగ్ వీధుల్లో నుండి దూసుకుపోసాగింది. క్రెయిటన్ పాయింట్ చేరుకొనే ప్పటికి వర్షం తగ్గిపోయింది. సన్నగా తుంపర పడుతోంది.

ఇంటిముందు టాక్సీ దిగి డబ్బు చెల్లించాను. టాక్సీ వాడు చిన్న సలాంచేసి టాక్సీ తిప్పుకొని వెళ్ళిపోయాడు.

క్రెయిటన్ పాయింట్ లో చివరి ఇల్లు నాదే. ఎప్పుడో దాదాపు ఎనభై ఏళ్ళ క్రితం మా తాతగారు కట్టించినది. మా ఇంటికి కాస్త అవతలికి రోడ్డు ఆగిపోతుంది. అవతలి లోయలోకి ఎవరూ ప్రమాదవశాత్తు వెళ్ళకుండా అరడుగుల ఎత్తున బలమైన కాంక్రీటు గోడ నిర్మించారు.

కొండ అంచున అన్ని వాతావరణాలకు తట్టుకొనేట్లు కట్టిన ఇల్లది, కట్టడంలో పురాతన బ్రిటిష్ నిర్మాణ పద్ధతి స్పష్టంగా కనిపిస్తోంది. పోర్టికోలోని ఎలక్ట్రిక్ దీపం కాంతి

సింకోనా చెట్ల ఆకులమీద పడి చిత్రంగా మెరుస్తోంది. గాలికి పొడవాటి ఆ చెట్లు అటూ ఇటూ వూగుతున్నాయ్.

ఇంట్లో యెక్కడా దీపాలు వెలుగుతున్నట్లు లేవు.... బిమాన్ ఇంట్లో లేడా?

బిమాన్ లేకపోయినా టైగర్ ఏమయినట్లు....? టైగర్ మొరగదేం?....బయట తలుపుమీద చెయ్యివేశాను....గడవేసి లేదు....నిశ్శబ్దంగా గేటులోపలకు కదిలింది. క్షణంసేపు ఆశ్చర్యంవేసింది నాకు. చకచక పోర్టికోలోనుండి వరండా వైపు అడుగులు వేశాను.

కాంక్రీటు బాటమీద బూట్లచప్పుడు ఒంటరిగా వినిపిస్తోంది. ఇంటి ముఖద్వారం తలుపులు వేసివున్నాయి.తలుపు తోశాను....తెరుచుకోలేదు. లోపల గడియ వేసివుండాలి. అయితే బిమాన్ ఇంట్లో వున్నాడా? వుంటే తలుపు తెరవదేం? ఎందుకో నా మనసు కీడును శంకించసాగింది.

కాలింగ్ బజర్‌మీద వేలితో నొక్కాను. లోపల బజర్ మ్రోగుతోన్న శబ్దం వినబడుతోంది. బిమాన్ నిద్రపోతున్నాడా? రాత్రి పదకొండుకుగాని నిద్రపోడతను. ఇంకా తొమ్మిదికూడా కాలేదు. ఇంట్లోంచి ఏ చప్పుడూ వినిపించలేదు.

చల్లగాలి తెర ఒకటే రయ్యిన వీచింది. ఇంటిముందు సింకోనాచెట్లు చిత్రమైన శబ్దం చేశాయి జుఁయ్ఁ మంటూ. ఎందుకో తెలియకుండా గుండె జల్లుమంది. సూట్‌కేస్ క్రింద పెట్టి, తెరిచి టార్చిలైట్ బయటకు తీశాను.

టార్చి వెలిగించి ఇంటి వెనుకవైపుకు నడిచాను. అంతా నిశ్శబ్దం. ఎలాంటి కదలికా లేదు.

"బిమాన్!" గట్టిగా పిలిచాను. నా అరుపుకు వెనుక

కొండ గోడనుండి చిన్న ప్రతిధ్వని వచ్చింది.

వెనుక తలుపుదగ్గరకు నడిచాను. తలుపుమీద చెయ్యివేసి మెల్లిగా నెట్టాను. నిశ్శబ్దంగా తలుపు తెరుచుకొంది. టార్చి వెలుతుర్ని ఫోకస్ చేశాను లోపలకు.

ఏదో తెలియని విచిత్రమైన సెన్సేషన్ కలుగుతోంది నాకు. గుర్తుతెలియని వాసన ముక్కుపుటాలకు తగుల్తోంది. టార్చి త్రిప్పుతూ వంటిల్లంతా కలియజూశాను. తలుపు ప్రక్కనే వున్న స్విచ్ నొక్కాను. ఎలక్ట్రిక్ దీపం వెలుతురులో కిచెన్‌కి డైనింగ్‌రూంకి మధ్య తలుపు తెరిచే వుంది....

గుమ్మంలో నిలబడి గదిలోకి టార్చి ఫోకస్ చేశాను. ఎవరూ లేరు. ఎదురుగా డైనింగ్‌రూమ్‌నుండి బయటి హాల్లోకి వున్న తలుపు తెరిచే కనబడుతోంది. గుండెలు యెందుకో దడదడమంటున్నాయి. బిమాన్ ఇంట్లో లేడని తెలుసు....ఎక్కడ వున్నట్లు....? ఒకడుగు ముందుకు వేశాను.

చటుక్కున ఆగిపోయాను. ఏదో వాసన ఘాటుగా వస్తోంది. టార్చి వెలుగు గోడమీద ఓ స్పాట్‌లో ఆగిపోయింది. తెల్లని గోడమీద ఏదో మరక....చిన్న పిల్లాడు నిండుగావున్న రంగు డబ్బాలో బ్రష్ ముంచి విదిలించినట్లు ఎరుపో, నలుపో తెలియడంలేదు.

మరో రెండడుగులు ముందుకు వేశాను. ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది....రక్తం! అవును రక్తం మరక.... ఆ వాసన రక్తం వాసన....మరో అడుగు ముందుకు వేశాను. కాళ్ళక్రింద మెత్తగా ఏదో తగిలింది. టార్చిని కాళ్ళవేపు ఫోకస్ చేశాను.

టైగర్! యస్! టైగర్....తల చితికి....రక్తం మడుగులో పడివుంది. మృత్యుకౌగిలిలో దాని పళ్ళు వికృతంగా, భయంకరంగా బయటికి పొడుచుకువచ్చి కనిపిస్తున్నాయి. వెన్నులోంచి చలి తన్నుకువచ్చి క్షణం ఒళ్ళు జలదరించింది.

బయట ఈదురు గాలితోపాటు హోరున వర్షం కురుస్తోంది.

చటుక్కున ఇంట్లోకి పరిగెత్తాను. వెళుతూ ఒక్కొక్క లైటూ వెలిగించుకొంటూ వెళ్ళాను.

హాలులో లైటు వెలిగించి క్షణంసేపు చుట్టూ చూశాను. ఒక్కసారి గుండె ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలు పెట్టింది.

హాలుకు, వరెండాకు మధ్యవుండే తలుపు ప్రక్కగా బిమాన్ పడివున్నాడు. చకచక అతనిదగ్గరికి నడిచాను. దగ్గరగా వెళ్ళి చూడగానే తెలుస్తోంది....బిమాన్ శరీరంలో ప్రాణం లేదని.

నుదుటిమధ్య ఎర్రని రంధ్రం. చిన్నధి. అంచులచుట్టూ నల్లగా మాడిపోయింది.

హత్య జరిగి గంట. రెండు గంటలకంటే యెక్కువ కాలేదనిపించింది.

నలభై ఏళ్లు వుంటాయి బిమాన్‌కు,నాకు పదేళ్ళు వుంటాయేమో అతన్ని మొదటిసారిగా డొమెస్టిక్ సర్వెంట్‌గా కలకత్తానుండి తీసుకువచ్చినప్పుడు....ఇప్పుడు నా వయసు ముప్పై. గత ఇరవై ఏళ్ళలోనూ నా జీవితంలో చాలా మార్పులు జరిగాయి. ఇంతకాలమూ యెంతో విశ్వాసంగా పని చేశాడు మా ఇంట్లో. మా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా

కలిసిపోయాడు. బిమాన్ చనిపోయాడనే నిజం మనసులోకి ఇంకి దుఃఖం పెల్లుబికింది.

హాలంతా చిందర వందరగా, ఎవరో ప్రతి వస్తువును కదిపినట్లు, చెల్లాచెదరు చేసినట్లు కనిపిస్తోంది. హడావిడిగా యెవరో దేనికోసమో వెతికినట్లు కనిపిస్తోంది ఆ దృశ్యం చూస్తోంటే?

మతిపోయిన మనిషికిమల్లే లేచి డ్రాయింగ్‌రూమ్‌లోకి నడిచాను. డ్రాయింగ్‌రూమ్ పరిస్థితి అలాగే వుంది. గోడ లోకి అమర్చబడివున్న ఐరన్‌సేఫ్ ముందు తగిలించిన శివ పార్వతుల పటం క్రిందపడి ముక్కలయి వుంది. సేఫ్ తలుపు ఊడిపోయి కనిపిస్తోంది. చాలా పాతకాలపు సేఫ్ అది. ఏదో ప్రేలుడు పదార్థంతో తలుపుతెరిచినట్లు స్పష్టంగా తెలుస్తోంది,

ఆ సేఫ్‌లో యెప్పుడూ డబ్బు దాచిపెట్టను నేను. ఉన్న దేదో బాంక్‌లో వుంటుంది. ముఖ్యమైన కాగితాలు, పాత కాలపు నగలు.... అమ్మవి.... వున్నాయి అందులో. కాగితా లన్నీ కెలికి చెల్లాచెదురుచేసి పారేశారు. దంతపుపెట్టెలో వున్న నగలు అలానే వున్నాయి.

డ్రాయరు అరలన్నీ సగం సగం తెరిచి వున్నాయి. పై అరలో నాలుగువందలు పెట్టాను కలకత్తాకు వెళ్ళేముందు. ఆ కాష్ మాత్రం కనిపించడంలేదు.

హాలులోకి వచ్చి పోలీస్ క్రయింబ్రాంచి నంబరు త్రిప్పాను. ఇన్‌స్పెక్టర్ గుర్‌ముఖ్‌సింగ్ పలికాడు. క్లుప్తంగా జరిగిన విషయం వివరించి ఫోన్ పెట్టేశాను.

నేను హాలు తలుపు తెరిచి వరెండాలోకి వెళ్ళి నిల బడ్డాను. వర్షం ఉధృతంగా కురవకపోయినా ఇంకా జల్లు

పడుతూనే వుంది. గాలి మాత్రం హోరున వీస్తోంది. బయట గేటు తెరిచే వుంది.

పావుగంట తర్వాత పోలీస్ కారు, దాని వెనుక అంబులెన్స్ వచ్చి వరెండా ముందు పోర్టికోలో ఆగాయి.

పోలీసులు తమ పని ముగించుకొని వెళ్లేప్పటికి రాత్రి రెండయింది.

## 2

రాత్రి డ్రాయర్లో వున్న నాలుగొందలు కరెన్సీ తప్ప మరేమీ పోలేదని తెలిపింది.

ఇంట్లో ప్రవేశించిన వ్యక్తి కేవలం దొంగే అయితే దంతపు పెట్టెలోని బంగారు ఆభరణాలు కూడా తీసుకొనేవాడు. దాదాపు ఆరుతులాల బరువుంటాయి. ఎంతలేదన్నా నాలుగయిదువేలు వస్తాయి వాటికి మార్కెట్ లో.

చాలా పురాతనపు ఇల్లు మాది. చూడ్డానికి డబ్బుగల వాళ్ళ ఇల్లులా కనిపించదు. నిజానికి నేను ధనవంతుణ్ణి కాదు. నెలకు ఎనిమిదివందల రూపాయల వుద్యోగం నాది. నేషనల్ మౌంటెనీరింగ్ ఇన్స్టిట్యూట్ లో ఇన్స్ట్రక్టర్ని నేను.

దొంగలు ఇళ్ళలో జొరబడేముందు ఆ ఇంట్లో మనుషుల్ని గురించి వాకబు చేస్తారంటారు. ఒక మనిషిని చంపేంత రిస్క్ తీసుకొనే ఆ దొంగ నన్ను గురించి తెలుసుకోకుండా దొంగతనానికి వచ్చాడా?

బిమాన్ శరీరం పడివున్న పొజిషన్ బట్టి అతను తలుపు తీయగానే ఆ దొంగ పాయింట్ బ్లాంక్ గా బిమాన్ ని కాల్చినట్లు తెలుస్తోంది. అంటే దొంగతనం చేస్తుండగా పట్టుబడి తప్పించుకోవడానికి కాల్చినట్లు లేదది. ఇంట్లోకి రాక

పూర్వమే ఇంట్లో ఎవరున్నా చంపి అయినా తన పని పూర్తి చేసుకోవాలనే వుద్దేశ్యంతో దొంగ వచ్చినట్లు కనిపిస్తోంది.

దొంగిలించడానికి గొప్ప వస్తువులేమీ లేవు ఇంట్లో. నేను అమెరికన్ బృందంతో కలిసి ఎవరెస్ట్ శిఖరం ఎక్కినప్పుడు మన దేశస్థులు ఇచ్చిన బహుమతులు, మెడల్సు వున్నాయి. పర్వతారోహకులు వుపయోగించే ఐస్‌యాక్స్‌లు, ఇన్‌షులేటెడ్ బూట్లు, థర్మల్‌వేర్ వున్నాయి. దొంగిలించినా అవి కొనే వ్యక్తులు బహు తక్కువ.

లేక కాస్త మతిస్థిమితంలేని దొంగా? ఏమోః! అయ్యుండాలి!

ఇన్‌స్పెక్టర్ సింగ్ ఫోన్‌చేసి ఈ ప్రాంతంలో పాత దొంగల నందర్నీ రౌండప్ చేశాననీ, వాళ్ళల్లో ఎవరూ హంతకులు కారనీ, హత్యలుచేసే ధైర్యం వాళ్ళకు లేదనీ, గట్టి ప్రయత్నాలు చేస్తున్నామనీ చెప్పాడు.

మళ్ళీ ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తాను. "హలో!"

"హలో! ఈజిట్ మిస్టర్ విశాల్?" ఎవరో గుర్తు రావడ్డంలేదు. పరిచయమైన గొంతుకాదు. అమెరికన్ యాక్సెంట్‌లా వుంది.

"యస్! హూయీజిట్ ప్లీజ్" అన్నాను.

చిన్న నవ్వు అవతలివైపునుండి. "మిస్టర్ విశాల్! రాత్రి నీ ఇంట్లో మర్డర్ ఎందుకు జరిగిందో నాకు తెలుసు" అన్నది అవలి కంఠం.

"వ్హాట్?" అన్నాను ఆశ్చర్యంగా.

"యస్! మిస్టర్ విశాల్! బిమాన్ ఎందుకు హత్య చెయ్యబడ్డాడో....నీ ఇంట్లో ప్రవేశించిన హంతకుడెవరో నాకు తెలుసు."

"తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియచెయ్" అన్నాను కోపంగా అతని ధోరణి నాకేం నచ్చలేదు.

మళ్ళీ చిన్ననవ్వు. "లేదు మిస్టర్ విశాల్! అది పోలీసు లకు తెలియజేసే విషయంకాదు. నీవు కూడా ఈ విషయం పోలీసుకులకు తెలియజేయకుండా వుండడం మంచిది. విష యాలు తెలుసుకోవాలనుకొంటే సాయంత్రం ఆరు గంట లకు టూరిస్ట్‌పారడైజ్ దగ్గరకు రా!"

"వాట్ ది హెల్ యు మీన్....హూఆర్ యు....?"

"నెవర్‌మైండ్ మిస్టర్ విశాల్! నేను చెప్పింది జాగ్ర త్తగా గుర్తుంచుకోండి. నో పోలీస్ కంప్లయింట్....ఈ విషయం మనిద్దరి మధ్యే వుండాలి. ఈ రహస్యం తెలుసు కోవడంవల్ల మీకూ, నాకూ లాభం చేకూరుతుంది. ప్లీజ్ రిమంబర్...సాయంత్రం ఆరుగంటలకు...." అని ఫోన్ పెట్టేశాడతను.

నేను ఆలోచిస్తూ ఫోన్ రిసీవర్ క్రెడిల్‌మీద పడేశాను, మరో క్రొత్త సిగరెట్ పాకెట్ తెరుస్తూ.

# 3

"వెల్‌కం మిస్టర్ విశాల్! యు ఆర్ వెరీ పంక్చు యల్" అన్నాడు ఫైర్‌ప్లేస్ ముందు స్ప్రింగ్ కుర్చీలో ముందుకూ వెనక్కూ ఊగుతున్న వ్యక్తి. ఉదయం ఫోన్‌లో కంఠస్వరం ఆ వ్యక్తిదే.

నేను మెల్లిగా అడుగులువేస్తూ అతని దగ్గరికి నడిచాను. క్షణంపాటు అతనివైపు సూటిగా చూశాను.

నున్నగా పైకి దువ్వుకొన్న ఎత్తైన తల, నలుపు కాదు. లాగ్‌ఫైర్ కాంతిలో స్పష్టంగా తెలియడంలేదు. బహుశా కాఫీరంగు అయ్యుండాలి. అక్కడక్కడా కణతల దగ్గిర

నెరసింది. విశాలమైన నుదురు. సన్నని కనుబొమల క్రింద పెద్ద కళ్ళు. ఆకాశంరంగు. పొడవుగా చివర కొక్కెంలా వంపుతిరిగిన ముక్కు. నున్నగా గీసుకొన్న పై పెదవి. బిగించిన నిండుపెదిమలు. స్పష్టంగా కనిపిస్తోన్న దవడ ఎముకలు.

అతను చేతిలోని గ్లాస్ ప్రక్కనే వున్న టీపాయ్‌మీద పెట్టి నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

నిలబడితే నాకన్న దాదాపు మూడంగుళాల ఎత్తున్నాడు. "థాంక్స్ ఫర్ ఒబ్లయిజింగ్!" అన్నాడు చెయ్యి ముందుకు చాస్తూ.

నేనతని చేతివైపు నిదానంగా చూశాను. వెడల్పుగా బలమైన వేళ్ళు. "అపరిచితుల్తో చేతులు కలిపే అలవాటు లేదు నాకు" అన్నాను.

చిన్నగా నవ్వాడతను. "ఓ. అయామ్ సారీ మిస్టర్ విశాల్! అయామ్ గాడ్సన్. బాబ్ గాడ్సన్. ఫ్రమ్ డెట్రాయిట్" అన్నాడతను.

నేను మౌనంగా అతనితో కరచాలనం చేశాను. "ప్లీజ్ సిడవున్! మిక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్!" అన్నాడు గాడ్సన్ తన ఎదురుగా వున్న కుర్చీ చూపెట్టి తను కూర్చొంటూ.

నేను కుర్చీలో కూర్చొంటూ ఆ గదిలో వున్న మరో వ్యక్తివైపు చూశాను.

నా చూపు గమనించి గాడ్సన్ నవ్వాడు. "హి యీజ్ సాటో! నా బాడీగార్డు! మేజర్ డెమీలాంటివాడు. అతనెప్పుడూ నా వెంటే వుంటాడు" అన్నాడు.

సాటో మా ఇద్దరికీ డ్రింక్స్ తెచ్చిపెట్టి తను గదిలో నుండి బయటకు వెళ్ళిపోయాడు.

"బిమాన్ హత్య గురించి నీకేం తెలుసు?" అన్నాను సూటిగా విషయానికి వస్తూ.

గాడ్సన్ తన విస్కీ ఓ గుటకవేసి నవ్వాడు. "నాట్ సో ఫాస్ట్! టెకెట్ యీజీ? ముందు నన్ను గురించి నేను చెప్పుకోనియ్యి" అన్నాడు.

"ఇంతకుముందే చెప్పినట్లు నేను అమెరికన్ని. సమ్ పీపుల్ కాల్ మి ఏనమెరికన్ మిలియనీర్. డెట్రాయిట్‌లో వున్న అనేక మోటారు కంపెనీలలో నేను షేర్‌హోల్డర్‌ని డైరెక్టర్ని. బహుశా డెట్రాయిట్ ఎక్కడ వుందో మీకు తెలుసనుకొంటాను."

తెలుసన్నట్లు తల వూపాను నేను. అమెరికా పశ్చిమ తీరంలో చికాగో నగరానికి దగ్గరగా వుంది డెట్రాయిట్. ఒకరకంగా అమెరికన్ మోటారు పరిశ్రమ కేంద్రస్థానం అని చెప్పాలి.

"ఓసారి పాస్‌పోర్టు, వీసా చూస్తే నీకే అనుమానమూ వుండదనుకొంటాను" అన్నాడు గాడ్సన్ టీపాయ్‌మీద వున్న ఆ రెండిటినీ నా చేతికిస్తూ.

అతని పాస్‌పోర్ట్‌ని, వీసాని ఓసారి చూసి ప్రక్కన పెట్టేశాను. అతను బాబ్ గాడ్సన్ కాదనడానికి ఆధారం ఏమీలేదు. పాస్‌పోర్ట్‌లో వున్న అతని ఫొటో ఆ విషయం స్పష్టంచేస్తోంది. అంతేకాదు. అతను భారతదేశాని కొచ్చి సరిగ్గా ఆరు రోజులైనట్లు కూడా వీసాలోని ఎంట్రీ స్టాంప్ వల్ల తెలుస్తోంది.

"ఇక అసలు విషయానికొస్తాను. నేను పారిశ్రామిక వేత్తనే అయినప్పటికీ, లక్షలకు అధికారినయినా అందరూ అనుకొనేంత బిజీ మనిషిని కాదు. నా తరపున బిజినెస్ మేనేజ్ చెయ్యడానికి ఎందరో బ్రిలియంట్ బిజినెస్ ఎక్సిక్యూటివ్‌లు, సొలిసిటర్లు, అకౌంటెంట్లు వున్నారు. డబ్బు ఈ ప్రపంచంలో చేయలేని పని దాదాపు ఏదీలేదు.

అంచేత చేతినిండా డబ్బు. దాన్ని ఖర్చుపెట్టడానికి సమయం వున్నాయి నాకు. అయితే కొంతమంది మిలియనీర్లలా గాంబ్లింగ్, ఇతర అలవాట్లలో నా సమయాన్ని, డబ్బును నేనెప్పుడూ వృథాచెయ్యలేదు. కొన్ని ప్రత్యేక హాబీలలో నా సమయాన్ని వెచ్చిస్తూవుంటాను. అందులో మొదటిది మౌంటినీరింగ్, రెండవది పాత పుస్తకాల సేకరణ.

మౌంటినీరింగ్‌లో నీ అంత పేరుప్రఖ్యాతులు లేకపోయినా రాఖీ, ఆండిస్ మొదలయిన పర్వతశ్రేణుల్లోని కొన్ని ఎత్తైన శిఖరాలను నేనూ కొందరు పర్వతారోహకుల బృందంతో కలిసి ఎక్కాను" గాడ్సన్ విస్కీ ఓ సిప్‌చేసి సిగరెట్ దమ్ములాగి నావంక చూశాడు.

"వెరీ ఇంటరెస్టింగ్ మిస్టర్ గాడ్సన్"—అన్నాను నేను అతన్ని మరింత పరిశీలనగా చూస్తూ....పర్వతారోహణ అతని హాబీ అయితే అది నాకు వృత్తి....

ప్రతి సంవత్సరం అనేకమంది ఔత్సాహిక పర్వతారోహకులకు శిక్షణ ఇస్తుంటాను నేను. నేను శిక్షణ ఇస్తున్న ఓ బృందం వచ్చే వేసవిలో ఎవరెస్టు మరోసారి అధిరోహించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అంచేతే గాడ్సన్ తాను పర్వతారోహకుణ్ణి అని చెప్పగానే అతని మీద వెంటనే

నాకు మరింత ఇంటరెస్టు కలిగింది.

గాడ్సన్ బలమైన చేతులు, పొడవుగావున్నా, బలంగా ఉక్కు తీగెలా వున్నా అతని శరీరం అతని మాటల్ని ధృవ పరుస్తోన్నాయ్. బలమైన చేతులు లేని మనుషులు పర్వాతా రోహణకు ఏ మాత్రం పనికిరారు.

"ఇక నా రెండవ హాబీ పాత పుస్తకాల సేకరణ అని చెప్పాను. నా పర్సెనల్ లైబ్రరీలో ఇప్పటికి దాదాపు పది వేల పుస్తకాలున్నాయి. అందులో చాలా వరకూ పంతొమ్మి దవ శతాబ్దంలో ప్రచురితమయిన గ్రంథాలే. ఇలా నేను సేకరించిన పుస్తకాలలో పంతొమ్మిదవ శతాబ్దం చివరి భాగంలో....సరిగ్గా చెప్పాలంటే పద్దెనిమిది వందలతొంభై ఆరులో ప్రచురింపబడిన పుస్తకం ఒకటి అదృష్టవశాత్తు గత సంవత్సరం నాకు లభించింది. అది భారత దేశంలో బ్రిటిష్ సైన్యంలో మేజర్‌గా పనిచేసిన స్మిత్ అనే బ్రిటిషర్ వ్రాసిన పుస్తకం.

భారత దేశంలో వుండగా తన అనుభవాలను స్మిత్ అప్పట్లో పుస్తకరూపంలా ప్రచారించాడు. ఆ పుస్తకం చదువుతుండగా హిమాలయ పర్వతాల గురించి కొన్ని చిత్ర మైన విషయాలు వ్రాశాడు స్మిత్.

స్మిత్ ఇండియాలో పనిచేస్తున్నప్పుడే ప్రపంచంలో ఎత్తైన శిఖరంగా పరిగణింపబడుతోన్న మౌంట్ ఎవరెస్ట్ కనుగొనబడింది. అయితే అదే సమయంలో హిమా లయాల్లో ఎవరెస్ట్ శిఖరంకన్నా ఎత్తైన శిఖరం ఒకటున్న దని, సర్వే ఆఫ్ ఇండియా ఆఫీసుల్లో జరిగిన పొరపాటు వల్ల, ఆ శిఖరానికి బదులు మరో శిఖరాన్ని ఎత్తైన శిఖరంగా ప్రకటించారని కొన్ని వాదోపవాదాలు బయలుదేరాయి.

స్మిత్ ఈ విషయాలను గురించి వ్రాస్తూ, ఈ వాదనలో కొంత నిజం వున్నదనీ, మౌంట్ ఎవరెస్ట్ కనుగొనక పూర్వం నుండీ టిబెటన్లకు టిబెట్‌లో వుండే బౌద్ధమత గురువులైన 'లామా'లకు ప్రపంచంలో ఎత్తైన శిఖరం హిమాలయాల్లో వున్నట్లు తెలుసుననీ. దాన్ని వారు 'షాంగ్రీలా' అని పిలుస్తారనీ స్మిత్ వ్రాశాడు.

అంతేకాకుండా ఈ 'షాంగ్రీలా' ఖచ్చితంగా ఏ ప్రాంతంలో వున్నదీ, దాన్ని ఏ రకంగా చేరుకోవలసిందీ ఈ బౌద్ధ 'లామా'లకు తెలుసుననీ, కాని మత రీత్యా వున్న కొన్ని అభ్యంతరాలవల్ల వారు మౌనంగా వుంటున్నారనీ మేజర్ స్మిత్ వ్రాశాడు.

నిజానికి టిబెటన్ భాషలో 'షాంగ్రీలా' అంటే 'దేవతలు విహరించే స్థలమని' అర్థం. తాము పవిత్రంగా భావించే ఆ ప్రదేశంలోకి నాగరిక మానవులు దాడి చెయ్యడం ఇష్టంలేక 'షాంగ్రీలా' ఎక్కడవుందో తెలిసినా టిబెటన్ లామాలు బయటపెట్టడం లేదని స్మిత్ వ్రాశాడు.

ఈ విషయం చదివిన వెంటనే నాకు హఠాత్తుగా ఈ హిమాలయాల మిస్టరీమీద ఇంట్రస్టు కలిగింది. వెంటనే హిమాలయాల గురించి నాకు దొరికినంత వరకూ సమాచారాన్ని సేకరించాను.

నేను సేకరించిన సమాచారంబట్టి స్మిత్ వ్రాసిన దానిలో చాలా వరకూ నిజం వున్నదని అర్థమయింది నాకు.

కాని నిరంతరం మంచులోనూ, మంచు మబ్బుల్లోనూ కప్పబడి వుండే హిమాలయాల్లో ఎవరెస్ట్‌కన్నా ఎత్తైన శిఖరం ఏ ప్రాంతంలో వుంటుందో ఖచ్చితంగా ఎవరూ చెప్పలేక పోయారు."

—ఒక్క నిముషం చెప్పడం ఆపి, కాలిపోయిన సిగరెట్ను ఫైర్ప్లేస్లోకి విసిరేసి మరోటి వెలిగించాడు గాడ్సన్.

నేను మెల్లిగా కొద్దిగా బ్రాందీని చప్పరించాను. "అవును. మౌంట్ ఎవరెస్ట్కన్నా ఎత్తైన శిఖరం వుందని ఎవరెస్ట్ కనుగొనబడిన దగ్గర్నుండీ అనేక వాదోపవాదాలు జరిగాయి. కాని ఆ విషయం ఇదమిద్ధంగా ఇంతవరకూ తేలలేదు. నిజానికి చైనీయులు ఆ శిఖరాన్ని కనుగొన్నారనీ, అయితే ఛైర్మన్ మావో వందవ జన్మదిన కానుకగా ఆ శిఖరాన్ని సమర్పించి దానికాపేరు పెట్టడానికి ఆ విషయం దాస్తున్నారనీ కూడా కొందరు అంటున్నారు" అన్నాను నేను ఎవరెస్ట్ కాంట్రవర్సీ గురించి నాకు తెలిసిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకొంటూ.

"యస్! యు ఆర్ రైట్! ఆ విషయం కూడా తెలిసింది నాకు! దాదాపు ఆర్నెల్లక్రితం భారతదేశం, పాకిస్థాన్, ఇంగ్లండ్లలో వున్న పెద్ద వార్తాపత్రిక లన్నిటిలోనూ ఓ ప్రకటన చేశాను నేను. హిమాలయ పర్వతశ్రేణుల గురించి, షాంగ్రీలా గురించి కొత్త ఇన్ఫర్మేషన్ ఇవ్వగలిగిన వాళ్ళకు తగిన బహూమతి వుంటుందని ప్రకటించాను.

నా ప్రకటనకు జవాబుగా అనేకమంది దగ్గర్నుండి అనేక వుత్తరాలు, సమాచారం అందింది నాకు. అయితే వాటిలో ఇదివరకు నా దగ్గరలేని కొత్త విషయాలు ఏమీ లేవు.

అయితే దాదాపు నెలరోజుల క్రితం డెట్రాయిట్లో నా నివాసానికి కెయిత్ముల్లరీ అనే అతను వచ్చాడు. ముల్లరీ ఇంగ్లండు దేశస్థుడు. కెయిత్ తాతగారు జాన్ముల్లరీ బ్రిటిష్ ఇండియాలో సర్వేయర్గా పనిచేశాడు"అని ఆగాడు గాడ్సన్

నావైపు దీర్ఘంగా చూస్తూ.

జాన్ ముల్లరీ అనే పేరు వినగానే నా మెదడులో ఏ మూలో అలారం బెల్ మ్రోగసాగింది. ఎక్కడో విన్న పేరది.

మనసంతా కేంద్రీకరించి ఆలోచించాను. ఎస్. ఇప్పుడు తట్టింది. మా తాతగారు పండిట్ విక్రందేవ్, జాన్ ముల్లరీలు అప్పట్లో సర్వే ఆఫ్ ఇండియా సంస్థలో ఉద్యోగులు. వందేళ్ళ క్రితం హిమాలయాల స్వరూపాన్ని గురించి అంతగా తెలియనప్పుడు వీళ్ళిద్దరూ నేపాల్ ప్రాంతమంతా తిరిగి మాప్ తయారుచేసినట్లు నాన్నగారు అప్పుడప్పుడూ చెప్పేవారు.

గాడ్సన్ చిన్నగా నవ్వాడు. "నేను చెబుతున్న విషయంలో లింక్ అర్థమవుతూవుండాలి నీకు" అన్నాడు.

అవునన్నట్లు తలూపాను. "కాని స్పష్టంగా ఏమీ తెలియడంలేదు."

"చెపుతాను. 1868 ప్రాంతంలో నేపాల్, సిక్కిం ప్రాంతాలలోని హిమాలయ పర్వతశ్రేణులను సర్వేచేసి మాప్‌లు తయారుచేసిన ఇద్దరు ప్రముఖులు విక్రందేవ్, జాన్ ముల్లరీలు. అయితే ఆ సమయంలోనే వారిద్దరూ అదృష్టవశాత్తు 'షాంగ్రీలా'ను చేరుకోవడానికి దారి కనుక్కొన్నారు."

"వాట్? అన్ బిలీవబుల్" అన్నాను ఆశ్చర్యంగా.

"నేనూ మొదట అలాగే అనుకొన్నాను. కాని కెయిత్ ముల్లరీ నాకు చూపెట్టిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ చూసింతరువాత నమ్మకతప్పలేదు" అన్నాడు గాడ్సన్ లేచి బార్ దగ్గరికి వెళ్ళి తన గ్లాసు నింపుకొంటూ.

"ఏమిటా డాక్యుమెంటరీ ఎవిడెన్స్?" అడిగాను.

"నీకు నిజంగా తెలియక అడుగుతున్నావా విశాల్?" అన్నాడు గాడ్సన్ తిరిగివచ్చి తన చైర్లో కూర్చొంటూ.

"హానెస్ట్ టుగాడ్! నాకు ఏమీ తెలియదు," అన్నాను నేను గాడ్సన్ ప్రశ్న అర్థంకాక ...

"ఓకె. ఐ హావ్ నతింగ్ టు లూజ్! చెబుతాను విను. విక్రందేవ్, జాన్‌లు బౌద్ధ లామాల వేషంలో నేపాల్ సిక్కిం ప్రాంతమంతా పర్యటిస్తూ సర్వేచేశారు.... ఆ పర్వతాల్లో వారు సంచరిస్తున్న సందర్భంలో అదృష్టవశాత్తు 'షాంగ్రీలా'కు వాళ్ళిద్దరూ దారి కనుక్కోవడం జరిగింది. అనుకోని విధంగా ఈ షాంగ్రీలా ఎవరెస్ట్‌కన్నా ఎత్తైన శిఖరంచుట్టూ వుందని తెలిసింది.

ఈ పర్వతప్రాంతమంతా, సరిగ్గా చెప్పాలంటే ఈ 'షాంగ్రీలా' శిఖరం బంగారు, వెండి లోహాల సమ్మేళనంతో ఏర్పడిందనీ, దాన్ని చేరుకోవడం వందేళ్ళ కొకసారే సాధ్యపడుతుందనీ జాన్‌ముల్లరీ తన కొడుకుకు, అంటే కెయిత్‌ముల్లరీ తండ్రికి వ్రాసిన ఉత్తరంలో పేర్కొన్నాడు."

"ఉత్తరమా?" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"ఐయామ్ సారీ! విషయం పూర్తిగా చెప్పలేదు నేను" అని విస్కీ మరో గుటకవేసి, "మొదట విక్రందేవ్, జాన్‌లు షాంగ్రీలాను కనుగొన్నప్పుడు వారికి నిజమైన 'షాంగ్రీలా' చూసే అవకాశం లేకపోయింది. జాన్‌ముల్లరీ ఉత్తరాన్నిబట్టి నేను తెలుసుకొన్న దేమిటంటే షాంగ్రీలా శిఖరంచుట్టూ అంతులేని అఖాతం వుందనీ.... ఆ అఖాతం వందేళ్ళ కొకసారి పూడిపోయి షాంగ్రీలాకు దారి ఏర్పడు

తుందనీను. ఆ వివరాలన్నీ ఆ ఉత్తరం చదివినప్పుడు నీ కర్థమవుతాయి.

అంచేత వారిద్దరూ షాంగ్రీలావరకూ చేరుకోగలిగారు గాని, షాంగ్రీలాను చేరుకోలేకపోయారు.... అయితే ఇండియాకు తిరిగొచ్చేముందు వారిద్దరూ కలిసి ఒక ఒప్పం దానికి వచ్చారు.

అదేమంటే మళ్ళీ మరో వందేళ్ళకు, అంటే ఈ సంవత్సరం చివరికి సరిగ్గా వందేళ్ళు పూర్తవుతాయి— మళ్ళీ షాంగ్రీలాకు దారి ఏర్పడుతుందనీ, కాబట్టి ఆ రహస్యాన్ని అంతవరకూ దాచి, తమ తర్వాతి తరాలవారికే ఆ శిఖరాన్ని కనుక్కొన్న కీర్తి దక్కాలనీ వారు నిశ్చయించుకొన్నారు. ఆ ఒప్పందం ప్రకారంగా 'షాంగ్రీలాను' చేరుకొనే దారి చూపించే మాప్ ఒకదాన్ని తయారుచేశారు.

భద్రతకోసం ఆ మాప్‌ను మధ్యకు రెండు ముక్కలుచేసి, ఓ సగం విక్రందేవ్, మరో సగం జాన్‌ముల్లరీ తీసుకొన్నారు. అంటే భవిష్యత్తులో తిరిగి ఆ రెండు కుటుంబాల వారు మాత్రమే కలిసి ఆ శిఖరాన్ని చేరుకోవాలని వాళ్ళ వుద్దేశ్యం అన్నమాట. అంటే ఆ మాప్ రెండు ముక్కలూ కలిపితే తప్ప షాంగ్రీలా చేరుకొనేమార్గం తెలియదన్న మాట.

జాన్‌ముల్లరీ ఈ మాప్‌ను, మరికొన్ని వివరాలున్న ఓ ఉత్తరాన్ని తనకొడుకు కెయిత్‌ముల్లరీకి అందజేశాడు. అయితే కెయిత్‌ముల్లరీ తన తాతగారి ఆశయాలకు అను గుణంగా పెరగలేదు.

కెయిత్‌ముల్లరీకి, అటు సరైన విద్యగానీ, పర్వతారోహణలో శిక్షణగాని లేవు. వాటిమీద అతనికి ఇంట్రస్టూ

లేదు. దానికితోడు ఆస్థికూడా ఏమీ లేకపోవడంతో జులాయిగా తయారయ్యాడు. అతను హిరాయిన్, ఎల్. యస్. డి. లాటి మత్తుపదార్థాలకు కూడా అలవాటుపడ్డాడని నా అను మానం.

ఏమయితేనేం అతి దీనదశలో వున్న కెయిత్‌ముల్లరీ అతి హీనదశలో వున్నప్పుడు ఇంగ్లండు పత్రికల్లో వెలువడిన నా ప్రకటన చూడడం తటస్థించింది. వెంటనే అతను నన్ను కలుసుకొన్నాడు—ఆ పత్రాలకు ఎంతో కొంతముట్టక పోతుందా అనే వుద్దేశ్యంతో.

కెయిత్ ఇచ్చిన పత్రాలు చదవగానే ముందు నాకు ఆశ్చర్యం, తరువాత ఎంతో ఉత్సాహం కలిగాయి. పదివేల డాలర్లకు ఆ రెండు పత్రాలనూ అతని దగ్గర్నుండి కొన్నాను నేను. నిజంగా 'షాంగ్రీలా' వుంటే దాన్ని కనుక్కోవాలి అనే నిశ్చయం నాలో దృఢపడింది. వెంటనే ఇండియా బయలుదేరి వచ్చాను.

బహుశా నేను ఇండియా ఎందుకు వచ్చానో ఇప్పటికి నీకు అర్థమయి వుంటుంది. ముల్లరీ నాకమ్మిన మాప్ రెండవభాగం నీదగ్గరుంది. పండిత్ విక్రందేవ్‌కు వున్న ఒకే ఒక్క మనవడివి నువ్వు. సో.... తప్పకుండా ఆ మాప్. మీ తాతగారు నీకు అందచేసి వుండాలి. అందుకే నిన్ను వెతుక్కొంటూ ఇండియా వచ్చాను" అన్నాడు గాడ్సన్. విశాల్‌వైపు ప్రశ్నార్థకంగా చూసి,

నేను బ్రాందీ గ్లాసులో మిగిలిన ద్రవాన్ని గొంతులో పోసుకొని తల అడ్డంగా వూపాను.

"సారీ ఫ్రెండ్! నా దగ్గర అలాంటి మేప్‌లుగాని, ఉత్తరాలుగాని ఏమీలేవు. నిజంగా అలాంటి ఋజువేమైనా

వుంటే, ఎవరెస్ట్‌కన్నా ఎత్తైన శిఖరాన్ని కనుక్కోవడానికి ఆ సగం మాప్‌తోనే నేను బయలుదేరి వుండేవాణ్ణి. పైగా మా తాతగారు నేను పుట్టకముందే పోయారు. మానాన్న నాలాగే పర్వతారోహకుడు. కాంచనగంగ శిఖరాన్ని ఎక్కిన మొదటి బృందం సభ్యుడాయన. నిజంగా అలాంటి మేప్ వుండివుంటే షాంగ్రీలాను కనుక్కోడానికి ఆయనే ప్రయత్నించి వుండేవాడు. లేదా కనీసం నాకన్నా అందజేసి వుండేవారు?" అన్నాను.

"మెబి యు ఆర్ స్పీకింగ్ ది ట్రూత్! కాని మీ నాన్నగారు ఓ ప్లెయిన్ యాక్సిడెంట్‌లో పోయారని విన్నాను. తను అంత త్వరగా చనిపోతానని ఆయన అనుకొని వుండరు. పైగా..... మీ నాన్నగారు చనిపోయేప్పటికి నీ వయస్సెంత?" అడిగాడు గాడ్సన్.

"పదిహేను."

"అప్పటికి మౌంటెనీరింగ్‌లో నీకు ప్రవేశముందా?"

"అప్పుడే మౌంటెనీరింగ్ నేర్చుకుంటున్నాను." అన్నాను అతని ప్రశ్న అర్థంకాక.

"యుసీ మై పాయింట్? బహుశా నీవు మౌంటెనీరింగ్‌లోనూ రాక్‌క్లైయింబింగ్‌లోనూ పూర్తి నిష్ణాతుడవయ్యే వరకూ నీ ఫాదర్ ఆవిషయం చెప్పదలచుకోలేదనుకొందాం. ఈలోగా ఈ యాక్సిడెంట్‌లో ఆయన పోయారు. బహుశా ఆ ఉత్తరాలు, మేప్ మీ ఇంట్లో వుండివుండాలి" అన్నాడు గాడ్సన్ నావైపు రెప్పవెయ్యకుండా దీక్షగా చూస్తూ.

రాత్రి జరిగిన సంఘటనలు నా కళ్ళముందు ఒక్కసారి గిర్రున తిరిగాయి. బహుశా గాడ్సన్ నిజమే చెపుతూ వుండివుండాలి.

"ఇంతకూ రాత్రి నా ఇంట్లో జొరబడి బిమాన్‌ను హత్యచేసిందెవరు?"

"కెయిత్‌ముల్లరీ."

"అంటే కెయిత్‌ముల్లరీ ఆ మేప్‌ను దొంగిలించడం కోసమేనా ఇంట్లో జొరబడి బిమాన్‌నుహత్యచేశాడంటావా?" అన్నాను సాలోచనగా.

"అవును రాత్రి నీ ఇంట్లో ప్రవేశించింది ముల్లరీయే అయివుండాలి. ముల్లరీ దగ్గిర ఆ పత్రాలు కొనేప్పుడు ఓ విషయం స్పష్టంగా తెలుసుకోవడం మరిచిపోయాను నేను. అదే నేనుచేసిన పొరపాటు.... బహుశా ముల్లరీ దగ్గర నాకు అమ్మిన పత్రాల నకళ్ళు వుండివుండాలి. అంచేత ఆ పత్రాలు అమ్మి సంపాయించిన సొమ్ముతో ఇండియా చేరుకొని నీ మాప్‌ను సంపాయించి తనే 'షాంగ్రీలా' చేరుకొనడానికి ముల్లరీ ఎత్తువేసి వుండాలి."

"అసలు ఆ పనిచేసింది ముల్గరీ అని ఋజువేమిటి? మరెందుకోసమో ఆ దొంగతనం జరిగివుండొచ్చుగా?" అన్నాను నేను.

"నో విశాల్! రెండ్రోజుల క్రితం నీ ఇంటిప్రాంతాల్లో ముల్లరీ తచ్చాడడం సాటో చూశాడు. నీవు కలకత్తా వెళ్తావని తెలిపి నీ ఇంటిప్రాంతంలో సాటోని కాపలా పెట్టాను. అతనూ నిన్ను కలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అను కొన్నానుగాని, ఇలా ఇంట్లో జొరబడతాడని అనుకోలేదు. సాటోను చూసి ముల్లరీ పారిపోయాడు. నేను రంగం లోకి దిగితే నీ దగ్గరనుండి ఆ పత్రాలు సంపాయించడం కష్టమని గ్రహించి, నీవు రాకముందే ఆ పత్రాలు సంగ్ర హించడానికి ఇంట్లో ప్రవేశించి వుంటాడు...." అన్నాడు గాడ్సన్....

"ఎక్కడున్నాడు ముల్లరీ ఇప్పుడు" అన్నాను బిమాన్ మరణం గుర్తుకివచ్చి. మళ్ళీ నాలో కోపం పెల్లుబుకుతోంది.

"అదే తెలియదు.... ఈ రెండ్రోజులబట్టీ అతన్ని ట్రేస్ చెయ్యడానికి ప్రయత్నిస్తూనే వున్నాను. నన్ను డబుల్ క్రాస్‌చేసినందుకు వాణ్ణి చితకొట్టాలని నాకూ వుంది."

"ఐసీ!" అన్నాను సిగరెట్ వెలిగిస్తూ "ముల్లరీ అమ్మిన పత్రాలు నేను చూడొచ్చా?" అన్నాను.

"షూర్! కాని అవి నా దగ్గరలేవు. ఈ వూరు రాగానే వాటిని మర్కెంటెయిల్ బ్యాంకు సెప్టీవాల్ట్‌లో దాచాను. వాటిని నా దగ్గర అట్టిపెట్టుకొని రిస్క్ తీసుకోవడం ఇష్టం లేదు" అన్నాడు.

"మరో విషయం గాడ్సన్! అసలు ఆ పత్రాలన్నీ నిజమైనవనీ, నకిలీలు కావనీ, ముల్లరీ నిన్ను మోసం చెయ్యడం లేదనీ గ్యారంటీ ఏమిటి?"

గాడ్సన్ చిన్నగా నవ్వాడు. "ఆ పత్రాలను చూడగానే నాకూ అదే అనుమానం వచ్చింది. అందుకే వెంటనేవాటిని ఆర్కియలాజికల్ ఎక్స్‌పర్ట్స్‌చేత పరీక్ష చేయించి, కార్బన్ డేటింగ్ టెస్ట్‌లు చేయించాను. ఆ కాగితాలు, సిరా అన్నీ పంధొమ్మిదవ శతాబ్దంలోవేనని ఋజువయింది." అన్నాడు.

"ఐసీ! రేపొకసారి ఆ పత్రాలు తీసుకొస్తావా? నేను చూడాలి...." అన్నాను.

"సారీ బ్రదర్ ....రిస్క్ తీసుకోదలచుకోలేదని ముందే చెప్పాను నీకు. ఆ పత్రాలు చూపింం తరువాత నీవు మళ్ళీ కనిపిస్తావని గ్యారంటీ ఏమిటీ? ఆ మేప్‌ను గుర్తు పెట్టుకొని, మరో మాప్‌గీసి, నీ దగ్గర మ్యాప్‌తో కలిపి నీ ఒక్కడవే షాంగ్రిలాకు వెళ్ళిపోవని గ్యారెంటీ ఏమిటి?" అన్నాడు గాడ్సన్.

"డోన్ట్‌బి సిల్లీగాడ్సన్! అసలా రెండోమేప్ నా దగ్గర లేనే లేదు" అన్నాను కోపంగా. నవ్వాడు గాడ్సన్.... "అందుకనే నీవా రెండోమాప్ సంపాదించు మీ ఇంట్లోనే ఎక్కడో వుంటుందది. లేదా అది ఎక్కడవుందో తెలిపే క్లూ అయినా దొరుకుతుంది. అది దొరికింతరువాత మనిద్దరం ఒకేసారి కూర్చొని రెండింటినీ కలిపి పరిశీలిద్దాం."

నేను లేచి నిలబడ్డాను. "ఓకె గాడ్సన్! యు ఆర్ ఎ గుడ్ కంపెనీ!" అన్నాను బయటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడ నవుతూ.

గాడ్సన్ కూడా లేచి నిలబడ్డాడు.... "ఇటీజ్ మై ప్లెజర్ విశాల్! కాని ఓ విషయం గుర్తుపెట్టుకో! ఈ రహస్యం ఎవరికీ తెలియనియ్యకు. ముల్లర్ ఈ హత్య చేసినట్లుతెలిస్తే పోలీసులు డొంకంతా కదుపుతారు. విషయం ఏ మాత్రం బయటపడినా ఈ వార్త నిముషాల్లో ప్రపంచమంతటా పాకి పోతుంది. ఆ తర్వాత మన చేతుల్లో ఏమీ వుండదు"— అన్నాడు నాతో పాటే గది బయటకు వస్తూ....

"షూర్! ఐవిల్ రిమెంబర్‌దట్ గుడ్‌నైట్ గాడ్సన్!" అన్నాను బయట చలిగాలిలోకి అడుగుపెడుతూ....

సర్రున ఓ చిన్న స్పోర్ట్స్ కారు వచ్చి ఆగింది నా ప్రక్కన "ప్లీజ్ గెటిన్ మిష్టర్ విశాల్....మిమ్మల్ని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు డ్రైయివింగ్ సీట్లోంచి సాటో.

## 4

ఇంటి ముందు సాటో కారు ఆపేటప్పటికి రాత్రి ఒంటి గంటయింది.

"థాంక్స్ సాటో!" అన్నాను కారు దిగుతూ.

"ఇటీజ్ నథింగ్‌సర్! గుడ్‌నైట్!"—అన్నాడు సాటో

కారు రివర్స్ చేసుకొంటూ....

సాటో కారు సందు మలుపు తిరిగేవరకూ అలాగే నిలబడి మెల్లిగా ఇంటివైపు అడుగులు వేశాను. చలిగాలి రివ్వున వీస్తోంటే సింకోనా చెట్లు గమ్మత్తయిన హోరు సృష్టిస్తు న్నాయి. క్షణం రాత్రి జరిగిన సంఘటనలు గొర్తొచ్చి ఒళ్ళు గగుర్పొడిచింది. కాని రాత్రి సంఘటనకన్నా గాడ్సన్ మాటలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

నిజంగా 'షాంగ్రీలా'వుందా? తాతగారు నిజంగా దేవతలు విహరించే షాంగ్రీలాకు దారి కనుక్కొన్నారా? ఏమో ఆయన వ్రాసిన మాప్ నేను స్వయంగా చూసేవరకూ నమ్మలేను.

తలుపు తాళం తీసి హాలులోకి అడుగు పెట్టాను. తలుపు మూసి తలుపు ప్రక్కనే వున్న స్విచ్ నొక్కాను. క్షణం పాటు గుండె జల్లుమన్నది. గుడ్లప్పగించి అలానే చూస్తూ వుండిపోయాను.

"వెల్‌కం బాక్ మిస్టర్ విశాల్! పిచ్చిపనులుచెయ్యక!" అతని చేతిలో పిస్తోలు సూటిగా నా గుండెల మీదికి గురి పెట్టబడి వుంది.

ఊపిరి పీల్చడం మానేసినట్టు శిలా ప్రతిమలా అలాగే నిలబడి పోయాను....

దాదాపు ఇరవై అయిదు సంవత్సరాలుంటాయి అతనికి. ఆంగ్లేయుడని చూడగానే తెలుస్తోంది. భుజాలమీదకు పడు తోన్న రాగిరంగుజుట్టు, దుబ్బుగా పెరిగిన గడ్డం, మీసాలు, సన్నని కనుబొమల క్రింద కలలు కంటున్నట్లు కళ్ళు, పెద్ద ముక్కు, నోరు వుందా, లేదా అన్నట్లున్న సన్నని పెదిమలు వులెన్ స్వెట్టరు, కేన్వాస్‌తో కుట్టిన జీన్స్ వేసుకున్నాడతను.

కాళ్ళకు ఇన్‌షులేటెడ్ రబ్బరు బూట్సులు.

సందేహంలేదు. ఇతనే కెయిత్ ముల్లరీ అయివుండాలి. గుండె వేగం తగ్గి మామూలుగా కొట్టుకోవడం మొదలెట్టింది.

"నిన్ను గురించి అంతా ఇప్పుడే తెలుసుకొని వస్తు న్నాను ముల్లరీ!" అన్నాను నేను గంభీరంగా.... అతని కళ్ళల్లో క్షణం ఆశ్చర్యం కనిపించింది. "సో గాడ్సన్‌ను కలుసుకొన్నావన్న మాట" అతని కంఠస్వరం కీచుగాను, పెద్దదిగానూ వుంది....

"యస్! నువ్వారివాల్వర్ ప్రక్కనపెట్టేస్తే ఇద్దరం కూర్చొని మాట్లాడుకోవచ్చు" అన్నాను కదలకుండానే. కీచుగా నవ్వాడు ముల్లరీ. "ఇది రివాల్వర్ కాదు ఆటోమాటిక్ పిస్తోలు... పిచ్చివేషాలు వేస్తే దీనిలోని ఎనిమిది గుళ్ళూ నీ గుండెల్లోంచి దూసుకుపోతాయి"

"సారీ! పిస్తోలుకు, రివాల్వర్‌కు మధ్య తేడా అంతగా నాకు తెలియదు. వాటి అవసరం నా కెప్పుడూ కలుగలేదు. ఈ పిస్తోలుతోనేనా బిమన్‌ని, టైగర్ని కాల్చి చంపావు?" నాలో మళ్ళీ కోపం రగులుకొంటోంది. ఏదో ఓ రకంగా వీణ్ణి మాటల్లోపెట్టి, ఆ పిస్తోలు లాక్కొని చితకదన్నాలని పిస్తోంది....

"ఓహ్! వాడి పేరు బిమన్ అన్నమాట పూర్ ఫెలో ఒక్క షాట్‌కి చచ్చిపోయాడు. ఆ కుక్క మాత్రం బుల్లెట్ తగిలినా నా కాలు కరిచి కాని చావలేదు...." అన్నాడు ముల్లరీ.

'శభాష్ టైగర్' అనుకొన్నాను మనసులోనే "ఏం కావాలి ఇప్పుడు నీకు?" అడిగాను.

"దిప్లాన్! షాంగ్రీలా ప్లాన్!" అన్నాడు ముల్లరీ నవ్వుతూ....

"నిన్ని క్షణంలో పోలీసులకు పట్టిస్తే నీకు ఉరిశిక్ష పడుతుందని మరచిపోయినట్లున్నావు. దొంగతనంతో పాటు హత్యచేసిన నేరానికి నీకు సులభంగా మరణదండన విధిస్తారు" అన్నాను అతని చేతులమీదినుండి దృష్టి త్రిప్పకుండా.

"హాంగింగ్ మై ఫుట్! ఎక్కడుందా ప్లాన్" అరిచాడు ముల్లరీ.

"అంత విలువైన వస్తువుని ఇంట్లో ఎలా పెడతాననుకొన్నావ్ ముల్లరీ! అది నా బ్యాంక్ లాకర్‌లో వుంది. నేను పర్సొనల్‌గా వెళితే తప్ప ఆ లాకర్‌ని తెరవనివ్వరు" అన్నాను నవ్వుతూ.

"ఐ డోంట్ బిలీవిట్!" అన్నాడు కోపంగా.

"అది నీ ఖర్మ. నిజం చెపితే నమ్మకపోతే నిన్నేమనుకోవాలి? ఆ ప్లాను బ్యాంకు లాకర్‌లో వుంది కాబట్టే అది నిన్న ఎంత వెతికినా నీకు దొరకలేదు. ఇప్పటికయినా ఆ రివ్వాలర్ ప్రక్కనపెట్టి మనిషిలా ప్రవర్తించు" అన్నాను ఒకడుగు ముందుకువేసి.

"యు ఆరె లయ్యర్" అన్నాడు చటుక్కున నా దగ్గరికి వచ్చి ఎడమచేత్తో చెంపమీద ఈడ్చికొడుతూ. అదే అతను చేసిన పొరపాటు.

దగ్గరినుండి చూస్తే తెలుస్తోంది నాకూ, అతనికీ వున్న తేడా. ఇద్దరం తలపడితే అతన్ని నిముషంలో చిత్తుచెయ్యగలను.

అతని కుడిచేతి వేలు ట్రిగ్గర్‌మీదనుండి ప్రక్కకు తప్పుకోవడం గమనించాను.

చటుక్కున నా రెండు చేతుల్తో అతని కుడిచెయ్యి మణి

కట్టు దగ్గర గట్టిగా పట్టుకొని, నా తలతో అతని రొమ్ము మీద గుద్దాను. ఊహించని ఆ దెబ్బకు ముల్లరీ బాలెన్సు తప్పి క్రిందపడ్డాడు. అతన్తోపాటు అతనిమీద నేనూ పడ్డాను. అతని చేతిలోనుండి పిస్తోలు జారిపోయి దూరంగా పడి పోయింది.

ఇక సంకోచించలేదు నేను. శక్తికొలదీ అతన్ని పిడి కిళ్ళతో గుద్దసాగాను. ముల్లరీ తన రెండు చేతుల్నీ నా మెడ చుట్టు బిగించాడు అన్ని గుద్దుల మధ్యాను గాలిగొట్టంమీద చెయ్యివేసి గట్టిగా నొక్కుతున్నాడు.

అతని జుట్టును రెండు చేతుల్తోనూ పట్టుకొన్నాను. గొంతును మరింత గట్టిగా పట్టుకొని వాడి తలను నేలకేసి బాదాను.

కీచుగా అరిచాడు ముల్లరీ. మరుక్షణం అతని చేతులు నా గొంతుమీది పట్టు వదిలేశాయి. స్పృహ పోయిందని గమనించి లేచి నిలబడ్డాను. చకచక ముల్లరీ శరీరాన్ని మూల నున్న కుర్చీ దగ్గరికి లాక్కెళ్ళి దాంట్లో కూలేశాను. డ్రాయ ర్లోంచి తాడుతీసి కాళ్ళూ చేతులూ కట్టేశాను.

## 5

గాడ్సన్ చెప్పినట్లు తాతగారు విక్రందేవ్ 'షాంగ్రిలా'కు వెళ్ళే మాప్‌గాని నాకోసం అట్టే పెట్టివుంటే అది ఎక్కడ వుంటుంది? తాతగారు ఆ మాప్‌ను నాన్నకిస్తే ఆయన ఎక్కడ దాచినట్లు?

ఇంట్లో రహస్యంగా దాచడానికి రహస్యప్రదేశాలేమీ లేవు. బిమాన్ బ్రతికుంటే నాకు సహాయకారిగా వుండే వాడేమో ఈ విషయంలో....

మెల్లిగా ఒక్కొక్క గదే వెతకనారంభించాను.

డ్రాయర్లలోనూ, స్టోర్ రూమ్ పెట్టెల్లోనూ నాన్నగారికి సంబంధించిన అన్ని కాగితాలు వెతికాను. ప్రయోజనం లేకపోయింది.

చివరికి పూజామందిరం ఒకటి మిగిలిపోయింది. ఆ చిన్న గదిలోకి అడుగుపెట్టాను.

వెంటిలేటర్ నుండి వచ్చే కాంతి తప్ప గదంతా చీకటిగా వుంది. స్విచ్ నొక్కి దీపం వెలిగించాను. గది మధ్యగా శివపార్వతుల విగ్రహం వుంది చిన్న మంటపంలో....

దేవుడి మంటపం తప్ప గదిలో వేరే సామానేమీలేదు. గది మధ్యగా అడుగు ఎత్తున కట్టిన సిమెంటు దిమ్మమీద దాదాపు మూడడుగుల ఎత్తున చెక్కతో చేసిన మంటపం వుంది.

మండపం మధ్యలో గంధంతో చేసిన శివపార్వతుల విగ్రహాలు....దాదాపు రెండడుగుల ఎత్తుంటాయి. శివుడు మా ఆరాధ్యదైవం....మాకేకాదు ఈ పర్వతాల్లో నివసించే అనేక హిందువులకు శివుడు ఆరాధ్యదైవం....

నేను ద్వారం దగ్గరే నిలబడి శివపార్వతుల విగ్రహం వైపు తదేకంగా చూశాను. విగ్రహాల మెడల్లో రెండు రోజుల క్రితం వేసిన పూలదండలు వాడిపోయి కనిపిస్తు న్నాయి. శివపార్వతులు నవ్వుతూ నావైపే చూస్తున్నట్లని పించింది....

నిజంగా షాంగ్రిలా వుంటే దాన్ని చేరుకొనే మార్గం నాకు తెలిసేలా చెయ్యమని రెండు చేతులూ జోడించి మౌనంగా ప్రార్థించాను. కళ్ళు తెరిచేప్పటికి శివపార్వతు లింకా నవ్వుతూనే వున్నారు. మెల్లిగా విగ్రహాల దగ్గరికి వెళ్ళాను. విగ్రహాలవైపు పరీక్షగా చూశాను. అన్నీ యధా

తథంగా ఎప్పటిలానే వున్నాయి ...

అప్పుడు గుర్తొచ్చింది హఠాత్తుగా. నా చిన్నతనంలో ఈ గంధం విగ్రహాలకు బదులు కంచువిగ్రహాలు వుండేవని పూజామందిరంలో. ఆ విగ్రహాలు మధ్యలో ఎప్పుడు తీసి ఈ గంధం విగ్రహాలు పెట్టారో నాకు గుర్తులేదుగాని ఆ విగ్రహాల అడుగునుండి చూస్తే లోపలంతా బోలుగా కనిపించేది....

చకచక క్రిందికి పరిగెత్తాను. స్టోర్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు తెరిచినాను. నేలమాళిగలోకి చెక్కతో పర్మెనెంట్‌గా వేసిన మెట్లున్నాయి. క్రిందికి దిగుతున్నప్పుడే నిచ్చెనకే ఎటాచ్‌చేసి ఎలెక్ట్రిక్ స్విచ్ వుంటుంది. నొక్కాను. సెల్లర్‌లో దీపం వెలిగింది.

పాత ఫర్నిచరు, కొన్ని చెక్కపెట్టెలు అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఆ కంచు శివపార్వతుల విగ్రహం అక్కడే వుంది.

చటుక్కున విగ్రహాన్ని రెండు చేతుల్లోకి తీసుకొన్నాను. చాలా బరువుగా వుంది. వెనక్కి త్రిప్పిచూశాను. నా గుండెలు క్షణం కొట్టుకోవడం మానేసి తిరిగి గబగబ కొట్టుకోసాగాయి. విగ్రహం అడుగుభాగమంతా పూర్తిగా సీసంతో మూసివేసివుంది.

"దిసీజిట్!" అనుకొన్నాను ఆనందంగా.

ఏదో తెలియని ఉత్సాహం. ఉద్రేకం అంతరంగాన్ని కదుపుతోన్నాయి. విగ్రహాన్ని భద్రంగా పట్టుకొని సెల్లర్ రూమ్‌లోనుండి బయటకు వచ్చాను. హాలులో డ్రాయర్లో నుండి ఎలెక్ట్రిక్ స్మాల్టర్ బయటికి తీశాను. ఈ స్మాల్టర్‌తో చిన్నచిన్న మొత్తాలలో లోహాలు కరిగించడం, అతికించడం

చెయ్యవచ్చు.

స్మాల్టర్ పిడినుండి వ్రేలాడుతున్న వైర్‌తో ప్లగ్‌లో గుచ్చాను. నిముషంలో స్మాల్టర్ కొస ఎర్రగా వేడెక్కింది. విగ్రహాన్ని టేబుల్‌మీద బల్లపరుపుగా పెట్టి అడుగును సీసం అంచులకు స్మాల్టర్ కొనను తగిలించాను. మరుక్షణం సీసం కరిగిపోనారంభించింది.

విగ్రహం అడుగున వున్న సీసం అంతా కరిగించి ఊడ దియ్యడానికి దాదాపు ఇరవై నిముషాలు పట్టింది. సీసం సీలును తొలగించి నిముషంపాటు కళ్ళప్పగించి విగ్రహం బోలులోకి చూస్తూ వుండిపోయాను. ఏదో నల్లటి వస్తువు కనిపిస్తోంది. విగ్రహాన్ని ముట్టుకుంటే చేయి కాలుతుందని తెలుసు స్మాల్టర్ వేడివల్ల.

నాలో ఎక్సయిట్‌మెంట్ క్షణక్షణానికీ పెరిగిపోతోంది. ఐదు నిముషాల తర్వాత రెండువేళ్ళూ లోనికి పోనిచ్చి ఆ నల్లటి వస్తువుని బయటికి లాగాను.

నల్లని తోలుతో చేసిన సంచి అది. దాదాపు అడుగు పొడవు. ఆరంగుళాల వెడల్పు వుంది. నిలువుగా నాలుగు మడతలువేసి పెట్టడంవలన ఆ విగ్రహం బోలులో పట్టింది. నాలుగువైపులా కుట్టబడివుంది. చాకు తీసుకొని చకచకా కుట్లు ఊడదీశాను.

లోపల నాలుగు మడతలువేసిన రెండు మందమైన కాగితాలున్నాయి. నీరుకావిరంగులో చాలా పాతగా కనిపిస్తున్నాయవి. వాటిని బయటకు తీస్తోంటే ఏదో 'టంగ్'మని శబ్దంతో క్రిందపడింది. క్రిందకు వంగి దాన్ని తీశాను.

చిన్న ఉంగరం అది. చాలా బరువుగా వుంది. ఏ లోహంతో చేశారో తెలియదు. చిత్రమైన రంగులో వుంది. బంగారమూ, వెండీ, కంచూ, రాగీ ఏదీ కాదది. బహుశా

# చెప్పుకోండి చూద్దాం?

1. గుడ్డను చీల్చుకుంటూ దూసుకుపోయిన ఒక రివాల్వర్ 'బుల్లెట్' కు ఆ గుడ్డ యొక్క దారపు పోగులు అంటుకుని వుంటాయా?

2. నేరస్తులను కొట్టడానికి పోలీసు వుద్యోగస్తులకు ప్రభుత్వం అనుమతిస్తుందా?

3. ఇంకా కొన్ని గంటలలో వురితీయబడవలసిన వ్యక్తి 'ఆత్మహత్య' చేసుకొని మరణించాడు. అయితే ప్రభుత్వం ఆ శవాన్ని ఏమి చేస్తుంది?

4. ఇటునుండి అటువైపుకి మెడను చీల్చుకుంటూ వెళ్ళిన 'బుల్లెట్'వల్ల గాయపడిన వ్యక్తి బ్రతికే అవకాశం వుందా?

5. రివాల్వర్స్ కున్నట్లే కత్తులకు కూడా 'లైసన్స్' అవసరమా?

6. ఒకరికి 'లైసెన్స్' వున్న రివాల్వర్ తో వేరొకరు కాల్చవచ్చా?

7. ఒక రోగికి వున్న వ్యాధిని పరీక్షించకుండా డాక్టర్ మందు వాడడం చట్టరీత్యా నేరమా?

— కె. చందర్‌రావ్.

జవాబులు :

1. వుండవు. 2. ఇవ్వరు.

3. నిర్ణయించబడిన సమయానికి 'ఆ శవాన్నే' వురితీసి పూడ్చి వేస్తారు. 4. వుంటుంది.

5. అవసరం లేదు. 6. కాల్చకూడదు.

7. అవును. ప్రపంచంలో అన్ని నేరాల కంటె పెద్ద నేరం.

రకరకాల లోహాలతో కలిపి చేసివుండాలి. రాయి వుండవల సిన చోట శివుడి తల చెక్కివుంది. కుడిచేతి మధ్యవేలుకు పెట్టుకొన్నాను. సరిగ్గా సరిపోయింది.

రెండు కాగితాలూ మడతలు విప్పాను. గట్టిగా పట్టు కొంటె చిరిగిపోయేట్లున్నాయి అవి. అందులో....ఒకటే మాప్ అని స్పష్టంగా తెలుస్తోంది. రెండవది టాపు సైజు కాగితంమీద వ్రాసిన ఉత్తరం....

శివుడి తలవున్న ఆ వుంగరం పెట్టుకొని ఆ కాగితాలు ముట్టుకోగానే చిత్రమైన సంచలనం ప్రారంభమైంది నాలో. ఏదో తెలియని మహత్తర శక్తి నాలో ప్రవేశించినట్లు అను భూతి కలుగుతోంది. ఒక్కసారి ఎడమచేత్తో ఆ వుంగరాన్ని తడిమి చూసుకొన్నాను. స్పర్శకు చల్లగా, అతి శీతలంగా తగుల్తోంది. ఎవరిదీ వుంగరం? తాతగారిదా? ఏమిటి దీని ప్రత్యేకత?

సోఫాలో కూలబడి సిగరెట్ వెలిగించాను. గాడ్సన్ మాటల్లో నిజం ఋజువయిందిప్పుడు. నా చేతిలోని వస్తు వుల విలువ అమూల్యమైనదని తట్టినప్పుడు ఒక్కక్షణం తెలియని భయం కలుగుతోంది.

షాంగ్రీలాలో నిజంగా దేవతలు విహరిస్తారా? మానవులు అక్కడికి వెళ్ళి దేవతల్ని చూడగలరా? సిగరెట్ ఓ మూలకి విసిరేసి ఆ ఉత్తరాన్ని తెరిచాను.

పొందికయిన చిన్న అక్షరాలు....ఏ రంగు సిరాయో తెలియడంలేదు. అక్షరాలు మాత్రం కనిపిస్తున్నాయి. చద వడం ప్రారంభించాను.

"ప్రియ దౌహిత్రునకు—

నేనీ ఉత్తరం వ్రాసే సమయానికి నువ్వే లోకంలో

# అపరాధ పరిశోధన పోటీ-98 [ఫలితాలు]

సెప్టెంబర్ '76 నెల 'అపరాధ పరిశోధన పోటీ_98' కి సరియైన సమాధానాలు :

1. చైనా.
2. నూనెలు.
3. ముష్టివారు.
4. క్యాన్సర్.
9. అమెరికా.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి డిసెంబర్ '76 నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేతలు :

(1) శ్రీ కె. వి. ప్రసన్నం,
క్వార్టరు నెం. G - 143,
సెక్టర్—7,
సునాబేడా—763 002,
(కోరాపూట్ జిల్లా).

(2) శ్రీమతి జి. లక్ష్మీకామేశ్వరి,
అనంతపురం.
(పూర్తి చిరునామా వ్రాయలేదు.)

(3) శ్రీ ఏ. చంద్రశేఖరరావు,
కేరాఫ్—ఏ. కె. రావు,
మథిలి—764 044,
(ఒరిస్సా స్టేట్.)

వున్నావో నాకు తెలియదు. ఇప్పటికింకా నువ్వీ ప్రపంచం లోకి రాలేదు. నేను బ్రతికుండగా వస్తావేమో కూడా తెలియదు. నేను బ్రతికివున్నా లేకపోయినా ఈ వుత్తరమూ, దానితో జతచేసిన పటము నీకు సురక్షితంగా అందాలని ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.

కైలాస నగరాన్ని గురించి మన పురాణాల్లోనూ, ప్రాచీన గ్రంథాలలోను అనేకచోట్ల ప్రస్తావన వుంది. ఈ కైలాసనగరం ఎక్కడ వుందో ఖచ్చితంగా ఎవరూ చెప్ప లేకపోయినా, హిమాలయ శిఖరాల్లో ఎక్కడో వున్నట్లు అనేకమంది పేర్కొన్నారు.

స్వర్గంనుండి దేవతలు దిగివచ్చి విహరించే ఈ కైలాస నగరం ఏ ప్రాంతంలో వుందో తెలుసుకోగలిగినందుకు ఒకందుకు గర్వంగానూ, ఆ కైలాస నగరంలోకి వెళ్ళలేక పోయినందుకు ఎంతో విచారంగానూ వుంది నాకు. కనీసం నా తర్వాతి తరాలవారైనా ఈ పవిత్ర నగరంలో అడుగుబెట్టి పునీతులవ్వాలని నా ఆకాంక్ష.

అయితే, ఈ పని నేనే ఎందుకు చెయ్యలేకపోయాను? లేక మీ నాన్ననే ఆ పని ఎందుకు చెయ్యమని అడగలేదని నీవు ఆశ్చర్యపడుతూ వుండవచ్చు. దానికి చాలా కారణాలు వున్నాయి. అసలు నేను, నా మిత్రుడు, ఆంగ్లేయుడుఅయిన జాన్‌ముల్లర్ కైలాసనగరం ఆనుపానులు ఎలా తెలుసుకో గలిగామో చెపితే నీకు ఆ సమస్యకు సమాధానం దొరుకు తుంది.

1872 సెప్టెంబరులో నేపాలు, సిక్కిం ప్రాంతాలను, ఆ ప్రాంతాల హిమశిఖర పర్వతశ్రేణులను వీక్షించి, సర్వేచేసి హిమాలయ ప్రాంతాల గురించి ఓ సమగ్రమైన, అర్థవంత

# అపరాధ పరిశోధన పోటీ-100

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-11-'76 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జనవరి' 77 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. అక్టోబరు 12 వ తేదీన 95 గురు ప్రయాణీకులతో బొంబాయి దగ్గర కూలిపోయిన విమానం __ ? (బోయింగ్, కారవెల్.)

2. ప్రస్తుత చైనాదేశ అధ్యక్షులు __ ? (హువా కువో, మదాంచియాంగ్ చింగ్.)

3. దీనికోసం ఎంతటి ఘాతుకమైనా చేయడానికి కొందరు వెనుదీయరు __ ? (అధికారం, డబ్బు.)

4. మానవజాతి మనుగడకు యివి అవసరమే __ ? (విద్యాలయాలు, దేవాలయాలు.)

5. పిల్లలకు ఇవంటే ఇష్టం __ ? (కథలు, బొమ్మలు.)

మైన పటం తయారుచెయ్యడానికి మన ప్రభుత్వం నన్నూ, ముల్లరీని హిమాలయాల్లోకి పంపింది.

అప్పట్లో హిమాలయాల్లోని అనేక కొండజాతులవారూ, టిబెట్ ప్రభుత్వమూ మన ప్రభుత్వానికి చాలా వ్యతిరేకంగా వుండేవారు. భారతీయుల్నెవర్నీ ఆ ప్రాంతాలలోనికి రానిచ్చే వారు కాదు. అంచేత మేమిద్దరం టిబెటియన్ లామాల్లాగా వేషం వేసుకొని సిక్కిం ప్రాంతంగుండా టిబెట్‌లోకి ప్రవేశించాం.

టిబెట్‌లో సంచరిస్తూండగా మేము ఆటవికుల బారిన పడడం తటస్థించింది. వారినుండి తప్పించుకొని పారిపోతూ అరుణా నదిని చేరుకొన్నాము.

అరుణానదిలో సామాన్లతో ప్రయాణం చేస్తూండగా మా బోటు తిరగబడి మా పరికరాలన్నీ నదిపాలయ్యాయి. ఎలాగో అరుణానది పడమటి ఒడ్డు చేరుకొన్నాం. అయితే అంత దురదృష్టంలోనూ కొంత అదృష్టం మావైపు వుంది. నా జేబులోని దిక్సూచి మాత్రం వాటి పాలవకుండా మిగిలి పోయింది.

తిరిగి అరుణానది అవతలివైపుకు దాటగల శక్తీ, ధైర్యమూ లేవు. ఆ నది దాటి అవతలకు వెళ్ళినా మళ్ళీ ఏ ఆటవికుల బారినో పడే అవకాశం వుంది. అంచేత అక్కడినుండి నేపాల్‌లోకి ఖాట్మాండూ చేరుకోవాలని కాలినడకన బయలుదేరాము. హిమాలయశ్రేణుల్ని దాటితే గాని కుదిరే పని కాదది. అయినా మేము బయలుదేరిన కార్యమే హిమాలయా ప్రాంతాన్ని సర్వే చేయడం గాబట్టి నా దిక్సూచి సహాయంతో ముందుకు సాగాము.

దారి, తెన్నులేని ప్రయాణం అది....చాలా చిత్రమైన

# "జీవిత చందా"

1. 'జీవిత చందా' కు మీరు చేయవలసిందల్లా, రు. 250/- లు (సుమారు ఆరున్నర సంవత్సరాల చందా) ఒకేసారి పంపటమే. డబ్బు మణియార్డరు/డ్రాఫ్టు/చెక్కు ఏదైనను పంపవచ్చును.

2. డబ్బు మాకు చేరిన తర్వాత నెలనుండి మొదలు పెట్టి మీకు "అపరాధ పరిశోధన" పత్రిక లేదా సప్లిమెంట్ ను మీ జీవితకాలమంతా అందజేస్తాము. పోస్టు ఖర్చులు అన్నీ మావే.

3. మీ జీవిత కాలంలో పత్రిక ధర పెరిగినా లేదా జీవిత చందాను పెంచినా సభ్యులనుండి నయాపైస కూడా అదనంగా మళ్లీ వసూలుచేయటం జరుగదు.

4. ఏ కారణంచేతనైనా మధ్యలో మీరు 'జీవిత చందా'ను విరమించుకోదలచినా, పత్రిక నిలిచిపోయినా అప్పటివరకు మీకు పంపిన కాపీల ఖరీదు మినహాయించి, మిగతా పైకం త్రిప్పి పంపబడుతుంది.

5. మీరు 'జీవిత చందా' ఒకేసారి కట్టలేనివారైతే, నెలసరి వాయిదాలలోకూడా చెల్లించవచ్చును. మొదటి నెల రు. 30/- లు, ఆ తర్వాత వరుసగా 11 నెలలు రు. 20/- లు చొప్పున మణియార్డరుద్వారా పంపాలి. వాయిదా పైకం ప్రతినెలా 20 వ తేదీలోపల మాకు అందజేయాలి. వాయిదాలు సక్రమంగా పంపకపోయినా, మధ్యలో నిలిపివేసినా, సభ్యత్వము రద్దుచేసి అంతవరకు పంపిన డబ్బుకు వచ్చేంతవరకు పత్రికలు పంపబడును.

మీరు ఒక్కసారి ఖర్చుపెట్టండి. జీవితకాలమంతా మీకు "అపన" తోడుగా వుంటుంది. మీ ఇంటిల్లిపాదికి ఆనందాలను వెదజల్లుతుంది!!!

సంఘటనలు, అనుభవాలు జరిగాయి మా ప్రయాణంలో. దాదాపు నెలరోజులు ప్రయాణం చేశాము. ఇంకా ఎంత దూరం ప్రయాణం చెయ్యాలో తెలియదు. అంతులేని ఆ పర్వతశ్రేణులు ఎంతవరకూ విస్తరించి వున్నాయో లెక్క కట్టడానికి, మాకు ఆధారాలు లేవు.

ఆ పర్వతశ్రేణిలో దారితప్పాము. అయితే అంత శ్రమ లోనూ మా ప్రతి కదలికా మేము గుర్తు పెట్టుకొంటూనే వున్నాము. మేము నడచిన దూరాన్ని గజాలు, మైళ్ళ దూరంలో కొలవడానికి మా దగ్గిర కొలబద్దలు లేవు. ఎంత దూరం నడిచినా, ఎన్ని అడుగులు వేశామో లెక్కలేసు కొంటూపోయాము.

అక్టోబరు మాసానికి ఓ పర్వతశ్రేణి చేరుకొన్నాము. పర్వతశ్రేణి అనడంకన్నా, రెండు పర్వతశ్రేణుల మధ్య లోయ అనొచ్చు దాన్ని. పగలు కూడా దట్టమైన పొగమంచు ఆవరించివున్నది. చుట్టూవున్న పర్వతశిఖరాలన్నీ మంచుతో కప్పబడి వున్నాయి. చెట్టుచేమలనేవి లేవు. ఆశ్చర్యంగా ముందుకు సాగాము.

అప్పుడే గమనించాము. ఆ ప్రదేశంలోని ప్రతీ రాయి, ప్రతి శిల ధగధగ మెరుస్తోంది. సందేహంలేదు. అది బంగారం. స్వచ్ఛమైన సువర్ణం అది. హిమాలయాల్లోని ఓ బంగారు ఖనిని కనుక్కొన్నామనే వుత్సాహంతో ముందుకు సాగాము. మరికొంతదూరం వెళ్ళేప్పటికి మా ముందు పొగ మంచు విడిపోయింది.

ఎదురుగా ధగధగ మెరుస్తోన్న మేలిమి బంగారపు పర్వతం కనిపిస్తోంది. తలెత్తి దాని అంచును చూడాలని ప్రయత్నించాము. ఉహూ.... మెడలు పూర్తిగా వెనక్కి

# సప్లిమెంట్ పోటీ-24 [ఫలితాలు]

సెప్టెంబర్ '76 నెల "సప్లిమెంట్ పోటీ_24" కి సరియైన జవాబు :

| | | | | |
|---|---|---|---|---|
| 166 | 165 | 167 | 164 | 168 |

పై విధంగా సరియైన జవాబు ఇద్దరు పాఠకులు వ్రాశారు. వీరిలో శ్రీ జి. కె. భాస్కర్, బొంబాయి గారు పోటీ నిబంధనల ప్రకారం తగిన పోస్టేజి పంపని కారణంగా బహుమతి నిరాకరించబడినది.

శ్రీమతి టి. శకుంతలగారికి డిసెంబర్ '76 నెలనుండి ఒక ఏడాదిపాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీమతి టి. శకుంతల,

ఇంటి నెంబరు : 7/11,

పోస్టు : కొండాపురం,

వయా : నందిపేట,

తాలూకా : ఆర్మూరు,

(నిజామాబాద్ జిల్లా.)

వంచి చూసినా. మేమున్న దూరంనుండి కూడా ఆ పర్వత శిఖరం అంచులు మాకు కనిపించలేదు. తెల్లని మంచు మబ్బులు మధ్య ఏమాత్రం దృష్టికి అందకుండా వుంది. ఆ పర్వతం దగ్గరికి చేరాలనే ఆతృతతో ముందుకు నడిచాము.

లోయ అంచున హఠాత్తుగా ఆగిపోవలసి వచ్చింది. లోయ అంచునుండి ఆ పర్వతశిఖరంవరకూ నీరు.... కాదు పాదరసం.... కాదు పాదరసంలాంటి నీరు.... లోతు చూద్దామని చిన్నరాయి వేశాం.... శబ్దం లేకుండా మునిగి పోయింది.... అంతులేని అఖాతం అయివుండాలి అది.... వంగి ముట్టుకొని చూశాము. వేళ్ళుకాలి బొబ్బలెక్కాయి నిముషాల్లో.... అప్పుడు గమనించాము.... పర్వతం క్రింది భాగంకూడా పొగమంచుతో కప్పబడివుందని.

మేము చూసింది కాస్త పొగమంచు పలుచగా వున్న మధ్యప్రదేశం.... ఆ నీటి అంచునే ముందుకుసాగాము. ఎక్కడయినా దాటడానికి వీలుంటుందేమోనని.... లేదు.... గమ్మత్తేమిటంటే అలా నడిచి నడిచి తిరిగి బయలుదేరిన చోటుకే వచ్చాము. దాదాపు అయిదారు గంటలు నడిచాము. అంటే ఆ పర్వతశిఖరంచుట్టూ వలయాకారంలో ఆ పాదరసపు సరస్సు వుందన్నమాట.

ఏం చెయ్యాలో తోచని పరిస్థితి....దూరంగా కనిపిస్తున్న సువర్ణ పర్వతం....దగ్గరికి వెళ్ళడానికి దారిలేదు. ఆ క్షణంలో ఆ సరస్సునుండి మా వైపు ఈదుకొస్తోన్న ఓ వింత మృగం కనబడింది. భయంతో కొయ్యబారి పోయాము. మరిగే ఆ పాదరసంలో ఈదుకువస్తున్నదంటే అదో భయంకరమైన మృగం అయ్యుండాలి.

మేము చూస్తుండగానే ఆ ఆకారం గట్టుపై కొచ్చింది. కీచుమంటూ వికృతంగా అరిచింది. —(సశేషం)

# "హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇప్పటికే వేలాది పాఠకులు సభ్యులుగా చేరారు. వెంటనే మీరూ చేరండి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్నిఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్ గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోక పోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని కూడ వి. పి. ద్వారా పంపగలము.

7. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ ద్వారా 'హోమ్ డెలివరీ' ఏర్పాటు వున్నది: రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, హైదరాబాదు, అనకాపల్లి, తెనాలి, పామిడి, కరీంనగర్, శ్రీశైలం ప్రాజెక్టు, హిందూపురం, తాడేపల్లిగూడెం, నెల్లూరు, భీమవరం, బెల్లంపల్లి, నంద్యాల, కర్నూలు.

# అ. ప. న. ఫ్రెండ్స్ క్లబ్

అ. ప. న. పాఠకు లందరికీ ఆహ్వానం :

మీరు పదిమందికి ఏదో మంచి చేయాలనుకుంటు న్నారా? మీ ప్రతిభను స్నేహం ద్వారా బహిరంగ పరచదలచారా? ప్రపంచంలోని వింతలను, విశేషాలను, స్నేహితులతో తెలుసుకోనదలచారా? రచయిత(త్రు) లతో పరిచయం పెంపొందించదలచారా? మొదలయిన వాటికి "అ. ప. న. ఫ్రెండ్స్ క్లబ్" అవకాశం ఇవ్వ డానికి సిద్ధంగా వుంది. మీ అభిరుచులకు ప్రతిబింబంగా నిలచి చేయూతనీయదలచింది.

ఈ క్లబ్‌లో స్త్రీ, పురుషు లందరూ చేరవచ్చు. క్లబ్ కోసం మంచి సలహాలు ప్రతి ఒక్కరూ పంప వచ్చు. క్లబ్ నుండి ఆకర్షణీయంగా వెలువడే 'సావినీర్' ప్రతిసారి మెంబర్స్‌కు ఉచితంగా పంపబడును.

మెంబరుషిప్ కై రూ. 2/- లు M. O. చేస్తూ మీ అడ్రసుతో పూర్తి వివరాలకు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి.

అడ్రసు :

K. చందర్ రావు,

చీఫ్ అడ్వయిజర్, 'అ.ప.న. ఫ్రెండ్స్ క్లబ్,'

6-4-461, భోలక్‌పూర్, సికింద్రాబాద్-500 003.

కార్యవర్గ సభ్యులు :

| | | |
|---|---|---|
| శ్రీ L. రాంగోపాల్ | .... | ప్రెసిడెంట్ |
| శ్రీ కాసారపు సంజీవయ్య | .... | జనరల్ సెక్రటరీ |
| శ్రీ M. రమేశ్ | .... | ట్రెజరర్ |
| శ్రీ R. జీవన్ | .... | సభ్యులు |
| శ్రీ M. శంకరరెడ్డి | .... | సభ్యులు |

# ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరు వేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం. డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమ వ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

## గత నెల పోటీ ఫలితాలు

(1) అక్టోబర్ '76 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

దెయ్యం చేతిలో దీపాలు!

ధీరుడి చేతిలో పిస్తోలు!!

పంపినవారు: శ్రీ ఏ. చంద్రశేఖరరావు, కేరాఫ్— ఏ. కె. రావు, మథిలి—764 044 (ఒరిస్సా స్టేట్.)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పగతో భగభగ!

గుండెలో గుబగుబ!!

పంపినవారు: శ్రీ కె. ఎమ్. రావ్, కేరాఫ్—మధు ఆర్ట్సు, మోహన్ టాకీస్ చౌరస్తా, నిజామాబాదు.

# లేఖలు

అక్టోబర్ '76 సంచికలో కథలు అన్నీ బాగున్నాయి. సప్లిమెంట్‌లో ఒక్క 'చావు జోస్యం' మాత్రం బాగుంది. రచయిత్రికి అభినందనలు. మిగతా నవలలు అన్నీ కొత్త సీసాలో పాత సారాలాగా ఉన్నాయి.

—డాక్టర్ ఏ. ప్రభాకర్‌రావు, తిరుచ్చి-14.

ముత్యాల దొంగలు, కాటేసిన పగ, ప్రమాదకరమైన పాచి—కథలు ఉత్తమంగా వున్నాయి. 'పరలోక ప్రాప్తి' సీరియల్ ముగింపు ఉత్తేజకరంగా వుంది. ఇటువంటి ముగింపు మా ఊహకయినా అందలేదు. సప్లిమెంట్‌లో నా కిష్టమైన నవలలు చెక్కబొమ్మ, చావుజోస్యం.

—సి. హెచ్. రాజా, బొంబాయి-12

ఈ నెల సప్లిమెంట్‌లో 'చావుజోస్యం' నవల చాలా బాగుంది. మిగతా నవలలు కూడ ఫరవాలేదు. 'క్రైమ్‌లో తమాషాలు' కడుపుబ్బ నవ్విస్తున్నాయి. కొత్త సీరియల్ 'అజ్ఞాతదీవులు' బాగుంది. 'ఖైదీ'లాంటి మరో సీరియల్ తొందరగా వేయగలరు.

—ఎన్. క్రిష్ణసాగర్‌రెడ్డి, సంగెం.

'మీరే ఎన్నుకోండి' శీర్షికకు యీ నెల ఏ నవలను ఎన్నుకోవాలో అర్థం కాలేదు. వి. నాగేశ్వరరావు, వసుంధర

అజీజ్‌గార్ల రచనలు ఉత్తమంగా ఉన్నాయి— సరిసమాన స్థాయిలో కాబట్టి ఎటూ పాలుపోక లాటరీ పద్ధతిలో ఉత్తమ నవల ఎన్నుకోవాల్సి వచ్చింది. నవలల్ని ప్రచురించడంలో మీరు చూపిస్తున్న శ్రద్ధకి నా అభివందనలు!

—కాసారపు సంజీవయ్య, జగిత్యాల.

అక్టోబరు నెల సప్లిమెంట్‌లో 'అంతరిక్ష దొంగలు' నవల మాకు చాలా బాగుంది. రచయిత అజీజ్‌గారికి మా హృదయపూర్వక అభినందనలు.

—టి. కృష్ణకుమారి, నెల్లూరు.

ఈ నెల ప్రభాకర్‌గారి ముఖచిత్రాలు పత్రికకు వన్నె తెచ్చాయి. సంపత్‌గారి 'ప్రమాదకరమైన పాచి' ఎప్పుడో చూచిన ఇంగ్లీషు పిక్చర్ లాగుంది. ముత్యాల దొంగలు, వలలో చిక్కిన వనిత కథలు బావున్నాయి. వెంకట్రామ్‌గారి సీరియల్ 'అజ్ఞాతదీవులు' పత్రికే హైలెట్.

—డి. శ్రీనివాసులు రెడ్డయ్య, కడప.

'పరలోక ప్రాప్తి' సీరియల్ ముగింపు అనుకున్న విధంగా లేదు. సెప్టెంబర్ సంచికలోనే పూర్తి చేస్తే వెరైటీ, థ్రిల్ లభించేది. సీరియల్ బావుంది. రచయితకు ధన్యవాదాలు.

—యం. ఏ. గోపాల్, కూచనపల్లి.

ఈ నెల కథల్లో, నకిలీఖాతా, ద్రోహికి శిక్ష, అజ్ఞాత దీవులు ఉత్తమంగా వున్నాయి. 'పరలోకప్రాప్తి' సీరియల్

మాకు చాలా ఆనందాన్నిచ్చింది. రాబోయే సీరియల్ కోసం ఎదురు చూస్తున్నాము.

—జి. రమేష్‌కుమార్, హైద్రాబాదు.

వసుంధర గారి 'చావు జోస్యం' నిజంగా మేలిరకమైన ఆణిముత్యమే. పత్రికలో వేట, ప్రమాదకరమైన పాచి కథలు మాకు ఎంతో నచ్చాయి. కొత్త సీరియల్‌లో మిగతా పదిహేను అజ్ఞాతదీవుల కోసం ఎదురు చూస్తున్నాము.

—ఎన్. సాయికృష్ణప్రసాద్, హైద్రాబాదు-34

అక్టోబరు నెల "అపన" ముగ్ధమనోహరంగా ఉన్నది. శీర్షికలు తగ్గించేసినా కరువుతీరా కథలున్నాయి. 'ప్రమాదకరమైన పాచి' కథ వైజ్ఞానికంగా వినూత్నంగా ఉన్నది. 'అజ్ఞాతదీవులు' మార్వలెస్. ముత్యాల దొంగలు, కాటేసిన పగ, వలలో చిక్కిన వనిత కథలు ఈ మాసం ప్రత్యేకంగా వున్నాయి.

—మందలపు రోశయ్య, బండ్లవారి పాలెం.

"అపన"లో కథల విషయానికొస్తే ఏది ఉత్తమంగా వుందో తేల్చి చెప్పడం కష్టం! ఎందుకంటే ప్రతి కథలో ఏదో ప్రత్యేకత వుంటుంది. రాబోయే శ్యాంబాబుగారి కొత్త సీరియల్‌కై వేచియున్నాం.

—లతీఫొద్దీన్ అహమద్, సుల్తానాబాద్.

---

Edited and Published by S. DAMODAR REDDY (phone: 36959) 3-4-554 Narayanaguda, Hyderabad-500029, and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd no. H/HD-4